



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY









SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 54 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 17 నవంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


## 2028లో చంద్రయాన్-4 మిషన్



- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏడు కీలక ప్రయోగాలు
- 2035 నాటికి 'ఇండియన్ స్పేస్ స్టేషన్' సిద్ధం
- 2040 నాటికి చంద్రుడిపైకి భారత వ్యోమగాములు
- ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడి

5

## బెంగాల్ రాజ్ భవన్‌లో ఆయుధాలు



- న్యాయపరంగా ముందుకెళ్తా: గవర్నర్ ఆనంద బోస్
- ఎన్నికల ప్రక్రియను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు ఎస్ఐఆర్ చేపట్టడం ఎంతో అవసరం
- బీజేపీ నేరగాళ్లకు రాజ్‌భవన్‌లో ఆశ్రయం కల్పిస్తున్న గవర్నర్, వారికి బాంబులు, తుపాకులు సమకూర్చుతున్నారని ఆరోపణలు
- టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ సంచలన ఆరోపణ



## బుల్లెట్ రైలు ప్రాజెక్టు అనుభవాలతో 'బ్లూ బుక్'

- భవిష్యత్తులో పెద్దఎత్తున ఈ తరహా ప్రాజెక్టులను తీసుకొచ్చే విషయంలో దేశం నిర్ణయాత్మకంగా ముందుకు వెళ్లగలదు
- గత నమూనాల నుంచి నేర్చుకున్న విషయాలను ప్రతిబింబించాలి
- ఈ ప్రాజెక్టు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా ముందుకు సాగుతోంది
- సూరత్‌లో నిర్మిస్తున్న స్టేషన్‌లో ఇంజినీర్లు, ఇతర సిబ్బందితో ప్రధాని మోదీ భేటీ

5

# రెండు రాష్ట్రాలు కలిసి నడవాలి



- చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం
- తెలంగాణ, ఏపీ అభివృద్ధికి సహకరిస్తా
- రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఉప రాష్ట్రపతి సీపీఆర్
- తెలుగు భాష సంరక్షణకు కృషి: చంద్రబాబు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నెలకొన్న చిన్న చిన్న సమస్యలను ఇద్దరు ముఖ్యమంత్రులు చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చునని భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. కలిసి అడుగులు వేస్తే రెండు రాష్ట్రాలూ అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. ఇరు రాష్ట్రాల అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఆదివారం రామోజీ ఫిలింసిటీలో నిర్వహించిన రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవానికి ఉప రాష్ట్రపతి హాజరయ్యారు. - మిగతా2లో

# తీవ్ర ఆందోళనకరంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

- సీఎం చంద్రబాబుపై వైఎస్ జగన్ ధ్వజం
- 2025-26 తొలి ఆరు నెలల్లో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం వృద్ధి 7.03 శాతమే
- గతేడాదితో పోల్చితే ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో జీఎస్టీ, అమ్మకపు పన్ను ఆదాయాల వృద్ధి 2.85 శాతమే
- 2023-24 నుంచి 2025-26 మొదటి 6 నెలల్లో రాష్ట్ర సొంత పన్ను ఆదాయాల వార్షిక వృద్ధి రేటుతో పోల్చితే... ప్రస్తుత ఆర్థిక ఏడాది మొదటి ఆరు నెలల్లో వృద్ధి 2.75 శాతమే
- అయినా సరే రాష్ట్రం అద్భుతమైన వృద్ధి సాధిస్తోందంటూ ప్రజలను నమ్మించడానికి బాబు ప్రయత్నిస్తున్నారు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తామంటూ టీడీపీ, జనసేన నేతలు చెప్పిన దానికి విరుద్ధంగా రాష్ట్ర ఆర్థి క పరిస్థితి ఉందని స్పష్టం చేశారు. ఈ మేరకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదికల్లోని గణాంకాలను ఉటంకిస్తూ, ఆర్థి క నిర్వహణలో చంద్రబాబు సర్కార్ ఘోరంగా విఫలమైందంటూ కడిగిపారేశారు. రాష్ట్రం దూసుకుపోతున్నది కేవలం అప్పులు చేయడంలోనేనని పేర్కొన్నారు. కొసరంత ఆదాయం.. ఇసుమంత మూలధన వ్యయం.. కొండలా పెరిగిపోతున్న రుణభారం..! ఇదీ చంద్రబాబు విజన్..! అంటూ తన 'ఎక్స్' ఖాతాలో వైఎస్ జగన్ ఆదివారం పోస్టు చేశారు. అందులో ఆయన ఏమన్నారంటే... 2025–%26 ఆర్థి క సంవత్సరం మొదటి ఆరు నెలలకు సంబంధించి కాగ్ విడుదల చేసిన గణాంకాలను పరిశీలిస్తే.. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాల వృద్ధి అత్యంత నిరాశజనకంగా ఉందన్నది స్పష్టమవుతోంది. తాము అధికారంలోకి - మిగతా2లో



# ఎస్సీలకూ క్రీమీలేయర్



- ఆ తీర్పు ఇచ్చినప్పుడు నన్ను తీవ్రంగా విమర్శించారు
- అయినా తీర్పునకు కట్టుబడి ఉన్నా
- ఐఏఎస్ కొడుకు, కూలీ బిడ్డ సమానమా?
- ఎస్సీల్లో ఉపవర్గీకరణ బాధ్యతను
- రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాం
- ప్రాథమిక హక్కుల రక్షణలో కోర్టులదే కీలక పాత్ర
- న్యాయం చివరి పౌరుడి వరకు చేరాలి
- సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యలు
- ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం
- కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు
- జస్టిస్ గవాయ్ మానవతావాది: సీఎం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

షెడ్యూల్డ్ కులాల్లోని కొందరికి ఇప్పటికీ రిజర్వేషన్ ప్రయోజనాలు దక్కని పరిస్థితులు ఉన్నాయని, అలాంటివారికి ప్రయోజనం చేకూర్చేందుకు వీలుగా ఉపవర్గీకరణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగిస్తూ తీర్పు ఇచ్చామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ గుర్తుచేశారు. అందులో ఎస్సీలకూ క్రీమీలేయర్ వర్తింపజేయాలని చెప్పిన తనను తీవ్రంగా విమర్శించారని.. అయినప్పటికీ ఆ తీర్పును ఇప్పటికీ సమర్థించుకుంటున్నానని స్పష్టం చేశారు. హైదరాబాద్, బెంగళూరు వంటి పెద్ద నగరాల్లో విద్యను అభ్యసించే ఐఏఎస్ కుమారుడు, గ్రామంలో ఉండే పేద వ్యవసాయ కూలీ బిడ్డ ఇద్దరూ ఎస్సీ కులాలకు చెందినవారే అయినప్పటికీ.. ఇద్దరినీ సమానంగా చూడలేమన్నారు. అలా చూడడం సమాన అవకాశాలు నిరాకరించడమేనని సీజేఐ తేల్చి చెప్పారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆదివారం ఏపీలోని మంగళగిరిలో సీకే కన్వెన్షన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి సీజేఐ ముఖ్య అతి?థిగా హాజరయ్యారు. ఆయన, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం జ్యోతి - మిగతా2లో



# మంత్రి పదవులకు 'ఫార్ములా'

- ప్రతి ఆరుగురు ఎమ్మెల్యేలకు చొప్పున ఒక మంత్రి పదవి
- బిహార్‌లో ఎన్డీయే పక్షాల మధ్య అంగీకారం
- బీజేపీకి 14 మంత్రి పదవులు దక్కే అవకాశం
- ఈ నెల 19 లేదా 20న నూతన సీఎం ప్రమాణ స్వీకారం

వివరాలు 5లో..

# ఎస్సీలకూ క్రీమీలేయర్

-మొదటిపేజీ తరువాయి

ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ 'ఇండియా అండ్ ద లివింగ్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ ఎట్ 75 ఇయర్స్' అనే అంశంపై ప్రసంగించారు. ఈ దేశంలోని చివరి పౌరుడి వరకు న్యాయం అందాలని.. ఇది న్యాయవ్యవస్థ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రాథమిక హక్కుల పరిరక్షణలో కోర్టుల పాత్ర కీలకమని.. హక్కుల ఉల్లంఘన జరిగితే కోర్టులను ఆశ్రయించే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. మహారాష్ట్రలోని మారుమూల ప్రాంతమైన అమరావతి నుంచి వచ్చి.. న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థానాన్ని చేపట్టానంటే.. అందుకు భారత రాజ్యాంగమే కారణమని చెప్పారు.

**రాజ్యాంగం కల్పించిన హక్కుల వల్లే..**

'రాజ్యాంగం కల్పించిన హక్కుల కారణంగానే ఎస్సీ సామాజికవర్గానికి చెందిన కేఆర్ నారాయణన్, రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్రపతిగా చేశారు. మొదటిసారి మహిళా రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము ఉన్నారు. ఆమె కేవలం మహిళ మాత్రమే కాదు. గిరిజన సమాజానికి కూడా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాజ్యాంగం వల్లే ఒక చాయ్‌వాలా దేశానికి ప్రధానమంత్రి కాగలిగాడు. మీ సొంత రాష్ట్రం నుంచి ఎస్సీ వర్గానికి చెందిన బాలయోగి లోక్‌సభ స్పీకర్ అయ్యారు. అలానే మహిళా స్పీకర్‌గా మీరాకుమారి బాధ్యతలు నిర్వహించారు. రాజ్యాంగం వల్లే ఎస్సీ వర్గాలకు చెందిన వివిధ రాష్ట్రాల్లో సీఎస‌లు, డీజీపీలు అయ్యారు' అని సీజేఐ స్పష్టం చేశారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే నాలుగు స్తంభాలు మన రాజ్యాంగానికి మూలాధారాలని తెలిపారు. 75 ఏళ్లుగా శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు.. సామాజిక, ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకు పనిచేస్తున్నాయన్నారు. 'రాజ్యాంగం స్థిరమైన పత్రంగా ఉండకూడదని, వికాసం చెందుతూ సజీవపత్రంగా ఉండాలని అంబేడ్కర్ భావించారు. సామాజిక, ఆర్థిక సవాళ్లకు సమాధానం ఇవ్వడాన్ని అవసరమైనప్పుడు రాజ్యాంగాన్ని సవరించేందుకు వీలు కల్పించారు. 1951లో మొదటిసారి రాజ్యాంగానికి పార్లమెంటు సవరణ చేసింది. సుప్రీంకోర్టు సైతం రాజ్యాంగ సవరణ చేసే అధికారం పార్లమెంటుకే ఉందని చెప్పింది. సామాజిక, ఆర్థిక సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో పార్లమెంటు రాజ్యాంగ సవరణలు చేస్తూనే వస్తోంది' అని జస్టిస్ గవాయ్ వివరించారు.

**రెండు అమరావతులు.. యాదృచ్ఛికం**

'అమరావతిలోని ఒక చిన్న మురికివాడలోని మున్సిపల్ పాఠశాల నుంచి వచ్చిన నేను న్యాయవ్యవస్థలో అత్యున్నత పదవిని చేరుకోగలిగాను. భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసిన



తర్వాత నేను హాజరైన మొదటి కార్యక్రమం నా స్వస్థలమైన మహారాష్ట్రలోని అమరావతి. ఆ కార్యక్రమానికి.. సీజేఐగా విధులు నిర్వహించి రిటైరైన జస్టిస్ ఎన్‌వీ రమణ వచ్చి ఆశీస్సులు అందజేశారు. మరో రెండ్రోజుల్లో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా పదవీ విరమణ చేయబోతున్నాను. ఇది నేను హాజరవుతున్న చివరి కార్యక్రమం. అదీ ఇక్కడి అమరావతిలో జరగడం యాదృచ్ఛికం. ఇలా నా ప్రయాణం అమరావతిలో ప్రారంభమై, అమరావతిలోనే ముగుస్తోంది. రెండు అమరావతులకు గొప్ప చారిత్రక ప్రాముఖ్యం ఉంది. మహారాష్ట్రలోని అమరావతిని ఇంద్రపురిగా భావిస్తారు. ఇక్కడి అమరావతిని కూడా ఇంద్రుడి రాజధానిగా భావిస్తుండడం విశేషం' అని జస్టిస్ గవాయ్ తెలిపారు.

**ప్రాథమిక హక్కులకు భంగం ఏర్పడితే..**

'రాజ్యాంగ సభ ఏర్పడిన తర్వాత రాజ్యాంగ లక్ష్యాలకు సంబంధించి 1946 డిసెంబరు 9న జవహర్‌లాల్ నెహ్రూ తీర్మానం ప్రవేశపెట్టగా.. అందులో లోపాలు ఉన్నాయని అంబేడ్కర్ ఎత్తిచూపారు. పౌరుల హక్కుల గురించి మాత్రమే ప్రస్తావించి, పరిష్కారాలు చూపనప్పుడు హక్కుల కల్పనకు అర్థం ఉండదన్నారు. పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు సుప్రీంకోర్టు తలుపు తట్టేందుకు వీలుగా రాజ్యాంగంలో 32వ అధికరణను చేర్చారు' అని జస్టిస్ గవాయ్ చెప్పారు.

**జస్టిస్ గవాయ్ గొప్ప మానవతావాది**
**ఆయన తీర్పులు చిరస్థాయిగా నిలిచిపోతాయి: చంద్రబాబు**

కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రసంగిస్తూ.. జస్టిస్ బీఆర్ గవాయ్‌ను గొప్ప మానవతావాదిగా అభివర్ణించారు. సమానవత్వాన్ని మాటల్లోగాక చేతల్లో చూపించే మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. న్యాయమూర్తిగా ఆయన ఇచ్చిన తీర్పులు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందజేశారు. మోదీ చాయ్‌వాలాగా జీవనం సాగించి నేడు ప్రధానమంత్రి అయ్యారంటే అది రాజ్యాంగం గొప్పదనమే. ఒక వ్యక్తికి ఒక ఓటు అనేది అంబేడ్కర్ ఇచ్చిన వరం' అని చెప్పారు. సమాజంలో ఏమైనా తప్పిదాలు జరిగితే వాటిని సరిదిద్ది ప్రజాస్వామ్యాన్ని రక్షించేది న్యాయవ్యవస్థేనన్నారు. సోషల్ మీడియా వచ్చాక ప్రతి ఒక్కరూ సంపాదకులు అయిపోతున్నారని.. వ్యక్తిత్వ హననాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

**ఇద్దరు సీజేఐలూ రాష్ట్రంలోనే..**

ఈ నెల 23న పదవీవిరమణ చేయనున్న భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, ఆ మర్నాడు ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం ఏపీలోనే ఉండడం యాదృచ్ఛికం. జస్టిస్ సూర్యకాంత్ తిరుమలేశుడిని దర్శించుకోవడానికి రాష్ట్రానికి వచ్చారు.

శ్రీవారి సేవలో జస్టిస్ సూర్యకాంత్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం తిరుమల శ్రీవేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు.

# తీవ్ర ఆందోళనకరంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

-మొదటిపేజీ తరువాయి

వస్తే సంపద సృష్టిస్తామంటూ టీడీపీ, జనసేన నేతలు చెప్పినదానికి విరుద్ధంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఉంది. ఆర్థిక రంగంలో టీడీపీ కూటమి ప్రభుత్వ పనితీరును ఒక్కసారి పరిశీలిస్తే.. వారి ఘోర వైఫల్యాలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయి. 2025%–%26 ఆర్థి క సంవత్సరం మొదటి ఆరు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్ను ఆదాయాల వృద్ధి కేవలం 7.03 శాతం మాత్రమే. 2025%–%26లోనైనా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కోలుకుంటుందని చాలా మంది ఆశించారు. కానీ.. కాగ్ విడుదల చేసిన గణాంకాలను పరిశీలిస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందన్నది స్పష్టం అవుతోంది. గత ఆర్థి క సంవత్సరం మొదటి ఆరు నెలలతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో వస్తు, సేవల పన్ను(జీఎస్టీ), అమ్మకపు పన్ను (సేల్స్ ట్యాక్స్) ఆదాయాల వృద్ధి కేవలం 2.85 శాతం మాత్రమే.

2023–24 నుంచి 2025–26 వరకూ రెండు ఆర్థి క సంవత్సరాల్లో మొదటి ఆరు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్ను ఆదాయాల వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్)తో పోల్చితే... ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరునెలల్లో రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్నుల ఆదాయాల వృద్ధి కేవలం 2.75 శాతం మాత్రమే ఉన్నప్పటికీ రాష్ట్రం అద్భుతమైన ఆర్థిక వృద్ధి సాధిస్తోందంటూ ప్రజలను నమ్మించడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం 2024%–%25లో జీఎస్‌డీపీ (రాష్ట్ర స్థూల ఉత్పత్తి) వృద్ధి 12.02 శాతం సాధించామని.. 2025–26లో 17.1 శాతం



వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రకటించింది. కానీ.. ఫలితాలు అత్యంత దారుణంగా ఉన్నాయన్నది కాగ్ విడుదల చేసిన గణాంకాలే తేల్చి చెబుతున్నాయి. ఈ స్థాయిలో జీఎస్‌డీపీ వృద్ధి సాధించాలంటే రెండేళ్ల కాలంలో భారీ ఎత్తున పెట్టుబడులు, నిధులు వ్యయం చేయాలి. అప్పుడు జీఎస్‌డీపీలో సీఏజీఆర్ 14.53 శాతం అవుతుంది. దీని ఫలితంగా రెండేళ్లలో సంబంధిత పన్ను ఆదాయాల వార్షిక వృద్ధి 12–15 శాతంగా ఉంటుంది. కానీ, వాస్తవం ఏమిటంటే.. రెండేళ్లలో పన్ను ఆదాయాల వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) కేవలం 2.75 శాతం మాత్రమే. అంచనాలు ఆ స్థాయిలో ఉంటే.. వాస్తవ పరిస్థితి మాత్రం దారుణంగా ఉంది. గత రెండేళ్లలో మూలధన వ్యయం వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్) 16 శాతం తగ్గడం అత్యంత ఆందోళనకరం.

2025–26 తొలి త్రైమాసికంలో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం వృద్ధి కేవలం 3.47 శాతం మాత్రమే. గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరం తొలి త్రైమాసికంలో జీఎస్టీ, అమ్మకపు పన్ను ఆదాయాలు బాగా తగ్గాయి. కానీ.. చంద్రబాబునాయుడు మాత్రం గతేడాది పోల్చితే.. 2025%–%26 తొలి త్రైమాసికంలో జీఎస్‌డీపీ వృద్ధి 10.50 శాతం అధికంగా ఉందని ప్రకటించారు. ఇది పూర్తిగా అవాస్తవం. గత ఐదేళ్లలో 2019%–%24 మధ్య ఆంధ్రప్రదేశ్ సొంత పన్నుల ఆదాయం వార్షిక వృద్ధి రేటు 9.87 శాతం. రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్నుల ఆదాయం రూ.58,031 కోట్ల నుంచి రూ.92,922 కోట్లకు పెరిగింది. ఆ ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ జీఎస్‌డీపీ వార్షిక వృద్ధి రేటు 10.23 శాతంగా ఉంది. గత ఐదేళ్లలో జీఎస్‌డీపీ వృద్ధి, పన్ను ఆదాయాల వృద్ధితో పోల్చితే టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో జీఎస్‌డీపీ, పన్ను ఆదాయాల వృద్ధి తక్కువగా ఉందన్నది స్పష్టమవుతోంది. అయినప్పటికీ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని చంద్రబాబు ఎలా చెప్పగలరు రాష్ట్రం దూసుకుపోతున్నట్లు కనిపించే ఏకైక అంశం అప్పుల విషయంలోనే. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ ఏకంగా రూ.2,06,959 కోట్లు అప్పులు చేశారు (వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అప్పులో.. టీడీపీ కూటమి సర్కారు 17 నెలల్లోనే 62 శాతం అప్పు చేసింది).


## రెండు రాష్ట్రాలు కలిసి నడవాలి

-మొదటిపేజీ తరువాయి

దేశంలో వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి, సమాజ హితమే లక్ష్యంగా పనిచేస్తున్న వారికి ఈ అవార్డులను రాధాకృష్ణన్ చేతులమీదుగా అందజేశారు. అవార్డు గ్రహీతలకు మొమెంటో, ప్రశంసా పత్రంతోపాటు ఒక్కొక్కరికి రూ.10 లక్షల నగదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. తెలుగు భాషను కాపాడుకోవడానికి రామోజీరావు స్ఫూర్తితో పనిచేస్తామని అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ జీవోలు, ఇతర ఉత్తర్వులను ఇకపై తెలుగులోనే ఇస్తామని ప్రకటించారు.

**విశేష కృషికి పురస్కారాలు..**

ఎక్సలెన్స్ అవార్డు గ్రహీతల్లో.. చెరువులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టి జలసంరక్షణతో 18 లక్షల మంది గ్రామీణ ప్రజల జీవితాలను మార్చిన అమ్లా అశోక్ రుయాకు గ్రామీణాభివృద్ధి విభాగంలో అవార్డు దక్కింది. వైకల్యాన్ని అధిగమించి



పారిశ్రామికవేత్తగా రాణిస్తున్న శ్రీకాంత్ బొల్లాకు యూత్ ఐకాన్‌గా, ప్రపంచంలోనే ఎత్తైన కశ్మీర్‌లోని చినాబ్ వంతెనను డిజైన్ చేసిన బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ మాధవీలతకు సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో పురస్కారాలు అందజేశారు. కాగా, మురికివాడల్లో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి.. వారి జీవితాల్లో మార్పు తెచ్చిన ఆకాశ్ టాండన్‌కు మానవతా సేవల విభాగంలో, కళలు–సంస్కృతి విభాగంలో సత్తుపతి ప్రసన్నకు, జర్నలిజంలో కృషికిగాను జైదీప్ హర్దేకర్‌కు, మహిళా సాధికారత కోసం పాటుపడిన పల్లబీ ఘోష్‌కు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ కార్మికులపై చంద్రబాబు 'సమ్మిట్ ఫ్లాప్' కోపం

విశాఖపట్నం

విశాఖ పెట్టుబడుల సదస్సు అట్టర్ ఫ్లాప్ కావడంతో సీఎం చంద్రబాబు ఆ కోపాన్ని, అసహనాన్ని స్టీల్ ప్లాంట్ కార్మికులపై ప్రదర్శిస్తున్నారని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఖరీదైన భూములను ఇప్పటికే తమ వారికి పప్పుబెల్లాల్లా కట్టబెట్టిన చంద్రబాబు కన్ను ఇప్పుడు రూ.లక్షల కోట్ల ఖరీదైన స్టీల్ ప్లాంట్ భూములపై పడిందన్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా.. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా వైఎస్సార్ సీపీ పోరాడుతుందని, కార్మికులకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే, 'కుమారుడు లోకేశ్ రాజకీయ భవిష్యత్ కోసం ప్లాంట్ ప్రైవేటీకరణకు చంద్రబాబు కేంద్రానికి సహకరిస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కానివ్వనని గతంలో హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఉత్తరాంధ్ర ప్రజలకు, ప్లాంట్ ఉద్యోగులకు వెన్నుపోటు పొడుస్తున్నారు. మూడు నెలలుగా సీఐఐ సమ్మిట్ పేరిట దేశ, విదేశాల్లో సైతం పర్యటించినా సమ్మిట్ అట్టర్ ఫ్లాప్ అయింది. ప్రభుత్వ హడావుడి తప్ప నిర్దేశించుకున్న లక్ష్యంలో కనీసం 50 శాతం పెట్టుబడులు కూడా రాలేదనే విమర్శలున్నాయి. దానికి నిన్న చంద్రబాబు సమ్మిట్‌లో విశాఖ ఉక్కు గురించి అసహనంతో మాట్లాడిన మాటలే నిదర్శనం. స్టీల్ ప్లాంట్‌ను తెల్ల ఏనుగుతో పోల్చుతూ... ప్లాంట్ కార్మికులే నష్టాలకు కారణమనడం దారుణం. ఆయన మాటలు వింటుంటే అసలు స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడమే కాకుండా, విశాఖలో స్టీల్ ప్లాంట్ ఉంచుతారా? లేదా? అన్న అంశంపైసైతం సందేహం కలుగుతోంది. చంద్రబాబు తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని కార్మికులకు క్షమాపణ చెప్పాలి' అని పేర్కొన్నారు. సమావేశంలో సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, తిప్పల శ్రీనివాస్ దేవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లిక్కర్ స్కామ్‌లో కటక్ కిలేడీ

అమరావతి

లిక్కర్ స్కామ్ జరిగింది ఏపీలో... మద్యం వ్యాపారుల నుంచి ముడుపులు వసూలు చేసి దాచింది హైదరాబాద్‌లో... లిక్కర్ మాఫియా దాచిన నోట్ల కట్టల బాక్సుల్లో నాలుగు ఒడిశాలోని కటక్ చేరాయి. ఓ కటక్ కి'లేడీ' తన ప్రియుడితో కలసి ఆరు బాక్సులు కొట్టేసింది. కానీ వీటిలో రెండింటిని హైదరాబాద్‌లో తన ప్రియుడి మిత్రుడు కాజేశాడు. గత జగన్ ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కామ్‌లో ఓ వెరైటీ దోపిడీ ఇదీ! మద్యం ముడుపులు వసూలు చేసిన రాజ్ కసిరెడ్డి గ్యాంగ్‌లో సైమన్ ప్రసన్ కీలక వ్యక్తి.. అతడి బామ్మర్ది మోహన్.. మోహన్ బామ్మర్ది అనిల్.. అతడి సన్నిహితురాలు రషిత (కటక్).. ఆమె మరో ప్రియుడు ఇర్షాద్ అహ్మద్ (కటక్).. మోహన్ ఇంట్లో దాచిన నోట్ల కట్టలను రషిత, ఇర్షాద్ కలసి కొట్టేశారు. సినీ ఫక్కీలో ఎన్నో పాత్రలు తెరపైకి వస్తూ, ట్విస్టుల మీద ట్విస్టులతో ఈ దోపిడీ కథ సాగింది.

తాడిని తన్నేవాడుంటే.. వాడి తలను తన్నేవాడుంటాడు.. అన్నది పాత సామెత. జగన్ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం వ్యవహారంలో అచ్చం ఇలాగే జరిగింది. గత ప్రభుత్వంలో చౌక మద్యాన్ని జనం నోట్లో పోసి దోచుకున్న సొమ్ములో కొంత దొంగలపాలైంది. దోపిడీదారుల్నే దోచేసిన కి'లేడీ' వ్యవహారం తాజాగా బట్టబయలైంది. లిక్కర్ ముఠా ముడుపులు వసూలు చేసి హైదరాబాద్‌లో దాచిన నోట్ల కట్టల బాక్సులు ఏపీ మీదుగానే ఒడిశాలోని కటక్ చేరాయి. మద్యం దోపిడీలో చిన్న పాత్ర పోషించిన ఒక వ్యక్తికి సన్నిహితంగా ఉన్న ఓ మహిళ సినీ ఫక్కీలో డబ్బు కొట్టేసి కటక్‌లో మేడలు కట్టేసింది. నయా దోపిడీలో మరో ట్విస్టు ఏంటంటే... కటక్ మహిళ తన ప్రియుడి గ్యాంగ్‌తో కలసి 6 నోట్ల కట్టల బాక్సులను కొట్టేయగా, వాటిలో రెండింటిని హైదరాబాద్‌లో ఉంటున్న మరో ఒడిశా వ్యక్తి కాజేశాడు. కటక్‌లో 4 కోట్లకు పైగా, హైదరాబాద్‌లో కోటి రూపాయలకు పైగా ఆస్తులను జప్తు చేసేందుకు సిట్ రంగం సిద్ధం చేసింది.

**బాక్సులు.. నోట్లు**

జగన్ పాలనలో జరిగిన భారీ లిక్కర్ స్కామ్‌లో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి డిస్టిలరీల నుంచి ముడుపుల వసూలుకు ఏర్పాటు చేసుకున్న గ్యాంగ్‌లో సైమన్ ప్రసన్ కీలక వ్యక్తి. విశాఖకు చెందిన బామ్మర్ది మోహన్‌ను హైదరాబాద్ రప్పించుకుని.. ఫిల్మ్‌నగర్‌లోని ఓ ఇంట్లో ఉంచాడు. వసూలు చేసిన ముడుపుల సొమ్మును అక్కడికి చేర్చేవారు. దానిని భద్రపరిచేందుకు ప్రత్యేక సైజులో ఉండే అట్టపెట్టెలు ఆర్డర్ ఇచ్చారు. వాటిలో రూ.100, రూ.200, రూ.500 నోట్ల కట్టలను వేర్వేరుగా దాచేవారు. ఒక్కో బాక్సులో 100 నోట్లు అయితే రూ.24 లక్షలు.. 200 అయితే రూ.48 లక్షలు.. 500 అయితే రూ.1.20 కోట్లు చొప్పున సరిగ్గా సరిపోయేలా పేర్చేవారు. ఆ బాక్సులకు టేప్ వేసి పైన సింబాలిక్‌గా 100, 200, 500 అని రాసేవారు. వసూలు చేసిన మొత్తం పది కోట్లు కాగానే రాజ్ కసిరెడ్డికి సమాచారం ఇచ్చేవారు. ఎవరో ఒకరు కార్లలో వచ్చి ఈ బాక్సులను తీసుకెళ్లేవారు.

**అతడు.. ఆమె.. ఇతడు**

బాక్సులు.. నోట్లు.. సర్దుడు వ్యవహారం జరుగుతున్న క్రమంలో మోహన్ బామ్మర్ది అనిల్ కాలు విరగడంతో హైదరాబాద్‌లో వైద్యం చేయించుకోవాడికి వచ్చాడు. మోహన్ ఇంట్లో ఉన్నాడు. అనిల్‌కు కటక్‌లో బ్యూటీ పార్లర్ నిర్వహించే రషిత బ్యూరో అనే యువతితో సన్నిహిత సంబంధం ఉంది. హైదరాబాద్‌లో ఉన్న తన ప్రియుడు అనిల్‌ను చూడటానికి కటక్ నుంచి ఆమె ఓ రోజు వచ్చింది. అదే సమయంలో అనిల్‌తో పాటు మోహన్ కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు. బెడ్‌రూమ్‌లో దాచిన అట్టపెట్టెల బాక్సులను ఆమె చూసింది. వాటి గురించి ఆరా తీయగా వారు విషయం చెప్పకుండా దాటవేశారు. ఆమెకు అనుమానం వచ్చి అర్ధరాత్రి ఒక బాక్సు తీసి చూసింది. పెద్దఎత్తున నోట్ల కట్టలు చూసి ఆశ్చర్యపోయింది. కటక్‌లో ఉంటున్న తన మరో ప్రియుడు ఇర్షాద్ అహ్మద్‌కు ఫోన్ చేసి విషయం చెప్పింది. ముడుపుల సొమ్ము కోట్ల లో ఉందని, నాలుగు బాక్సులు పట్టుకెళ్తే మన లైఫ్ సెటిల్ అవుతుందని ఆశ చూపింది. దీంతో మరో ఇద్దర్ని తీసుకుని 2023 జనవరి 10న ఇర్షాద్ హైదరాబాద్ వచ్చాడు.

**భోగి రోజు చోరీ**

ఇర్షాద్ హైదరాబాద్ వచ్చిన వెంటనే కటక్ నుంచి ఉపాధి కోసం ఇక్కడికి వచ్చి ఫిల్మ్‌నగర్‌లో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న పాత మిత్రుడు ముబారక్ అలీని సంప్రదించాడు. తనకు ముగ్గురు చురుకైన యువకులు, 3 ద్విచక్ర వాహనాలు కావాలని చెప్పాడు. మూడు బైకుల్లో హైదరాబాద్‌కు చెందిన ముగ్గురితో పాటు కటక్ నుంచి తన వెంట వచ్చిన ఇద్దరిని తీసుకుని మొత్తం ఆరుగురు(ఇర్షాద్ సహా) 2023 జనవరి 13న వేకువజామున 3 గంటల ప్రాంతంలో మోహన్ ఇంటి సమీపంలోకి చేరుకున్నారు. అక్కడి నుంచి ఇర్షాద్ రషితకు ఫోన్ చేశాడు. తలుపు గడియ తీసే ఉంచానని, అందరూ నిద్రలో ఉన్నారని, కాసేపైతే భోగి మంటల కోసం లేస్తారని, వెంటనే వచ్చేయాలని ఆమె చెప్పింది. నలుగురు గుట్టు చప్పుడు కాకుండా మోహన్ ఇంట్లోకి వెళ్లి 4 నోట్ల కట్టల బాక్సుల్ని తీసుకుని బయటికి వచ్చారు. కాసేపటికి రషిత మళ్లీ ఫోన్ చేసి వచ్చి మరో రెండు పట్లుకెళ్లమని చెప్పింది. ఆరు బాక్సులూ తీసుకెళ్లి ముబారక్ ఇంట్లో మంచం కింద దాచారు. బాక్సులు మాయమైన విషయం ఒక రోజు తర్వాత మోహన్‌కు తెలిసింది. వెంటనే సైమన్‌కు చెప్పాడు. సైమన్ మరో వ్యక్తి రాజీవ్ ప్రతాపతో కలిసి హడావుడిగా అక్కడికి వచ్చాడు. బాక్సుల గురించి ఎంత ఆరా తీసినా కనిపెట్టలేకపోయారు. సైమన్ తనకు తెలిసిన పోలీసు అధికారి సాయం కోరాడు. పోలీసు అధికారి మోహన్ ఇంటి సమీపంలోని సీసీ ఫుటేజీ పరిశీలించారు. 2023 జనవరి 13 వేకువజామున అక్కడికి మూడు ద్విచక్ర వాహనాల్లో ఆరుగురు యువకులు వచ్చినట్లు గుర్తించారు. ఆ లొకేషన్లో ఉన్న సెల్ నంబర్లను ఒడిశాకు చెందినవిగా తెలుసుకున్నారు. అనుమానం రావడంతో మోహన్ ఇంట్లో ఉంటున్న అతడి బామ్మర్ది అనిల్ ప్రియురాలు రషిత (ఒడిశా) నంబర్ తీసుకుని కాల్ డేటా పరిశీలించారు. ఆరుగురు యువకులు వచ్చిన సమయంలోనే రషిత, ఇర్షాద్ ఫోన్లు చేసుకోవడం తెలుసుకున్నారు. రషిత ద్వారానే దొంగతనం జరిగినట్టు నిర్ధారణకు వచ్చారు. అప్పటికే రషిత ఇర్షాద్‌తో కలసి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఒడిశా వెళ్లిపోయింది.

# మోదీ-చంద్రబాబు మధ్య సంబంధాలు..

## సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు



ప్రధాని మోదీతో సంబంధాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తికరంగా స్పందించారు. ప్రముఖ జాతీయ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రధాని మోదీతో గతంలో ఉన్న ఘర్షణలపై చంద్రబాబు ప్రశ్నలు ఎదుర్కొన్నారు. అయితే ఈ విషయంలో సీఎం ఇచ్చిన సమాధానం ఆకట్టుకుంది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్య విభేదాలు రావాలని కోరుకుంటున్న వారి రాజకీయ ప్రత్యర్థులకు ఇది సరైన సమాధానంగా వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాకుండా చంద్రబాబు వ్యాఖ్యలతో భవిష్యత్తులో ఇలాంటి ప్రశ్నలు మళ్లీ ఎదురయ్యే అవకాశం రాదని అంటున్నారు. 2019 ఎన్నికలకు ముందు ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు విభేదించిన విషయం తెలిసిందే. మళ్లీ 2024 ఎన్నికల ముందు ఈ ఇద్దరు జట్టుకట్టి రికార్డు విజయాన్ని సాధించారు. కేంద్రంలో ప్రధాని మోదీ 3.0 ప్రభుత్వానికి బలమైన మద్దతుదారుగా ముఖ్యమంత్రి చంద్రబాబు అవతరించారు. తెలుగుదేశం పార్టీకి ఉన్న 16 మంది ఎంపీల బలంపై కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఆధారపడి వుంది. దీంతో మోదీపై ఒత్తిడి తెచ్చేలా చంద్రబాబు వ్యవహరిస్తారని జాతీయ స్థాయిలో అంతా ఊహించారు. కానీ, గత 18 నెలలుగా చంద్రబాబు తీరులో అలాంటి పద్ధతి కనిపించడం లేదు. ప్రధాని మోదీతో చాలా స్నేహపూర్వకంగా నడుచుకోడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా నేషనల్ మీడియా చానల్ కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రధాని మోదీతో గతంలో కొనసాగిన ఘర్షణలపై క్లిష్టమైన ప్రశ్నను ఎదుర్కొన్నారు చంద్రబాబు. అయితే రాజకీయాల్లో తలపండిన ముఖ్యమంత్రి ఆ ప్రశ్నకు చాలా సింపుల్‌గా సమాధానం చెప్పి తన చాణఖ్యాన్ని ప్రదర్శించారు. “మా మధ్య సంబంధాలు చాలా బాగున్నాయి. ఆంధ్రప్రదేశ్ కే కాదు.. ప్రధాని మోదీ సమర్థ నాయకత్వం దేశానికే చాలా అవసరం” అంటూ చంద్రబాబు వెల్లడించారు. తమ మధ్య వ్యక్తిగతమైన వివాదాలు ఏవీ లేవని, తాను ఏ విషయమై ప్రశ్నించినా అది రాష్ట్రం కోసమేనంటూ చంద్రబాబు వివరణ ఇచ్చారు. తమ మధ్య సంబంధాలు ఇలానే కొనసాగుతాయని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలతో చాలా మందికి ఉన్న అనుమానాలు తొలగిపోయాయని అంటున్నారు. 2019 ఎన్నికలకు ముందు ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు తీవ్రంగా విభేదించారు. 2014లో టీడీపీ-బీజేపీ పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో గెలిచాయి. అయితే అప్పట్లో జాతీయ స్థాయిలో బీజేపీకి సొంతంగా బలం ఉండటంతో ఏపీకి నిధులు కేటాయింపులో నిర్లక్ష్యం వహించిందని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేసేవారు. ప్రత్యేక హోదా ఇవ్వకపోవడంతోపాటు రాజధాని అమరావతికి ప్రత్యేక నిధులు ఇవ్వలేదని చంద్రబాబు అప్పట్లో కేంద్ర ప్రభుత్వంతో విభేదించారు. దీంతో 2019లో టీడీపీ-బీజేపీ విడివిడిగా పోటీ చేశాయి. ఆ తర్వాత పరిణామాలతో 2024 ఎన్నికలకు ముందు ఈ రెండు పార్టీలు మళ్లీ కలిశాయి. ఇప్పుడు చంద్రబాబు పార్టీకి ఉన్న ఎంపీల బలమే కేంద్ర ప్రభుత్వానికి కీలకంగా మారింది. అయినప్పటికీ ఆయన ప్రధాని మోదీతో సన్నిహితంగా మెలుగుతున్నారు. దీనివల్ల 2024 ఎన్నికల తర్వాత కేంద్రం వైఖరి మారిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాజధాని అమరావతితోపాటు పలు అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం పూర్తిగా సహకరిస్తోందని అంటున్నారు.

# వంగవీటి ఆశ... వెనుక ఎవరున్నారు?!



రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్న కాపు నాయకుడు వంగవీటి మోహన్ రంగా కుటుంబం నుంచి ఆయన కుమార్తె ఆశా కిరణ్ రాజకీయ అరంగేట్రం చేశారు. అయితే.. ఇప్పటికిప్పుడు ఏ పార్టీ అనేది ఆమె చెప్పకపోయినా.. ప్రస్తుతానికి ప్రజాసేవకు పరిమితం అవుతానన్నారు. కానీ, భవిష్యత్తులో మాత్రం ఆమె రాజకీయంగా అడుగులు వేయడం ఖాయమని చెప్పారు. రాధా-రంగా మిత్ర మండలిలో చోటు చేసుకున్న గ్యాప్ కారణంగానే తాను వస్తున్నట్టు ప్రకటించారు. అయితే.. సహజంగానే ఒక వ్యక్తి రాజకీయాల బాట పట్టారంటే.. ఆ వ్యక్తి వెనుక ఎవరు ఉన్నారు..? అనేది ఆసక్తికర చర్చకు దారితీస్తుంది. ఈ కోణంలోనే ఇప్పుడు ఆశా కిరణ్ రాజకీయ అరంగేట్రం వెనుక.. ఎవరు ఉన్నారు? ఏ పార్టీ ఆమెను లీడ్ చేస్తోంది? అన్నది కూడా ఆసక్తిగా మారింది. దీనిపై రాజకీయ పరిశీలకు లు పలు వాదనలు చెబుతున్నారు. ప్రధానంగా వైసీపీ ఉందన్న చర్చ జోరుగా సాగుతోంది. కాపులను మచ్చిక చేసుకునేందుకు వైసీపీ గతంలోనూ అనేక ప్రయత్నాలు చేసింది. ఈ క్రమంలోనే వంగవీటి కుమారుడు రాధాకృష్ణకు 2014లో విజయవాడ తూర్పు నియోజకవర్గం టికెట్ ను ఇచ్చింది. కానీ, ఆయన పరాజయం పాలయ్యారు. 2019లో టికెట్ ఇవ్వలేదు. ఇక, 2024 నాటికి రాధా.. పార్టీ మారి టీడీపీలోకి వచ్చారు. ఈ పరిణామాలతో వైసీపీకి వంగవీటి కుటుంబం దూరమైంది. ఈనేపథ్యానికి తోడు జనసేన పార్టీ కాపులకు దన్నుగా మారింది. దీంతో ఇప్పుడు కాపులను మచ్చిక చేసుకునేందుకు రాధా కుమార్తె ఆశా కిరణ్‌ను వైసీపీ రాజకీయాల్లోకి దింపుతోందన్న చర్చ తెరమీదికి వచ్చింది. అయితే.. దీనిలో వాస్తవం ఎంత? అనేది చూడాలి. ఇక, టీడీపీ విషయానికి వస్తే.. ఆ పార్టీలో ఇప్పటికే రాధా ఉన్నారు. కాబట్టి.. ప్రత్యేకంగా ఆశా కిరణ్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం లేదు. ఆమె వస్తే కాదనరు. కానీ పనిగట్టుకుని ఆమెను ఎవరూ ప్రోత్సహించే పరిస్తితి టీడీపీలో లేదు. ఇక, జనసేన విషయానికి వస్తే.. కాపు సామాజిక వర్గానికి ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఐకాన్ నాయకుడు. కాబట్టి.. వారికి కాపులను ఆకర్షించేందుకు ప్రత్యేక నాయకులు అవసరం లేదు. సో.. ఈ పరిణామాలను అంచనా వేస్తే.. ఆశా కిరణ్ రాక వెనుక వైసీపీ ఉందన్న చర్చకు బలం చేకూరుతోంది.

# సిక్కోలు నుంచి ఎగరనున్న విమానం



ఉత్తరాంధ్రాలో అతి పెద్ద గ్రీన్ ఫీల్డ్ పోర్టుగా భోగాపురంలో ఎయిర్ పోర్టు నిర్మాణం అవుతోంది. వచ్చే ఏడాదిలోనే తొలి విమానం ఎగరనుంది. అయితే ఇదే ఉత్తరాంధ్రాలో మరో ఎయిర్ పోర్టు రానుంది. దానికి సంబంధించి విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో కీలకమైన అడుగు పడింది. శ్రీకాకుళం ఎయిర్ పోర్టు నిర్మాణానికి ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చింది. విశాఖలో రెండు రోజుల పాటు జరిగిన పెట్టుబడుల సదస్సులో భాగంగా మరో ఎయిర్ పోర్టుని నిర్మించేందుకు ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒప్పందం కుదిరింది. దీంతో శ్రీకాకుళంలో నిర్మించ తలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు సంబంధించి ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ఎయిర్ పోర్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మధ్య ఈ మేరకు అవగాహనా ఒప్పందం చేసుకున్నట్లు అయింది., కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో అధికారులు ఎంఓయూ పత్రాలు మార్చుకున్నారు.

**మరింత కనెక్టివిటీ :**

ఈ తాజా ఒప్పందంతో శ్రీకాకుళం జిల్లాకు ఎయిర్ పోర్ట్ వస్తోంది. దాంతో పాటు ఉత్తరాంధ్ర ప్రాంతంలో కనెక్టివిటీ పెరుగుతుందని భావిస్తున్నారు. అలాగే పర్యాటక రంగానికి ఈ పరిణామం మరింతగా దోహదపడుతుందని చెబుతున్నారు. ఇక ఎయిర్ పోర్ట్ నిర్మాణంతో ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఆర్థిక వృద్ధికి ఊతం లభిస్తుందని అంటున్నారు. ఇక ఒప్పందం కుదిరిపోయింది కాబట్టి శ్రీకాకుళం జిల్లాలో ఎయిర్ పోర్టు నిర్మాణానికి ప్రస్తుతం స్థల పరిశీలన కూడా చురుకుగా జరుగుతోంది. మౌలిక వసతులు, రెగ్యులేటరీ అనుమతులపై ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఏపీ ఎయిర్ పోర్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కలిసి పూర్తి షాయిలో పనిచేయనున్నాయి.

**వెనుకబడిన జిల్లా :** ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం అత్యంత వెనకబడిన జిల్లగా ఉంది. అయితే తాజాగా ఎయిర్ పోర్టు నిర్మాణంతో అక్కడ కూడా ప్రగతి గతి మారుతుందని అంటున్నారు ఎయిర్ పోర్టు వస్తే దాని అనుసంధానంగా ఉండేవి సైతం వస్తాయి. ప్రపంచంతో కనెక్టివిటీ కూడా పెరుగుతుంది. మరో వైపు చూస్తే తన సొంత జిల్లాకు ఎయిర్ పోర్టుని నిర్మించాలని కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పట్టుదలగా ఉన్నారు. ఇపుడు ఆయన కోరిక సాకారం కాబోతోంది. ఆయన పేరు కూడా జిల్లా చరిత్రలో నిలవబోతోంది అని అంటున్నారు.

**జిల్లాకు ఒక ఎయిర్ పోర్టు :** ఇదిలా ఉంటే ఒక జిల్లా ఒక విమానాశ్రయం ఒక ఉత్పత్తి కాన్సెప్ట్ తరహాలోనే శ్రీకాకుళానికి ఎయిర్ పోర్టు వస్తోంది అని అంటున్నరు. అలాగే ప్రతి ఎయిర్‌పోర్ట్ చుట్టూ ఉన్న ప్రాంతంలో అత్యుత్తమమైన ఒక ఉత్పత్తిని గుర్తించి ఆ ఉత్పత్తికి అనుగుణంగా కార్గో ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చెబుతున్నారు. దేశంలో 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉండగా ఈ రోజుకు వాటి సంఖ్య 164కు పెరిగిందని ఆయన గుర్తు చేశారు. వృద్ధిని కొనసాగించడంతో పాటు ప్రయాణీకులకు మెరుగైన సేవలు, తయారీ వ్యవస్థ భవిష్యత్తు సాంకేతికతతో ఈ రంగాన్ని సంస్కరించడానికి కూడా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వివరించారు.

**మరిన్ని ఎయిర్ పోర్టులు :** మరో వైపు చూస్తే దేశంలో గత 10 ఏళ్లలో విమాన ప్రయాణాలు ప్రయాణీకుల సంఖ్య అంతర్జాతీయ విమానాల సంఖ్య, దేశీయ విమానాల సంఖ్య దాదాపు రెట్టింపు అయ్యాయని ఆయన గణాంకాలను వెల్లడించారు. 2014లో 6.7 కోట్ల నుండి 2024లో 7.2 కోట్లకు పెరిగారని చెప్పారు. అంతర్జాతీయ ప్రయాణికులు 2.5 కోట్ల నుండి 7.2 కోట్లకు పెరిగారని గుర్తుచేశారు. దేశీయ విమానాలు చూస్తే కనుక 2014లో 6 లక్షల నుండి 2024లో 11 లక్షలకు పెరిగాయని చెప్పుకొచ్చారు. ఇక దేశంలో ప్రస్తుతం ఉన్న 164 ఎయిర్‌పోర్ట్‌ల సంఖ్యను మరింత పెంచడానికి వాటి నిర్వహణ సామర్థ్యాన్ని విస్తరించడానికి ప్రయత్నిస్తున్నట్లుగా కేంద్ర మంత్రి చెప్పారు. దీంతో శ్రీకాకుళానికి ఒక ఎయిర్ పోర్టు రాబోతోంది. ఇది ఉత్తరాంధ్రకు శుభ పరిణామంగానే చూడాల్సి ఉంది.

# వైసీపీకి బీజేపీ ట్రబుల్స్



ఏపీలో వైసీపీ ఏకైక అతి పెద్ద ప్రతిపక్షంగా ఉంది 2024 ఎన్నికల్లో కూడా వైసీపీకి 11 సీట్లు వచ్చినప్పటికీ 40 శాతం ఓటు షేర్ లభించింది. ఆ లెక్కన ఏపీలో టీడీపీ కూటమికి వైసీపీయే ప్రధాన ప్రత్యర్థి అన్నది కచ్చితంగా చెప్పే విషయం. కూటమిలో మూడు ప్రధాన పార్టీలు ఉన్నాయి. ఏపీలో టీడీపీ గ్రాస్ రూట్ లెవెల్ దాకా బలంగా పాతుకుని పోయింది. ఇక జనసేన అయితే కొన్ని జిల్లాలలో తన ప్రభావం బాగా ఎక్కువగా చూపిస్తోంది. అలాగే ఒక బలమైన సామాజిక వర్గం ఆ పార్టీ వెంట తన ఆశలను అల్లుకుని ఉంది. బీజేపీకి ఏపీలో పెద్దగా ఏమీ లేదు అని అనుకోవచ్చు జాతీయ స్థాయిలో బీజేపీ రాజకీయ దూకుడు ప్రభావం ఏపీ మీద కూడా గట్టిగానే ఉంటుందని అంటున్నారు.

**బీహార్ ఇంపాక్ట్ :**

బీహార్‌లో బీజేపీ జేడీయూ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మరోసారి అద్భుతమైన మెజారిటీతో అధికారంలోకి వస్తోంది. ఇక అక్కడ బలమైన ప్రత్యర్థి అనుకున్న ఆర్జేడీని పూర్తిగా పరిమితం చేసింది. కాంగ్రెస్ కి అయితే అస్థిత్వ పోరాటమే మిగిలింది. ఇక బీజేపీ తరువాత లక్ష్యాలు చాలానే ఉన్నాయి. మమతా బెనర్జీ, స్టాలిన్ వంటి వారి కోటలను ఎలా కూల్చడం అన్నది కమలానికి ఒక పెద్ద ఎక్సర్ సైజ గా ఉండబోతోంది. ఆ మీదట కర్నాటక కేరళ, తెలంగాణా ఎటూ ఉన్నాయి. వీటితో పాటు ఏపీ కూడా బీజేపీ ప్లాన్ లో ఉంది అన్ అంటున్నారు.

**వచ్చేసారి వేరు :** ఇక దేశమంతా మోడీ ప్రభంజనం వీస్తోంది అన్నది గత పద్దెనిమిది నెలలుగా రుజువు అయింది హర్యానా మహారాష్ట్ర ఢిల్లీ, బీహార్ ఇలా అన్ని రాష్ట్రాలను గెలుచుకుని వస్తున్న బీజేపీ తాను అనుకున్న మరికొన్ని లక్ష్యాలను కూడా సాధిస్తే కనుక కచ్చితంగా దాని ప్రభావం ఏపీ మీద ఇంకా ఎక్కువగానే పడుతుంది. ప్రస్తుతానికి కూడా బీహార్ ఫలితాలు ఏపీలో కొత్త చర్చకు దారి తీస్తున్నాయని అంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి బీజేపీ సింగిల్ డిజిట్ ఎమ్మెల్యేలతో ఒక మంత్రితో కూటమిలో చేరే చాన్స్ అయితే ససేమిరా లేదని అంటున్నారు.

**బలం పెంచుకోవడమే :** ఏపీలో బలం పెంచుకోవడం మీదనే ఇక బీజేపీ ప్రత్యేక దృష్టి పెడుతుంది అని అంటున్నారు. ఈ క్రమంలో బీజేపీ వైసీపీనే గట్టిగా టార్గెట్ చేయవచ్చు అని అంటున్నారు. ఏపీలో వైసీపీలో బలమైన నాయకులను తమ వైపు తిప్పుకోవడం ద్వారా కొత్త రకం రాజకీయానికి బీజేపీకి తెర తీస్తే మాత్రం నష్టపోయేది కచ్చితంగా ఫ్యాన్ పార్టీయే అని అంటున్నారు. ఇక 2029 ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే బీజేపీ ఒక ప్లాన్ ని సిద్ధం చేసుకునే పనిలో ఉంది. ఈసారి ఎక్కువగా సీట్లను బీజేపీ డిమాండ్ చేసే చాన్స్ స్పష్టంగా ఉంది అని అంటున్నారు. అదే కనుక జరిగితే బీజేపీకి ఇపుడు ఉన్న బలం రెండింతలు కాదు మూడింతలు కావాలన్న భారీ లక్ష్యాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. మరి బీజేపీ బలపడితే ప్రభుత్వంలో మంచి అవకాశాలు వస్తాయి.

**వైసీపీలో అలజడి :** బీహార్ లో బీజేపీ విశ్వరూపం చూసిన తరువాత వైసీపీలోనూ అలజడి రేగుతోందా అంటే అదే ప్రచారంలో ఉంది అని అంటున్నారు. మోడీ తోడు ఉంటే చాలు విజయం గ్యారంటీ అని అన్ని చోట్లా రుజువు అవుతోంది. మిత్రులు కూడా మంచి ఆధిక్యతతో అధికారం పంచుకుంటున్నారు. ఇక ఏపీలో కూడా కూటమి మరోసారి గెలవడానికి బీజేపీ జాతీయ స్థాయి పథకాలు ఆలోచనలు ఎంతగానో పనికి వస్తాయి. ఈ కూటమి చెక్కు చెదరదు సరికదా మరింత బలపడుతుంది. ఈ విషయాల మీద వైసీపీలో చర్చ మొదలైతే అపుడే రాజకీయ ప్రకంపనలు పుడతాయని అంటున్నారు బీజేపీ వైపు ఆకర్షితులు : రాజకీయంగా వాలు వీలు చూసుకునే నేతలు ఉంటారు. వైసీపీకి వచ్చే ఎన్నికలో గెలుపు అవకాశాలు ఏ మేరకు అని బేరీజు వేసుకునే వారు వైసీపీలో ఉంటారని అంటున్నారు. ఒకవేళ తాము అనుకున్న తీరున కాకుండా జాతీయ స్థాయి రాజకీయం మరి అది ఏపీ మీద గణనీయంగా ప్రభావం చూపిస్తుంది అనుకుంటే వైసీపీ నుంచి కూడా నేతలు బీజేపీ వైపు ఆకర్షితులు అయినా ఆశ్చర్యం లేదు అని అంటున్నారు. ఏది ఏమైనా వైసీపీకి రానున రోజులలో బీజేపీ నుంచి ముప్పు పొంచి ఉందన్న చర్చ అయితే సాగుతోంది. చూడాలి మరి.

# ఎడిటర్ వాయిస్

## కాంగ్రెస్ ఖేల్...ఖతం...

## బైబై... టాటా... గుడ్ బై... గయా

బిహార్ ఎన్నికల చిత్రం స్పష్టమైంది. 243 స్థానాల్లో 203 స్థానాలతో ఎన్డీఏ రికార్డు విజయం దిశగా దూసుకుపోయింది, మహాకూటమి ఖాతాలో 35 సీట్లు మాత్రమే వస్తున్నాయి. 2020తో పోలిస్తే ఎన్డీఏ 70కి పైగా సీట్లు సాధించగా, మహాకూటమికి అంతే నష్టం జరిగింది. కాంగ్రెస్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది, కేవలం 4 సీట్లు మాత్రమే సాధించింది. కాంగ్రెస్ మరోసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయింది. అయితే ఇది కొత్తేమీ కాదు, 2014 నుంచి 2025 వరకు చూస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ఓటమికి అలవాటు పడి ఉంటుంది.అయితే, గత 11 ఏళ్లలో కాంగ్రెస్ ఎన్ని ఎన్నికల్లో ఓడిపోయిందో, ఏయే రాష్ట్రాల్లో ఓడిపోయింది గత 11 ఏళ్లలో మూడుసార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. లోక్‌సభ ఎన్నికలు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయి. ఇది 11 సంవత్సరాల వ్యవధిలో మూడు పూర్తి సైకిల్స్‌ను కవర్ చేస్తుంది.మొదటి ఎన్నిక- 2014లో 16వ లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి, అప్పుడు ఏప్రిల్ 7 నుంచి మే 12 వరకు 9 దశల్లో పోలింగ్ జరిగింది. మొత్తం 543 స్థానాలకు 8,251 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 66.4 శాతం పోలింగ్ నమోదైంది, ఇది అప్పటి వరకు అత్యధికం. ఫలితాల్లో బీజేపీ 282 సీట్లు గెలుచుకుంది, ఇది 272 సీట్ల మెజారిటీ కంటే ఎక్కువ, అయితే కాంగ్రెస్ కేవలం 44 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఈ ఎన్నికల నుంచే కాంగ్రెస్ కేంద్రంలో అధికారం కోల్పోయింది.రెండో ఎన్నిక- 2019లో 17వ లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి, అప్పుడు ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు 7 దశల్లో పోలింగ్ జరిగింది. ఇక్కడ కూడా 543 సీట్లు ఉన్నాయి. 67.4 శాతం పోలింగ్ జరిగింది. బీజేపీ 303 సీట్లు సాధించగా, కాంగ్రెస్ కేవలం 52 సీట్లు మాత్రమే గెలుచుకుంది.మూడో ఎన్నిక- 2024లో 18వ లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి. ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు 7 దశల్లో ఎన్నికలు జరిగాయి. 65.79% ఓటింగ్ జరిగింది. బీజేపీ 240 సీట్లు గెలుచుకోగా, ఎన్డీఏ మొత్తం 293 సీట్లు సాధించింది. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 99 సీట్లు గెలుచుకుంది, ఇది 2014 తర్వాత అత్యుత్తమ ప్రదర్శన.ఈ ఎన్నికలు జాతీయ రాజకీయాలను బీజేపీ కేంద్రంగా మార్చాయి, ఇక్కడ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ బలమైన ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది, దేశంలో కాంగ్రెస్ పార్టీ క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఢిల్లీ స్థాయిలోనూ, క్షేత్ర స్థాయిలోనూ ఆ పార్టీ క్రమంగా పట్టు కోల్పోతుంది. ప్రతి రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలపైన ఆధారపడి ఉండటంతో హస్తం పార్టీకి ఈ దుస్థితి పట్టింది. అదే కర్ణాటక, తెలంగాణలో జాతీయ పార్టీగానే కాంగ్రెస్ పోటీ చేసి అధికారంలోకి వచ్చింది. కానీ మిగిలిన చోట్ల ప్రాంతీయ పార్టీలు ఇచ్చే సీట్లపైనే ఆధారపడి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 2004కు ముందు పరిస్థితులు ఏంటి? 2014 తర్వాత ఏంటి? అన్నది కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని చూస్తేనే అర్థమవుతుంది. పదేళ్ల దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ క్షేత్ర స్థాయిలో బలాన్ని పెంచుకోలేకపోయింది.. నెహ్రూ కాలం నుంచి ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ హయాంలోనూ ఉత్తర్ ప్రదేశ్ లో కాంగ్రెస్ కు మంచి పట్టు ఉండేది. పటిష్టమైన ఓటు బ్యాంకు ఉండేది. కానీ రాను రాను రాహుల్ గాంధీ జమానాకు వచ్చే సరికి ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, ఢిల్లీ, మహారాష్ట్ర, ఒడిశా వంటి రాష్ట్రాల్లో తమ పట్టును కోల్పోయింది. ఒకప్పుడు ఈ ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పిడికిలి బిగించి గెలిచేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. బీజేపీని తట్టుకోవాలంటే ప్రాంతీయ పార్టీలతో కలసి వెళ్లాలని అనుకోవడమే ఆ పార్టీ తనకు తానే ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి వచ్చింది. కేవలం రాజస్థాన్, మధ్య ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మాత్రమే ఒంటరిగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ మిగిలిన రాష్ట్రాల్లో మాత్రం ప్రాంతీయ పార్టీల మద్దతు కోసం అర్రులు చాస్తుంది. బీహార్ లోనూ కాంగ్రెస్ పార్టీ ఆర్జేడీ బలపడటానికి పరోక్షంగా కారణమయింది. బలమైన కాంగ్రెస్ నేతలు విడిపోయి ప్రాంతీయ పార్టీలు పెట్టుకున్నారు. అది కూడా పార్టీకి ఇబ్బందిగా మారింది. మహారాష్ట్రలోనూ పొత్తులతోనే బరిలోకి దిగింది. ఒకప్పుడు బలమైన నాయకత్వం రాష్ట్రాల్లో ఉండేది. కానీ రానురాను రాష్ట్రాల్లో లీడర్ షిప్ బలహీనంగా మారింది. బీహార్ లోనూ అదే జరిగింది. మహా ఘట్ బంధన్ పేరుతో కూటమి ఏర్పాటు చేసుకున్నప్పటికీ, రాహుల్ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పాదయాత్ర చేపట్టినప్పటికీ రాష్ట్రాల్లో బలహీనమవుతుంది. కాంగ్రెస్ బీహార్ లో సింగిల్ డిజిట్ కు పడిపోయినా ఆశ్చర్యం లేదు. ఎంఐఎం కంటే తక్కువ స్థానాల్లో లీడ్ లో ఉంది. అదీ నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనే అది మెజారిటీలో కనిపిస్తుంది. నిజానికి బీహార్ లో మోదీ, నితీష్ కుమార్ అంటే నమో కాంబినేషన్ బాగా వర్క్ అవుట్ అయింది. ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలు కూడా బాగా పనిచేశాయి. నితీష్ కుమార్ కు ముఖ్యంగా మహిళల ఓట్లు అనుకూలంగా ఏకపక్షంగా పడినట్లు కనిపిస్తుంది. నితీష్ కుమార్ ప్రభుత్వం మద్యపాన నిషేధం అమలు చేయడంతో అనేక కుటుంబాలు ఆనందంగా ఉన్నాయి. అలాగే ఎన్నికల నోటిఫికేషన్ కు ముందు నితీష్ కుమార్ పది వేల రూపాయలు మహిళల ఖాతాల్లో జమ చేయడం కూడా కూటమికి కలిసి వచ్చింది. సీమాంచల్ లో ఆర్జేడీకి పట్టుంది. అలాంటి ప్రాంతంలోనూ బీజేపీ, జేడీయూలు గెలవడమంటే ప్రజలు



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# జానపద సినీ కథానాయకుడు కాంతారావు



తెలుగు సినీరంగంలో నందమూరి, అక్కినేనిల హవా నడుస్తున్న రోజుల్లో, సినిమాలు పరిమితంగా నిర్మిస్తున్న కాలంలో మరో హీరోకి అవసరం ఉందన్న ఆలోచన సినీ పరిశ్రమ చెయ్యని వేళ ఆ టాప్ హీరోల తర్వాత హీరోగా గుర్తింపు పొందిన అందాల నటుడు, జానపద హీరో, నాటి యువతుల కలల రాకుమారుడు కాంతారావు.తాడేపల్లి లక్ష్మీ కాంతారావు అంటే  వెంటనే స్ఫురణకు రాక పోవచ్చు. కానీ కత్తి కాంతారావంటే తెలుగు నాట తెలియని వారుండరు. వెండితెరపై జానపద కథా నాయకుడిగా టి.ఎల్.కాంతారావు వేసిన ముద్ర అలాంటిది. కత్తి పట్టిన జానపద వీరుడు అంటే ఇప్పటికీ కూడా మొదటగా గుర్తుకు వచ్చేది కాంతారావే. విఠలాచార్య, కాంతా రావుల కలయిక అపూర్వం. ప్రేక్షకులకు గుర్తుండి పోయినప్పటికీ ఆయన పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో సైతం మంచి పాత్రల ద్వారా అరుదైన అభినయాన్ని చూపించారు. నారదుడిగా, కృష్ణుడిగా, అర్జునుడిగా కూడా నటించారు. ఎన్టీఆర్ రాముడిగా నటించిన 'లవకుశ' సినిమాలో లక్ష్మణుడిగా నటించిన కాంతా రావు, రాష్ట్రపతి అవార్డును కూడా అందుకున్నారు. ఆయన సినిమా రంగానికి చేసిన సేవలకు గాను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము 2000లో రఘుపతి వెంకయ్య అవార్డు ప్రదానం చేసి సత్కరించింది. ఆయన స్వీయ చరిత్ర "అనగనగా ఒక రాకుమారుడు". తెలంగాణలోని నల్గొండ జిల్లా కోదాడ ప్రాంతంలో గుడిబండ గ్రామములో 1923లో ఒక కరణీకపు కుటుంబంలో పుట్టి, వంశపారంపర్య పట్వారీ వృత్తిమీద కన్నా ముఖానికి రంగువేసుకుని నటించటం మీద మక్కువ పెంచు కున్నాడు కాంతారావు.ఏడాది వయసులోనే తండ్రిని కోల్పో యారు. చదువుకునే రోజుల్లోనే నాటకాల పట్ల ఆకర్షితులయ్యారు. ఆపై వెండితెరపైకి వచ్చి నటుడిగా, నిర్మాతగా కూడా మరపురాని సినిమాలను అందించారు. తెలుగు సినిమా రంగములో అనేక సాంఘిక, జానపద, పౌరాణిక పాత్రలు ధరించిన కాంతారావు నిర్దోషి చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశాడు. హెచ్.ఎం. రెడ్డి తీసిన 'నిర్దోషి' (1951), 'ప్రతిజ్ఞ' (1953) మొదలుకుని 450కి పైగా సినిమాల్లో నటించారు. విఠలాచార్య దర్శకత్వంలో వచ్చిన జానపద చిత్రాల్లో కథానాయ కుడిగా ధీరోదాత్తంగా నటించి పేరు సంపాదించారు. నిర్మాతగా 'సప్త స్వరాలు', 'గండర గండడు', 'ప్రేమ జీవులు', 'గుండెలు తీసిన మొనగాడు' సినిమాలు తీశారు. రామారావు, నాగేశ్వరరావులకు సమకాలికులుగా కొన్ని సందర్భాలలో వారితో సమానమైన గుర్తింపు పొందారు. దాసరి నారాయణరావు మాటల్లో "తెలుగు చలనచిత్ర సీమకు రామారావు నాగేశ్వరరావులు రెండు కళ్ళైతే , వాటి మధ్య తిలకం వంటివారు కాంతారావు. ధరించిన కాంతారావు నిర్దోషి చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. ఈయన సినిమా రంగానికి చేసిన సేవలకు గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము 2000లో రఘుపతి వెంకయ్య పురస్కారంతో సత్కరించింది. ఆయన మొత్తం 400 పైగా చిత్రాలలో నటించాడు. ఒక దశాబ్దంపాటు హీరోగా రెండవ హీరోగా ఎన్నెన్నో పాత్రలు పోషించారు. 'నారదుడి' పాత్రకు కాంతా రావును తప్పించి మరెవరినీ ఊహించు కోలేనంతగా మెప్పించాడు. పౌరాణిక పాత్రలైన రాముడు, కృష్ణుడు పాత్ర ల్లోనూ ఎన్టీఆర్ తరువాత కాంతారావుగా గుర్తింపు జానపద హీరోగా కాంతారావుకు తిరుగులేదు. కాంతారావు కుమారుడు రాజా, సుడిగుండాలు సినిమాలో నటించాడు. ఆ చిత్రానికి ఉత్తమ బాల నటుడిగా నంది అవార్డు అందుకున్నాడు. యువ నటులు రావడం, జానపద చిత్రాలు తగ్గిన క్రమంలో, స్వయంగా సప్తస్వరాలు (1969)బీ గండర గండడు (1969)బీ ప్రేమ జీవులు (1971)బీ గుండెలు తీసిన మొనగాడు (1974)బీ  స్వాతి చినుకులు (1989) తదితర చిత్రాలకు నిర్మాతగా వ్యవహ రించారు. సినీ ప్రొడక్షన్‌లో ఏ మాత్రం అనుభవం లేని కాంతా రావు స్వయంగా సినిమాలు తీసిన సమయాన 1969 నాటికి తెలంగాణ రాష్ట్ర సాధన తొలిదశ ఉద్యమం సాగుతోంది. సినిమాలు ఆడే పరిస్థితి లేదు. 'సప్త స్వరాలు' 'గండర గండడు' వంటి సినిమాలు బాగున్నా ఆయన్ని ఆర్థికంగా ఆదుకోలేక పోయాయి. 'ప్రేమ జీవులు' సినిమా ఫ్లాప్. భారీ నష్టం. అయినా సినీరంగంలోనే వెతుక్కోవాలని ఆ తర్వాత తీసిన మరో రెండు సినిమాలు కూడా లాభాలను చేతికి అందివ్వలేదు. ఫైనాన్షియర్లకు వడ్డీలు కట్టటంతో సరిపోయింది. క్యారక్టర్ ఆర్టిస్ట్ గా కొత్త అవతారం ఎత్తాల్సి వచ్చింది. ఈ లోగా తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్‌కు తరలింది. పెరిగిన అప్పుల వల్ల చివరికి కట్టుకున్న ఇల్లును అమ్ముకుని, అప్పులు తీర్చి, ఒక చిన్న పెట్టెతో హైదరాబాద్ చేరారు. చిరుపాత్రలు, టి.వి. సీరియళ్ళు చేశారు. నటుడిగా కాక, వ్యక్తిగతంగా చాలా ఇబ్బందులుపడ్డారు. ఏవయినా సభలకు పిలిస్తే ఇచ్చే డబ్బులు, సన్మానాలు చేసి ఇచ్చే డబ్బుల కోసం ఆశగా ఎదురుచూసే పరిస్థితి. ప్రభుత్వ పరంగా గుర్తింపు లేదు. అతికష్టం మీద ఇచ్చిన రఘుపతి వెంకయ్య అవార్డు తప్పించి మరేమీ లేదు. అన్నీ నిరాశలే. చిట్టచివరి వరకు సొంత ఇంటికల కంటూనేవున్నారు. అడపాదడపా సినీ పెద్దలు ఎవరయినా సహాయం అందించినా అది ఇంటికి సరిపోయేంత కాదు. ఇల్లు గడవటానికి సరిపోయేంత మాత్రమే. చివరికి క్యాన్సర్ బారిన పడ్డారు. అదీ ఆలస్యంగా గుర్తింపు. ఏ దురలవాట్లూ లేక, ఎవరికీ హాని చేయని మనిషి ఒక్క సంవత్సరంలో శరీరాన్ని తినేసిన క్యాన్సర్ దెబ్బకు మరణించారు. సినీరంగానికి వెలుపల స్నేహితులు ఉన్న వాడు కాదు కాంతారావు. తాను పుట్టి పెరిగిన సముద్రమే చేపను ఎత్తి అవతల వేస్తే అది ఎలా విలవిలా కొట్టుకుంటుందో,  అలా సినీరంగమనే సముద్రపు ఆటుపోట్లకు బలైన రాకుమారుడు కాంతారావు. ప్రేక్షకుల మనసులో చెరగిపోని ముద్ర వేసిన కాంతారావు, తన 85వ ఏట, 2009 మార్చి 22నక్యాన్సర్ వ్యాధి మూలంగా హైదరాబాద్‌లో మరణించారు.

# భాషా శాస్త్రవేత్త ఆదిరాజు



తెలంగాణలో విద్యావైజ్ఞానిక రంగాల అభివృద్ధికీ, సాంస్కృతిక పునరుజ్జీవనానికీ నిరంతరం కృషి చేసిన వైతాళి కుడు, ప్రసిద్ధ రచయిత, చరిత్రకారుడు ఆదిరాజు వీరభద్రరావు. తెలంగాణ ప్రాంతపు చరిత్ర, సంస్కృతిపై విశేష పరిశోధన చేసిన గొప్ప భాషా శాస్త్రవేత్త. ఆయన  సంగ్రహాంధ్ర విజ్ఞానకోశ నిర్మాతగా, శాసన పరిశీల కునిగా, బాలవాఙ్మయ కర్తగా, ఉత్తమ అధ్యాపకునిగా, తెలంగాణ సాంస్కృతిక వికాస చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో గ్రంథాలయ అధికారిగా, కార్యదర్శిగా, అధ్యక్షులుగా పనిచేశారు. విజ్ఞాన చంద్రిగా గ్రంథమాల కార్యాలయ ప్రముఖులుగా, ఆంధ్ర జనసంఘ కార్యవర్గ సభ్యులుగా, లక్ష్మణరాయ పరిశోధకమండలి కార్యదర్శిగా, ఆంధ్ర సారస్వతపరిషత్తు స్థాపక సభ్యులుగా, ఆంధ్ర చంద్రికా గ్రంథమాల ప్రధాన సంపాదకులుగా, విజ్ఞానవర్ధినీ పరిషత్తు సభ్యులుగా, సంగ్రహాంధ్ర విజ్ఞానకోశ ప్రధాన సంగ్రాహకులుగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యులుగా. బహుముఖ సేవలను అందించారు. ఆదిరాజు వీరభద్రరావు (16.11.1892 – 28.9.1973) 1892 నవంబర్ 16న ఖమ్మం జిల్లా దెందుకూరులో వెంకమ్మ, లింగయ్య పంతులకు జన్మించారు. తల్లి దండ్రులు చిరుప్రాయం లోనే మరణించగా, శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం వ్యవ స్థాపకులైన రావిచెట్టు రంగారావు ఆదిరాజును చేరదీశారు. దాంతో హైదరా బాదులోని చాదర్‌ఘాట్ హైస్కూలులో మెట్రిక్ చదివారు.1901లో కొత్తగా స్థాపించిన శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం నిర్వహణలో భాగస్వామ్యం వహించే అవకాశం వీరభద్రరావు లభించింది. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం గ్రంథాలయానికి తొలి గ్రంథపాలకులుగా ఆదిరాజు వీరభద్రరావు నియమితులైనారు. విఖ్యాత పరిశోధకులు కొమర్రాజు వెంకటలక్ష్మణ రావు హైదరా బాదులో 1905లో విజ్ఞాన చంద్రికా గ్రంథమాలను స్థాపించారు. ఆదిరాజు దానిలో సహాయకునిగా చేరారు. స్థానిక అననుకూల పరిస్థితుల వల్ల కొమర్రాజు  విజ్ఞాన చంద్రికా గ్రంథమాలను 1908లో బ్రిటీషాంధ్ర రాజధాని మద్రాసు (నేటిచెన్నై)లు తరలించిన తరుణంలో, లక్ష్మణరావు విజ్ఞప్తి మేరకు వీరభద్రరావు కూడా మండలిలో పనిచేయటానికి మద్రాసు వెళ్ళారు. 1914 లో విజ్ఞాన చంద్రికా గ్రంథమాల హైదరాబాదుకు మారడంతో ఆదిరాజు వారు తిరిగి హైదరాబాదుకు చేరుకున్నారు. 1914లో హైదరాబాదుకు తిరిగివచ్చి మహబూబ్ కళాశాలలో తెలుగు ఆచార్యునిగా నియమితుడయ్యారు. ఆ తరువాత ఛాదర్‌ఘాట్ ఉన్నత పాఠశాలలోనూ, నారాయణ గూడలోని బాలికోన్నత పాఠశాలలోనూ తెలుగు పండితులుగా పనిచేశారు. మర్రి చెన్నారెడ్డి ఇతని శిష్యులలో ప్రముఖుడు.1914 నుండి 1921 దాకా చాదర్‌ఘాట్ హైస్కూలులో ఆతర్వాత 1949 నుండి 1953 దాక నారాయణ గూడా బాలికోన్నత పాఠశాలలో పనిచేశారు. ఆ తర్వాత సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశానికి ప్రధాన సంగ్రాహకులుగా వ్యవహరించారు. 1921లో తెలంగాణ సాహితీ సాంస్కృతిక వికాసానికై ఆంధ్ర పరిశోధక మండలి స్థాపించి నప్పుడు దానికి కార్యదర్శిగా ఆదిరాజు పనిచేశారు. ఆ సంస్థ తెలంగాణ లోని పలు చారిత్రక ప్రదేశాలు, శిలా శాసనాలు, తాళపత్ర గ్రంథాలు సేకరించి "తెలంగాణ శాసనాలు" పేరిట పెద్ద గ్రంథాన్ని ప్రచురించుటలో ఆదిరాజు కృషి అసమానమైనది. ఆదిరాజుకు బాగా పేరు తెచ్చిన గ్రంథాల్లో ప్రాచీనాంధ్ర నగరములు , మన తెలంగాణా అనేవి ప్రధానమైనవి.అలంపురం, ఆనెగొంది, కళ్యాణి, కొండాపురం, కొలనుపాక, గోలకొండ,పానుగల్లు, ప్రతిష్ఠానం, బోనగిరి, రాచకొండ, వరంగల్లు, వేల్పుగొండ అనే ప్రసిద్ధ నగరాలకు సంబంధించిన పూర్వరాజుల, రాణుల, మంత్రుల, శిల్పుల, గాయకుల, కవుల జీవిత చారిత్రక విశేషాలతో పాటు భౌగోళిక, సాంఘిక ఆర్థిక మత విషయాలను, ఆ పట్టణాల పతన హేతువులను నిష్పక్షపాతంగా వివేచించి ఎన్నో అపూర్వ విషయాలను వెలుగులోనికి తెచ్చారు. నాణెములను గురించి, చరిత్ర పునర్నిర్మాణంలో వాటి పాత్ర గురించి వివరిస్తూ భారతదేశంలో అతి ప్రాచీన నాణేలు తొలిసారిగా తెలంగాణ ప్రాంతమైన కరీంనగర్ లో దొరికాయని, నాణేలు ముద్రించే టంకసాలలు సైతం తెలంగాణలో ఉండేవని ఒకటి కొండాపూర్‌లో, రెండవది కోయిలకొండలో ఉండేదని చారిత్రకాధారాలతో నిరూపించారు. ఆదిరాజు ఆనాడు పేర్కొన్న కొన్ని తాళపత్రగ్రంథాలు – శ్రీకృష్ణ శతానందీయం, తాలాంక నందినీ పరిణయం, దశరథరాజ నందినీ పరిణయం లాంటి కావ్యాలు పండిత పరిష్కృతాలయి వెలుగులోకి వచ్చాయి. తెలంగాణకు సంబంధించిన విభిన్న అంశాలను సత్య దృష్టితో పరిశీలిస్తూ వెలువరించిన గ్రంథం "మన తెలంగాణం". ఆదిరాజు వారికి బాగా పేరు తెచ్చిన మరో గ్రంథం "షితాబుఖాన్ లేక సీతాపతిరాజు" చరిత్ర. 68 గ్రీకు పురాణ దేవతలకు సంబంధించిన కథలను, హిందూ దేవతలతో పోల్చి బాలురకీ అర్థమయ్యే రీతిలో సులభ వ్యావహారిక శైలిలో "గ్రీకు పురాణ కథలు" పేరుతో ప్రచురించారు. విద్యార్థుల కోసం రఘునాథ నాయకుడు, మార్కోపోలో, మీరాబాయి, శ్రీహర్షుల సంక్షిప్త జీవిత చరిత్రలు ప్రచురించారు. జానపద సాహిత్యం, గ్రామనామాలు, వ్యక్తి చరిత్రలు, శాసనాలు, చరిత్రలు, దర్శనీయ స్థలాలు, సంస్కృతి సంబంధాలు, ఆచార వ్యవహారాలు, సామెతల జాతీయాల వివరణ, మహబూబునగర్, మెదక్, నల్లగొండ లాంటి వివిధ జిల్లాల స్వరూప స్వభావాల గురించిన వ్యాసాలు, వంటి ఎన్నో పరిశోధనాత్మక విశ్లేషణలు చేసారు. దక్కన్ రేడియోలో మొదటి సారి తెలుగులో ప్రసంగించిన వ్యక్తి ఆదిరాజు కావడం విశేషం. దాదాపు నూట యాభై రేడియో ప్రసంగాలు చేశారు. హైదరా బాదులో ఆ కాలంలో వెలసిన ప్రతీ సాహిత్య సాంస్కృతిక సంస్థకు వెన్నుదన్నుగా నిలిచిన ఆదిరాజు 1973 సెప్టెంబర్ 28న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు..

## విభేదించినపుడు 'సహనం' యుక్తం

సహృదయుల్లో కనిపించే ప్రధాన సుగుణాల్లో సహనశీలత ఒకటి. అహింసకు ప్రతిరూపం సహన గుణమే. ఇతరుల సంస్కృతి, వారసత్వం, జీవనసరళి, వైవిధ్యత, ఆచారవ్యవహారాలు, భావప్రకటన స్వేచ్ఛలను గౌరవించడం, విభేధాలను సానుకూలతతో అంగీకరించడం, ప్రశంసించడం మన నిత్య జీవన విధానం కావాలి. విభేధాల్లో సహితం సామరస్యత ప్రదర్శించడమే అసలైన సహనశీలతగా అర్థం చేసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా అనేక వైవిధ్యభరిత ఆచారవ్యవహారాలు, సంస్కృతులు, భాషలు, పద్ధతులు, జాతులు, కళలు ఉన్నాయి. ఈ వైవిధ్యతలే మానవ జాతి ఎదుగుదలకు, అద్భుత ఆనందమయ అనుభవాలకు పునాదులు అవుతున్నాయి. భిన్నత్వంలో ఏకత్వ సాధన ద్వారా పరస్పర గౌరవం, సమాజాభివృద్ధి జరుగుతున్నాయి. ఇతరులు పాటించే ఆచారాలను, మత విశ్వాసాలను, కుల వారసత్వాలను గౌరవిస్తూ, సమన్వయ భావనలతో ముందుకు సాగడానికి సహనం అనే అద్భుత గుణం ఉపయుక్తం అవుతుంది. సహనశీల గుణం ద్వారా ఇతరుల మానవ హక్కులు, మౌలిక స్వేచ్ఛ పరిరక్షించబడతాయి. విశ్వ మానవాళి జీవన సరళి సహజంగానే వైవిధ్యభరితం, విలక్షణం. అయినప్పటికీ వారిని శాంతి సామరస్యాలతో కట్టి ఉంచేది దారమే సహన గుణ సంపద అని గమనించాలి. మానవ సమాజ ఏకీకరణకు, ప్రశాంత జీవన విధానాలు కొనసాగడానికి సహనం అనే గుణం ప్రధానమైనదని అంగీకరించిన ఐరాస 1995 ఏడాదిని "అంతర్జాతీయ సహన సంవత్సరం(ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ టాలరెన్స్)"గా పాటించడం, దానికి కొనసాగింపుగా 1996 నుంచి ప్రతి ఏట 16 నవంబర్ రోజున "అంతర్జాతీయ సహన దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ టాలరెన్స్)"గా పాటించడం ఆనవాయితీగా మారింది. సహన భావన మన సంస్కృతి, వారసత్వం, ఆచారాల్లో దాగి ఉంది. అంతర్జాతీయ సహన దినం వేదికగా సహనశీలత ప్రాధాన్యాన్ని వివరించడం, అహింసాయుత ఆలోచనలను తట్టిలేపడం, ఓపికను ప్రదర్శించడం, సామాజిక సామరస్యతను పాటించడం, ఇతరుల అభిప్రాయాలు/జీవన విధానాలను గౌరవించడం, ప్రపంచ మానవాళిలో సోదర భావాన్ని జాగృత పరచడం, మానవ హక్కులను పరిరక్షించడం, సహనశీలత కేంద్రంగా చర్చలు/విద్యార్థులకు పోటీలు/సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం లాంటి పలు ఆలోచనలను కార్యరూపంలోకి తేవచ్చు. తీవ్రవాద ధోరిణులు, ఉగ్రవాద రక్తపాతాలు, మత ఘర్షనల మంటలు, కులాల కుమ్ములాటలు, మానవ హక్కుల హననాలు, యుద్ధాలు, సంస్కృతిక విభేదాలు, వేర్పాటువాద హింసలు, ప్రాంతీయ తత్వాలు కొనసాగుతూనే ఉన్నాయి.



## అమలాపురంలో
# అత్యంత ఘనంగా శెట్టిబలిజ వనసమారాధన

సుభాష్ అనే నేను పాలకునిగా కాదు సేవకునిలా ఉంటా.. - శెట్టి బలిజలకు అండగా ఉంటా
రూ. కోటి రూపాయలు భూరి విరాళం ప్రకటించిన మంత్రి సుభాష్ - జాతి కష్టాలు తీర్చేందుకు ఎస్ఎఎఫ్ స్థాపన
యాశించవద్దు.. కష్టపడి సాధిద్దాం - పార్టీలు చూడం.. కష్టాన్ని చూస్తాం - శెట్టిబలిజిగా పుట్టినందుకు గర్విస్తున్నా.
జీవితాంతం టిడిపిలోనే .. లోకేష్ టీమ్ లోనే ఉంటా.. - పేదరిక నిర్మూలనకు పోరాటం చేస్తా - ఎకరాలు పోయినా నికరంగా ఉంటాను
శెట్టిబలిజలు దేశంలో ఎక్కడున్నా బీసీలుగా గుర్తించాల్సిందే - నా జీవితం ప్రజాసేవకే అంకితం..
శెట్టిబలిజల వన సమారాధనలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్





**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** సుభాష్ అనే నేను.. జీవించి ఉన్నంతవరకు జాతిలో ఏ ఒక్కరికి కష్టం వచ్చినా అండగా ఉండి ఆదుకుంటానని, అలాగే రాష్ట్ర ప్రజలకు ఏ కష్టం కలిగినా ముందు ఉంటానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ భరోసా నిచ్చారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలోని ఆదివారం సత్తెమ్మ తల్లి ఆలయం ఆవరణలో జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల 4వ శెట్టిబలిజ వన కార్తీక సమారాధన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సుభాష్ పాల్గొని సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు రెండు రాష్ట్రాల్లో ఉన్న శెట్టిబలిజలను ఒకే వేదికగా తీసుకొచ్చి వారిలో ఐక్యత నింపే ఉద్దేశంతో, ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశామన్నారు. తమ ఆహ్వానాన్ని మన్నించి లక్షలాదిగా తరలి వచ్చిన కుటుంబ సభ్యులను చూసి మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలు ఐక్యంగా ఉంటూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయ చైతన్యం కలిగి ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. రాజకీయ పార్టీలకు అతీతంగా తరలి వచ్చిన అశేష జన సందోహంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కోలాహలంగా, పండుగ వాతావరణంలా మారింది. యువత కేరింతలు, బాణా సంచాలతో సభా ప్రాంగణం అంతా జాతర వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మాపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెడితే జాతి సభ్యులు కొండంత అండగా నిలబడి ఓదార్పు నిచ్చారన్నారు. మీ అండ, కొండంత బలం చూసి దిగివచ్చిన గత ప్రభుత్వం కేసులు ఎత్తివేసింది అన్నారు. జాతి ప్రజలు శాసించే వారిగా ఉండాలి కానీ.. యాచించే వారిగా కాదన్నారు. అన్యాయంగా కేసుల్లో ఇరికించి బాధల్లో ఉన్న తన పక్షాన నిలబడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. నా ఈ జీవితం ప్రజాసేవకేనని, ఈ అధికారం ప్రజల రుణం తీర్చుకునేందుకేనని అన్నారు. గత ప్రభుత్వ అక్రమ కేసుల నుంచే ఈ ఆత్మీయ కలయిక, ఎస్ఎఎఫ్ స్థాపన జరిగిందన్నారు. శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ (ఎస్ఎఎఫ్) స్థాపించి, వ్యక్తిగతంగా కోటి రూపాయలు నిధులు విరాళం ప్రకటించారు మంత్రి. వారం రోజుల్లో ఈ నిధులను ఎస్ఐఎఫ్ అకౌంట్ లో జమ చేస్తానన్నారు. ఎకరాలు పోయినా నికరంగానే ఉంటాను.. ఆస్తులు అమ్మయినా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాను.. అంటూ నొక్కి ఒక్కానించారు. కొంతమందిలా జాతిని తాకట్టు పెట్టే రకం తాను కాదని, ఎస్ ఏ ఎఫ్ ద్వారా జాతిలో పేదరిక నిర్మూలనకు నేను సిద్ధం.. మీరు సిద్ధమా అంటూ ప్రోత్సహించారు. శెట్టిబలిజ గానే పుట్టాను.. శెట్టి బలిజిగానే చస్తాను.. మళ్లీ జన్మ ఉంటే శెట్టి బలిజ గానే పుడతాను..అంతే తప్ప జాతిని కించపరిచే కొంతమందిలా ఉండబోనన్నారు. శెట్టిబలిజ జాతి గౌరవం నిలబెట్టిన దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాల సాధనకు కృషి చేద్దామన్నారు. నేను తప్పు చేస్తే మీరు ఎప్పుడైనా ప్రశ్నించవచ్చు.. మంచి కుటుంబం, ప్రేమగా చూసుకునే మీరంతా అండ ఉండగా మంచి పనులకు వెనకాడబోను అన్నారు. తనకు రాజకీయ జీవితం ప్రసాదించిన తెలుగుదేశం పార్టీలోనే.. లోకేష్ టీమ్ లోనే కొనసాగుతానని ప్రకటించారు. గుండెల్లో పెట్టుకొని అత్యధిక మెజార్టీతో గెలిపించిన రామచంద్రపురం నియోజవర్గ ప్రజలు, రాష్ట్ర ప్రజలు రుణం తీర్చుకుంటానన్నారు. సాధారణ కార్యకర్త నుంచి ఎమ్మెల్యే, మంత్రిగా నిలబెట్టిన రామచంద్రపురం నియోజకవర్గం ప్రజలకు, రాష్ట్ర సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు మంత్రి సుభాష్ కృతజ్ఞతలు తెలియజేశారు. పదవులు ఉన్నా.. లేకున్నా నేను మీ వెంటే ఉంటా.. మీ అందరి రుణం తీర్చుకుంటా.. మీలో ఒక్కడిగా ఉంటా.. అన్ని కులాలను కలుపుకుంటా.. జాతి, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తా అంటూ నినదించారు. గత 15 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కష్టంలో ఎవరున్నా పార్టీ చూడకుండా వ్యక్తిగతంగా ఆదుకుంటామన్నారు. తనను అణచివేసేందుకు కొన్ని రాజకీయ శక్తులు పనిచేసాయని, మీ అందరి ఆశీర్వాదం, సహకారంతో రాష్ట్ర క్యాబినెట్లో స్థానం దక్కింద న్నారు. బీసీల సామాజిక భద్రత కోసం బీసీల రక్షణ చట్టానికి రూప కల్పన జరుగుతుంది అన్నారు. మద్యం షాపుల కేటాయింపుల్లో గీత కార్మికులకు 10 శాతం షాపులు కేటాఇంచా మన్నారు. దేశంలో శెట్టిబలిజలు ఎక్కడ ఉన్నా బీసీల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. దేశ భవిష్య త్తులో యువతే కీలకమని, వారు సన్మార్గంలో ఉండి జాతిని, సమాజాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఏ రంగం లో ముందుకెళ్లాలన్నా విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, జాతిలో చదువుకోలేని పేదవారికి ఎస్ఎఎఫ్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మంత్రి సుభాష్ తండ్రి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ జాతి ఐక్యత అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఒక్క ఫోన్ కాల్ చేస్తే తమ సహాయ, సహకారాలు ఉంటాయని ప్రకటించారు. శెట్టిబలిజల వన సమారాధనను ఒక పండుగలా నిర్వహిస్తున్నామ న్నారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ రావు, శెట్టి బలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడిపూడి సత్తిబాబు తదితరులు మాట్లాడుతూ శెట్టిబలిజ జాతి కోసం మంత్రి సుభాష్ చేస్తున్న సేవలను కీర్తించారు. ఆనాడు శెట్టిబలిజల అభ్యున్నతికి దొమ్మేటి వెంకటరెడ్డి, కుడుపూడి సూర్యనారాయణ వంటి మహనీయులు కృషి చేయగా వారి బాటలో ఈ తరం శెట్టిబలిజ జాతి ముద్దుబిడ్డ మంత్రి సుభాష్ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. శెట్టిబలిజలకు రాజ్యాధికారం దిశగా కృషి జరుపుతామని అన్నారు. తొలుత శెట్టిబలిజ జాతి పితామహుడు కీర్తిశేషులు దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూజా కార్యక్రమంతో ప్రారంభమైన ఈ ఆత్మీయ సమ్మేళనం ఆద్యాంతం కోలాహలంగా జరిగింది. తొలుత మంత్రి సుభాష్ ను అమలాపురం మెయిన్ రోడ్డు మీదుగా భారీ ఊరేగింపుతో, బాణా సంచాలతో ఘనంగా సభా వేదిక వద్దకు తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ నాయకులు సంఘ నాయకులు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ కూడిపూడి సూర్య నారాయణ రావు, పెచ్చెట్టి చంద్రమౌళి, సివిల్ సప్లై డైరెక్టర్ కడలి ఈశ్వరి, పెచ్చెట్టి విజయలక్ష్మి, గుత్తుల సాయి, వాసంశెట్టి చినబాబు, చొల్లంగి వేణుగోపాల్, వాసంశెట్టి రాజేశ్వరరావు, పెంకె శ్రీనివాస బాబా, మట్టపర్తి నాగేంద్ర, చొల్లగి వెంకటరమణ, తదితరులు పాల్గొని మాట్లాడారు.

## అమలాపురంలో ఘనంగా రజకుల కార్తీకమాస వన సమారాధన కార్యక్రమం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో రజక సామాజిక వర్గీయులు ఆదివారం ఏర్పాటు చేసిన 22వ రజక వనసమారాధన కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. పట్టణంలోని స్థానిక వడ్డిగూడెం నందలి వీర్రాజు గార్డెన్ వద్ద ఏర్పాటు చేసిన ఈ వనసమారాధనకు కోనసీమ వ్యాప్తంగా రజక సామాజిక వర్గీయులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వన సమారాధన నిర్వాహకులు మీడియాతో మాట్లాడుతూ రజక వృత్తిలో అణగారిపోతూ అనేక ఇబ్బందులకు గురవుతున్న తమ రజక సామాజిక వర్గం ప్రగతి బాటలో పయనించడానికి తమ చిన్నారులకు ఉన్నత విద్యను అందించి వారిని ప్రయోజకులను చేయాలానే దృఢ సంకల్పంతో రజకుల్లో ఐక్యతను పెంపొందించడానికి గత 22 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఈ ఆత్మీయ వన సమారాధనను క్రమం తప్పకుండా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. రజకుల్లో 50 సంవత్సరాలు నిండినవారికి పెన్షన్లు ఇస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం బీసీ లుగా ఉన్న తమను ఎస్సి జాబితాలో చేర్చాలని వారు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను కోరారు. వనసమారాధన సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీల్లో పాల్గొన్న చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పేట వెంకటేశ్వరరావు మాచవరపు కామేశ్వరరావు చెయ్యేటి కిరణ్ కుమార్ పేట మణికంఠ పేట హనుమంతు యు. శ్రీనివాసరావు మరియు ఆహ్వాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పవర్ కిక్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడలో ద్రోణా బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం గోల్డెన్ షోటోకాన్ కరాటే అకాడమీ వారు నిర్వహించిన జాతీయస్థాయి కరాటే, కుంగ్ ఫూ పోటీలలో పవర్ కిక్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు చీఫ్ కోచ్ పడాల అంజి తెలిపారు. ఈ పోటీలలో వివిధ రాష్ట్రాల నుండి సుమారు 500 మంది పాల్గొనగా అమలాపురం విద్యార్థులు 13 మంది పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈపోటీలకి రిఫరీగా చిక్కం సురేష్ వ్యవహరించారు. పథకాలు గెలుపొందిన విజేతలను పలువురు అభినందించారు.

## వాడపల్లి దేవస్థాన మాజీ చైర్మన్ రమేష్‌రాజు కుటుంబాన్ని
# పరామర్శించిన రెడ్డి సుబ్రహ్మణ్యం



**కొత్తపేట/ఆత్రేయపురం,విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల గుండె పోటుతో ఆకస్మికంగా మృతి చెందిన వాడపల్లి శ్రీదేవీ, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు కుటుంబ సభ్యులను ఆయన సోదరుడు రుద్రరాజు ఆంజనేయరాజును తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం పరామర్శించారు.ఆదివారం వెదిరేశ్వరంలో గల రమేష్ రాజు స్వగృహానికి వెళ్లిన రెడ్డి సుబ్రహ్మణ్యం, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా రమేష్ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.?దివంగత రమేష్ రాజు దేవస్థానం చైర్మన్ గా చేసిన సేవలను ఈ సందర్భంగా రెడ్డి సుబ్రహ్మణ్యం గుర్తు చేసుకున్నారు.రమేష్ రాజు మృతి తీరని లోటని పేర్కొంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.ఆయన వెంట సయ్యప్పరాజు రామకృష్ణరాజు, దండు సూర్యనారాయణరాజు తదితరులు ఉన్నారు.

## సోమవారం యధావిధిగా
# ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం
## జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** నవంబర్ 17వ తేదీ సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం యధావిధిగా నిర్వహించడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా స్థాయిలో సమస్యలు ఉన్న అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాక పోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్కు ఫోన్ చేసి సమా చారాన్ని పొందవచ్చున న్నారు అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకో వడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జి వో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవ చ్చున్నారు. ప్రజలు ఈ అవ కాశాన్ని కూడా సద్వినియో గం చేసుకొని తమ సమస్య లకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమ వారం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వ హించడం జరుగుతుంద న్నారు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్ర మంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన రసీదులను తీసుకురావాలని సూచిం చారు. మండల స్థాయి సమస్యలకు మండల స్థాయి లోనూ డివిజన్ స్థాయి సమ స్యలకు డివిజన్ స్థాయిలోనూ అందించి పరిష్కార మార్గాలు కోరాలన్నారు కేవలం జిల్లా స్థాయి సమ స్యలకు మాత్రమే జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేది కలో సమర్పించి పరిష్కార మార్గాలు కోరాలని ఆయన స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో ఘనంగా కాపు కార్తీక వనసమారాధన
## అమలాపురం నుండి హాజరైన పలువురు కాపు నాయుకులు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో కూకట్ పల్లి కాపు వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక మాస వన సమారాధన మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, రాజ్యసభ ఎంపీ కె.లక్ష్మణ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్, వైసీపీ నేత ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జనసేన నాయకులు, అటవీ శాఖ ఐటీ అడ్వైజరీ పిన్నమరెడ్డి నాగబాబు, కొత్తపేట జనసేన్ కన్వీనర్ బండారు శ్రీనివాస్, డైరెక్టర్ బాబీ, డైరెక్టర్ మారుతి, ప్రొడ్యూసర్ ఎస్కేఎన్, కాపు రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్ దివంగత నల్లా సూర్య చంద్రరావు కుమారుడు నల్లా సంజయ్, పలువురు కాపు కుటుంబీకులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రౌడీ షీటర్స్‌కి కౌన్సిలింగ్





**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లను స్టేషన్లకు పిలిపించి వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

**కౌన్సిలింగ్ ముఖ్య ఉద్దేశాలు:**

శాంతిభద్రతల పరిరక్షణ: జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిరోధించడం.

మార్గనిర్దేశం: రౌడీ షీటర్లు పాత నేర చరిత్రను విడిచిపెట్టి, మంచి జీవనం గడిపేలా వారికి మార్గనిర్దేశం చేయడం.

హెచ్చరిక: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే, కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంగా హెచ్చరించడం.

జీవనోపాధి: నేరాలకు దూరంగా ఉంటూ గౌరవప్రదమైన జీవనోపాధిని ఎంచుకోవాలని వారికి సూచించడం. ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ మాట్లాడుతూ, "జిల్లాలో ఎలాంటి అసాంఘిక శక్తులు, రౌడీయిజం, గూండాయిజంలకు తావు లేకుండా చూస్తాము. నేరాలకు పాల్పడే వారిపై, పాత నేరాలను పునరావృతం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోము. ఈ కౌన్సిలింగ్ ద్వారా వారు తమ ప్రవర్తనను మార్చుకుంటారని ఆశిస్తున్నామని తెలిపారు.

## ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ & గోపాల స్వామి
# అన్నదాన పథకమునకు విరాళాల వెల్లువ










**కొత్తపేట/ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ వాస్తవ్యులు దండు వేంకట సత్యనారాయణ రాజు, పద్మ దంపతులు, దండు రాజ్ గోపాలరాజు వందన దంపతులు ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ & గోపాల స్వామి వారిని దర్శించుకొని శ్రీ స్వామి వారి అన్నదాన పథకమునకు చెరొక రూ.25,116/- లు వెరశి రూ.50,232/- లు విరాళంగా ను రావులపాలెం వాస్తవ్యులు పెన్మెత్స సిరిచందన వారు అన్నదాన పథకమునకు రూ.5,116/-లు విరాళంగాను నరసాపురం వాస్తవ్యులు రుచిత వారు అన్నదాన పథకమునకు రూ.6,516/-లు విరాళంగాను ఏలూరు వాస్తవ్యులు ఎం.తిరుమలా దేవి రమేష్ వారు స్వామి వారి అన్నదాన పథకమునకు రూ.15,000/- లు విరాళంగా ను హైదరాబాద్ వాస్తవ్యులు గన్నవరపు సత్య సుబ్బారావు లక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు స్వామి వారి ఆలయ అభివృద్ధి కార్యక్రమముల నిమిత్తం రూ.5,116/- లు విరాళంగా ను సమర్పించియున్నారు.దాతలకు ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించడమైనదని కార్యనిర్వాహణాధికారి తెలియజేశారు.





పోతులూరు గ్రామంలో

# వైకాపా నేత మురళి రాజు పర్యటన

## బాధిత కుటుంబాలకు 5000 చొప్పున ఆర్థిక సహాయం



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్** : ప్రత్తిపాడు నియోజక వర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు మరియు ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ముదునూరి మురళీకృష్ణం రాజు ఆదివారం ప్రత్తిపాడు మండలం పోతులూర్శు గ్రామంలో పర్యటించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సికోలు ప్రసాద్ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు వారి చేతికి ఆపరేషన్ చేయించుకోవడం జరిగింది. వారిని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.వారి కుటుంబానికి ఏ కష్టం వచ్చిన అండగా ఉంటానని భరోసా కల్పించినారు. అనంతరం ఆయన అదే గ్రామంలో పొట్టూరి ముసలయ్యకి ఇటీవల కాలంలో పక్షవాతం వచ్చి కాలు చెయ్యి లాగి ఆరోగ్యం బాలేని కారణంగా ముసలయ్య ని పరామర్శించి ధైర్యం చెప్పి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాలకు ధైర్యంగా ఉండాలని చెప్పిన ఆయన తమ ఎం ఎం ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పోతులూర్శు సర్పంచ్ బొండి రాంబాబు, శెట్టి సత్తిబాబు, ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, మాజీ వైస్ సర్పంచ్ పంచాది చంటిబాబు, చెక్కపల్లి నాగేశ్వరరావు, ఎలుగుబంటి బాబ్జి, చెక్కపల్లి బుజ్జిబాబు, రేఖ కృష్ణ అర్జునుడు, మాది సత్తిబాబు, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, నానిపల్లి వెంకన్న, పొట్టూరి కుటుంబ సభ్యులు, వైస్సార్సీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో


# చదరంగం పోటీలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్** : స్థానిక శ్రీకందుకూరి వీరేశలింగం పుర మందిరం లో ఉన్న జూబ్లీ లైబ్రరీ అండ్ రీడింగ్ రూమ్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న 58వ జాతీయ గ్రంథా లయ వారోత్సవాలలో భాగంగా మూడవరోజు ఆదివారం చదరంగం పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీ లను జూబ్లీ లైబ్రరీ కార్యదర్శి డిస్ట్రిక్ట్ సెంట్రల్ బ్యాంక్ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు ప్రారంభిస్తూ చదరంగం ఆడడం వలన మేధాశక్తి పెరుగుతుందని మెదడు చురుకుగా పనిచేస్తూ ఒత్తిడి సమయంలో సరైన నిర్ణయాలు తీసుకునే శక్తి అలవడుతుందని, కావున విద్యార్థులు అందరూ చదరంగం నేర్చుకోవడం వారి జీవితంలో భాగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ ఉపాధ్యక్షులు రెడ్డి రాజు, డాక్టర్ లంక సత్యనారాయణ, నరవ గోపాలకృష్ణ, లైబ్రేరియన్ వి టి వి సుబ్బారావు, దేవి శెట్టి రాజా, ఎస్వీ రమణారావు, బ్రహ్మ సమాజ కార్యకర్తలు గౌతమ్, మణికంఠ, రాజు తదితరులు పాల్గొనగా పోటీలకు ఆర్బిటేటర్లుగా జి.హేమచంద్రమౌళి, జీవీఎన్ లక్ష్మి వ్యవహరించారు. విజేతలకు 20వ తేదీ సాయంత్రం జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రధానం చేస్తారని నిర్వాహకులు తెలియజేశారు.


దేవిపట్నం మండలంలో

# నూతన కమిటీల ప్రమాణస్వీకారం



**దేవిపట్నం, విశ్వంవాయిస్ న్యూస్** : రంపచోడవరం నియోజకవర్గం దేవి పట్నం మండల లోని నియోజకవర్గ శాసన సభ్యురాలు, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి మిరియాల శిరీషదేవి ఆదేశాల మేరకు మంగళవారం మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేయడమైనది అని మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు తెలియజేశారు. మండల కమిటీ, మండల అనుబంధ కమిటీలు, సొసైటీ అనుబంధ కమిటీల, యూనిట్, గ్రామ, బూత్ ఇంచార్జ్‌ల ప్రమాణస్వీకారం ఉంటుందని ఈ కార్యక్రమానికి ముఖ్యాతిదిలు గౌరవ ఎమ్మెల్యే మరియు రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి మిరియాల శిరీషాదేవి పాల్గొంటారని తెలియజేశారు. అలాగే నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ కూడా హాజరవుతారు అని తెలిపారు. దీనికి గాను మండలంలోని రాష్ట్ర, పార్లమెంట్, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, మండలంలో ఉన్నటువంటి గ్రామ కమిటీ నాయకులు, (కూటమి) జనసేన, బీజేపీ, నాయకులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు అందరూ హాజరవ్వాలని కోరడమైనది మైనది అని తెలిపారు. సమయం ఉదయం 9:00 గంటలకు అందరూ హాజరు అవ్వాలని కోరారు. వేదిక స్థలం ఇందుకూరు నిక్ పామ్ పబ్లిక్ స్కూల్ ప్రక్కన గ్రౌండ్ దగ్గర మెయిన్ రోడ్డు ఇందుకూరు గ్రామములో అని తెలిపారు. అందరికీ ప్రత్యేక ఆహ్వానం ఈ కార్యక్రమాని విజయం వంతంగా సేయలని చివరిగా తెలిపారు.

# నిడదవోలులో 5కే రన్ అండ్ వాక్.. పాల్గొన్న మంత్రి



**నిడదవోలు, విశ్వంవాయిస్ న్యూస్** : నిడదవోలు పట్టణ మున్సిపాలిటీ ఏర్పడి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 5కే రన్ అండ్ వాక్ నిర్వహించగా.. ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ పాల్గొన్నారు. జెండా ఊపి ప్రారంభించారు. స్టెప్పులు వేసి జోష్ నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిడదవోలులో నిర్వహిస్తున్న వజ్రోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు, స్వచ్ఛంధ సేవా సంస్థలు, వ్యాపార వర్గాలు, ప్రజలు వేడుకలకు సహకరించాలని కోరారు. నిడదవోలు పట్టణాభివృద్ధికి పలు చర్యలు తీసుకుంటున్నామని, సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. నిడదవోలు పట్టణంలోని ఐ లవ్ నిడదవోలు పార్క్ వద్ద ప్రారంభమైన 5కే రన్ అండ్ వాక్.. గణేష్ చౌక్ సెంటర్ మీదుగా ఎస్వీఆర్ కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వరకు కొనసాగింది. అనంతరం తిరిగి అదే రూట్ మీదుగా ఓవర్ బ్రిడ్జి చివరి వరకు చేరుకొని ఐ లవ్ నిడదవోలు పార్క్ వద్ద ముగిసింది. మున్సిపాలిటీ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కృష్ణవేణి, వజ్రోత్సవ వేడుకల టీషర్ట్ లు ధరించి విద్యార్థులు, ప్రజలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్లాన్ మార్చిన పవన్..

# పిఠాపురంలో ఏం చేస్తున్నారంటే?



జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ ఫ్యూచర్ పొలిటికల్ ప్లాన్ పై విస్తృత చర్చ జరుగుతోంది. ప్రస్తుతం కాకినాడ జిల్లా పిఠాపురం శాసనసభ్యుడిగా ఉన్న పవన్.. తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడంతోపాటు జనసేన పార్టీకి బలమైన పునాదులు వేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం గోదావరి జిల్లాలను తన రాజకీయ క్షేత్రానికి కేంద్రంగా మార్చుకునేలా అడుగులు వేస్తున్నారని చర్చ జరుగుతోంది. ఇటీవల పవన్ తీసుకున్న నిర్ణయాలను గమనిస్తే.. ఆ ఫ్యూచర్ ప్లాన్ మారిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ఎన్నికల్లో పిఠాపురం నుంచి గెలిచిన పవన్ ఇక్కడే శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకుంటానని ప్రకటించారు. అయితే గెలిచి ఏడాదిన్నర అవుతున్నా, పవన్ పిఠాపురం చుట్టపు చూపుగానే వస్తున్నారని చెబుతున్నారు. పిఠాపురంలో ఇప్పటికీ ఆయన సొంత ఇల్లు నిర్మాణం పూర్తికాలేదు. గెలిచిన వెంటనే పిఠాపురంలో పవన్ సుమారు 18 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఇందులో తన ఇల్లుతోపాటు పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు కొనసాగుతున్నాయి. దీంతో పవన్ పిఠాపురం అప్పుడప్పుడు వచ్చి వెళ్లిపోతున్నారు. ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ ఎక్కువగా రాజధాని అమరావతి నుంచి హైదరాబాద్ కు రాకపోకలు సాగిస్తున్నారు. వారంలో ఒక రోజు హైదరాబాద్ వెళుతున్న పవన్.. ఇకపై పిఠాపురం నియోజకవర్గానికి సమయం కేటాయించాలని చూస్తున్నారని అంటున్నారు. పిఠాపురంలో పవన్ కొన్న భూమికి అనుకునే మరో 3 ఎకరాల భూమిని సైతం పవన్ కొనుగోలు చేయనున్నారని చర్చ జరుగుతోంది. ఇకపై తన రాజకీయానికి పిఠాపురమే కేంద్రం చేసుకోవాలని భావిస్తున్న పవన్.. కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా ఇక్కడ పార్టీ కార్యాలయంతోపాటు తనను కలిసేందుకు వచ్చే కార్యకర్తలకు మౌలిక వసతులు కూడా ఉండేలా వసతి గదులు నిర్మించాలని భావిస్తున్నారని చెబుతున్నారు. రానున్న రోజుల్లో పిఠాపురం, మంగళగిరిలో ఎక్కువ సమయం గడపాలన్న ఆలోచనతో ఉన్న పవన్... పిఠాపురంలో ఉన్నప్పుడు నాయకులు, కార్యకర్తలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక గదులు, వారి వాహనాలకు పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారని అంటున్నారు. ఇలా పిఠాపురంలో అన్నిరకాలుగా కార్యాలయంతోపాటు కార్యకర్తల విడిది భవనాల నిర్మాణానికి పవన్ ప్రయత్నించడం వెనుక రాజకీయ వ్యూహం ఉందని అంటున్నారు. గోదావరి జిల్లాల్లో జనసేనకు బలమైన సామాజికవర్గం మద్దతు ఉంది. ఈ బలం చెక్కుచెదరకుండా ఉండాలంటే ఆ వర్గం వారికి దగ్గరగా ఉండాలే సూచనలు వస్తున్నాయి. ఈ విషయంపై పవన్ కూడా ఏకీభవిస్తున్నారని అంటున్నారు. ఏ రకంగా చూసిన గోదావరి జిల్లాల్లో జనసేన బలంగా ఉంటేనే కూటమి ప్రభుత్వం రెండు మూడు టర్ములు కొనసాగే పరిస్థితి ఉందని ఆయన భావిస్తున్నారు. ఇందుకోసం గోదావరి జిల్లాల్లో ఉన్న 32 నియోజకవర్గాల్లో పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని అంటున్నారు. దీంతో పిఠాపురాన్ని తన రాజకీయ క్షేత్రానికి కేంద్రబిందువు చేసేలా పవన్ అడుగులు వేస్తున్నారని అభిప్రాయపడుతున్నారు.

# ఏపీ మీద 61 తీవ్ర తుఫానుల పంజా..



ఏపీ అన్న రాష్ట్రం సముద్రం తీర ప్రాంతాన ఉంది. ఉమ్మడి మద్రాస్ నుంచి విడిపోయినపుడు పదకొండు జిల్లాలతో ఏర్పాటు అయింది. ఇక ఉమ్మడి ఏపీలో కూడా విలీనం అయినా లేక 2014 నుంచి విభజన ఏపీగా ఉన్నా ఉమ్మడి తొమ్మిది జిల్లాలు ఎపుడూ తీర ప్రాంతంలోనే ఉంటాయి. ఇది భౌగోళికంగా ఏపీకి ఒక విధంగా వరం అయితే మరో విధంగా శాపంగా చెప్పుకోవాల్సి ఉంది. అయితే ఏపీ ఎపుడూ తుఫానుల ప్రభావంతో నష్టపోతూ వస్తోంది. 1977లో నవంబర్ నెలలో దివిసీమ ఉప్పెన ఏపీలో ఒక చీకటి అధ్యాయం. అంతటి నష్టం ఏపీ ఇప్పటిదాకా ఎన్నడూ చూసి ఉండదు, అయితే ఆ తరువాత కూడా ప్రాణ నష్టం తగ్గినా ఆస్తి నష్టంలో అంతకు మించిన తుఫాన్లు తీవ్రై ఏపీ మీద పడగ విప్పాయి. అలా ఏపీకి తీర ప్రాంతం బ్లూ ఎకానమీకి ఎంతో దోహదపడుతోందో దానితో పాటుగా తీవ్ర నష్టాలు కూడా పొంచి ఉన్నాయని విశ్లేషణలు ఉన్నాయి.

**పంజా విసిరిన వైనం :**

ఇదిలా ఉంటే గత 55 సంవత్సరాలలో 61 తీవ్రమైన తఫానులు రాష్ట్రంపై ప్రభావం చూపించాయి అని వాతారణ పరిశోధకులు వెల్లడిస్తున్నారు. ఇక ఒక్క అక్టోబర్ మాసంలోనే ఏకంగా 16 తుఫానులు ఏపీ మీద ఎగిసిపడి ఇబ్బందులు సృష్టించాయని చెబుతున్నారు. ఆ సమయంలో వీచే గాలి వేగం వల్ల ఖరీఫ్ సీజన్ పంట అయిన వరికి ఎక్కువగా నష్టం వాటిల్లిందని చెబుతున్నారు. ఇలా ప్రతీ ఏటా అక్టోబర్ నవంబర్ నెలలలో వచ్చే తుఫాన్ల మూలంగా పంటలు దెబ్బ తినడం కూడా జరుగుతోంది అని అంటున్నారు.

గాలి వేగమే ప్రమాదం : సాధారణ తుఫానల్లో గాలి వేగం ఒకలా ఉంటే మోంథా లాంటి తీవ్ర తుఫాన్ల సమయంలో వేగం దానికి రెండు రెట్లు ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. అయితే గాలివేగం 25 కిలోమీటర్ల కన్నా తక్కువగా ఉంటే పంటపై ఎటువంటి నష్టం ఉండదని అదే సమయంలో గాలి వేగం 54 %-% 58 కిలోమీటర్ల మధ్య ఉంటే పంట పూర్తీఅ పడిపోయే అవకాశం ఉందని చెబుతున్నారు. అదే విధంగా గత నెల వచ్చిన మొంథా తుఫాను తరువాత వరి పంటపై ఆకు ఎండు తెగులు, మానుకాయ తెగులు ఆశించాయని, ఈ తెగుళ్ళ వల్ల వరి పంటపై కలిగే నష్టం, నివారణ చర్యల గురించి వ్యవసాయ అధికారులను సమాయత్తం చేయవలసిన అవసరం శాస్త్రవేత్తలపై వాతావరణ శాఖ పరిశోధకులు చెబుతున్నారు.

తక్కువ నష్టంతో : తుఫాన్లు చెప్పి రావు, అదే సమయంలో వచ్చిన తుఫాన్ల నుంచి రక్షించుకోవడం అన్నది అయితే ఉండదు, ప్రాణ నష్టం అయితే ఆధునాతన పద్ధతుల వల్ల తగ్గించుకోవడం ఇటీవల దశాబ్దాల కాలంలో జరుగుతోంది. కానీ పంట నష్టం కానీ ఇతర ఆస్తి నష్టం కానీ తప్పడం లేదు, అయితే వాతావరణ పరిశోధకులు అయితే తగినంత అప్రమత్తత గురించి రైతులకు అవగాహన కల్పిస్తే ఎంతో కొంత మేలు అని చెబుతున్నారు గాలి తీవ్రత తక్కువగా ఉన్న సమయాల్లో అది ఉపకరిస్తుంది అని అంటున్నారు.

# మూడు వేల మంది పాదయాత్రీకులకు జ్యోతుల అన్నదానం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్** : కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు పట్టణంలోని వివిధ దేవాలయాల భజన సమాజ బృందాల సభ్యులు, విశ్వహిందూ పరిరక్షణ సమితి సభ్యులు సుమారు మూడువేల మంది పాదయాత్రీకులకు జిల్లా జనసేనపార్టీ కార్యదర్శి, సాయిప్రియా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్, గంగా భవానీ దంపతులు బెండపూడిలో ఆదివారం మధ్యాహ్నం కార్తీక వన సమారాధన మహాన్నదానాన్ని నిర్వహించారు. పరమ పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గొల్లప్రోలు పట్టణంలోని హిందూ బంధువులు అన్ని సీతారామ కోవెలలు, దేవీ, దేవతల ఆలయాలు, భజన సమాజాలు, భక్త బృందాలు, విశ్వ హిందూ పరిరక్షణ సమితి సభ్యులు, శ్రీ విజయదుర్గ అమ్మ వారి కమిటీ సభ్యులు అందరూ కలసి స్థానిక శ్రీ విజయ దుర్గ అమ్మ వారిని దర్శించుకుని ఆదివారం ఉదయం 5.30 గంటలకు గొల్లప్రోలు పాత బస్టాండ్ నుండి అన్నవరానికి బయలు దేరారు. ముందు రోజు రాత్రి శ్రీసత్య దేవుని రథం గొల్లప్రోలు చేరుకోగా పూల మాలలతో అలంకరించి అక్కడ నుంచి రథాన్ని అన్నవరం ఊరేగింపుగా తీసుకు వస్తూండగా రథానికి ముందూ, వెనుకా ఈ మూడు వేల మంది భక్తులూ అనుసరించారు. సుమారు 20 కిలో మీటర్ల దూరం పొడవునా అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి పుణ్యక్షేత్రం దర్శనానికి పాదయాత్రగా విచ్చేసారు. అయితే అన్నవరం శ్రీసత్యదేవుని ముఖమండపం ప్రవేశ ద్వారం చేరుకున్న భక్త సమూహానికి పక్కనే ఉన్న కొబ్బరి తోటలో జ్యోతుల శ్రీనివాస్, గంగా భవానీ దంపతులు తమ సాయిప్రియా సేవా సమితి తరఫున మధ్యాహ్నం పూట మహాన్నదానాన్ని నిర్వహించారు. ధర్మాన్ని నువ్వు రక్షించు. అది నిన్ను రక్షిస్తుంది అనే ఆత్మ ప్రభోధాన్ని నమ్మిన ఈ దంపతులు ఈ మహాన్నదానం కోసం తమ సొంత సొమ్ములు సుమారు రూ. 5 లక్షలను వెచ్చించారు. ఇదే మాదిరిగా గత మూడేళ్ళుగా కూడా ఇదే కార్తీక మాసంలో ఇదే అన్నవరం ప్రాంతంలో ఇదే భక్తులకు ఇదే మాదిరిగా వన సమారాధనను దిగ్విజయంగా నిర్వహించిన శ్రీనివాస్, గంగా భవానీ దంపతులు భక్తుల మన్ననలను పొందారు. ఈ దఫాతో నాలుగేళ్లుగా ఓ సంప్రదాయంగా జ్యోతుల శ్రీనివాస్, గంగా భవానీ దంపతులు నిర్వహిస్తూ వస్తున్నారని, ఈ విధంగా వీరిరువురూ సంకల్పించుకుంటే ..., అన్నదాన సేవ చేసుకునే అవకాశాన్ని ఆ భగవంతుడు వీరికి కల్పించాడనీ భక్తులు తమ అభిప్రాయాలను ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. వన సమారాధన అంటే కార్తీక మాసంలో బంధు మిత్రులతో కలిసి ప్రకృతిలో, ముఖ్యంగా ఉసిరి చెట్టు నీడలో విందు చేసుకోవడమని, ఇది ప్రకృతితో మనకు ఉన్న మానవ బంధాలను గుర్తు చేసుకునే ఒక సంప్రదాయమనీ, దీనిని వనభోజనం అని కూడా అంటారనీ, తమ సాయిప్రియా సేవా సంస్థ నుంచి ఏటేటా ఈ వన సమారాధనలను నిర్వహిస్తూ మానవ సంబంధాలను మరింత బలోపేతం చేస్తూ ఐకమత్యం పెంచడమే ఈ మా వన సమారాధన సంప్రదాయం ముఖ్య ఆంతర్యమని జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి, సాయిప్రియా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్, గంగా భవానీ దంపతులు మీడియాకు తెలిపారు. భక్తులతో పాటు పలువురు ప్రముఖులు కూడా పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక అనుభూతి, ఐక్యత పెంపొందుతుందని,

# మానవ సంబంధాలు బలోపేతం అవుతాయి

## కాపు వన సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** సంఘం అభివృద్ధికి కలసికట్టుగా కృషి చేయాలి కార్తిక మాసంలో నిర్వహించే వన సమారాధనలతో ఆధ్యాత్మిక అనుభూతి, ఐక్యత పెంపొందుతుందని, మానవ సంబంధాలు బలోపేతం అవుతాయని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. కొత్తపేట బండారు బులిసత్యం- చంద్రావతి కాపు కళ్యాణ మండపంలో తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కాపు వన సమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన వన సమారాధనలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి పూజాకార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా, ఐక్యంగా పనిచేయాలని సూచించారు. సంఘం ఐక్యత కోసం, సంఘంలో పేదలకు సహకారం అందించడానికి ఇటువంటి కార్యక్రమాల అవసరం ఎంతగానో ఉందన్నారు. సంఘ సభ్యులందరూ కల్సి ఒకేతాటిపై నడిస్తే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడం సులభతరమవుతుందన్నారు. అందరూ ఐక్యతతో కలసిమెలసి, సహాయ సహకారాలు అందించుకుంటూ అభివృద్ధి చెందాలని తెలియజేశారు. తరువాత జరిగిన భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించి, అతిథులకు భోజనాలు వడ్డించారు.

ఆకట్టుకున్న అమ్మ రూపంలో

# సహస్ర జ్యోతులు అమ్మకు ఆలయాన్ని నిర్మించిన మ్యాజిక్ ఫ్యామిలీ





**కొత్తపేట/ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ర్యాలి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలికి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు ప్రముఖ మనస్తత్వవేత్త డాక్టర్ శ్యామ్ జాదూగర్ తన మ్యాజిక్ హౌస్‌లో అమ్మకు చిన్న ఆలయాన్ని నిర్మించి అమ్మపై ప్రేమను చాటుకున్నాడు. ఈ ఆలయాన్ని అన్నపూర్ణ డే కేర్ హోమ్ ద్వారా లబ్ధి పొందుతున్న తల్లుల చేతుల మీదుగా ప్రారంభించారు. వేకువ జామునే అమ్మ విగ్రహం వద్ద సహస్ర జ్యోతులతో అమ్మ అక్షర రూపంలో ప్రమిదలను పెట్టి కార్తీకమాసం సందర్భంగా మ్యాజిక్ ఫ్యామిలీ వెలిగించింది. అనంతరం తన తల్లి జీవితంపై ప్రత్యేకంగా రూపొందించిన ఐదు పాటలను విడుదల చేశారు. తన చిన్నప్పుడు కట్టుబట్టలతో ర్యాలి గ్రామానికి అమ్మతో వచ్చానని నేడు తన ఉన్నతి తో పాటు తన పిల్లల యొక్క ఉన్నతికి కూడా అమ్మ పెంచిన పెంపకమే కారణమని కోవిడ్ సమయంలో తన తల్లితో కలిసి వేలాదిమంది ఆకలి తీర్చడంతో పాటు ఎంతోమందిని కోవిడ్ బారినుండి రక్షించగలిగామని అదే స్ఫూర్తితో అన్నపూర్ణ డే కేర్ హోమ్ ద్వారా పేదల ఆకలి విద్యా వైద్య సేవలను చేస్తున్నట్టు శ్యామ్ తెలిపారు. అమ్మ యొక్క సేవ పూర్తిగా శాశ్వతంగా ఉండాలని ఉద్దేశంతో చిన్న ఆలయాన్ని నిర్మించి నిత్యం అమ్మ సమక్షంలో ఈ కార్యక్రమాలు చేయాలని ఉద్దేశంతో ఈ చిన్న దేవాలయం నిర్మించినట్టు శ్యామ్ తెలిపారు. కార్యక్రమంలో మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులు డాక్టర్ మోహిత్ సీత, అన్నపూర్ణ శ్యామ్, తేజశ్రీ శ్రీకాంత్, రుషిత్, జాన్విక, డాక్టర్ సూర్య చంద్రరావు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలు ప్రైవేటీకరణపై

# కట్టలు తెగిన ప్రజాగ్రహం

## ఏడిదలో కోటి సంతకాల సేకరణ...



**ఏడిద, విశ్వం వాయిస్ న్యూస్ :** వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ పట్ల అడుగడుగునా ప్రజలు తీవ్ర వ్యతిరేకత కనబర్చారని జడ్పీటీసి కురుపూడి భవాని రాంబాబు పేర్కొన్నారు. రాష్ట్ర శాసనమండలి సభ్యులు తోట త్రిమూర్తులు ఆదేశాలు మేరకు మండపేట మండలం ఏడిదలో వైసీపీ నాయకులు వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరించడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ప్రజలకు తెలియజేశారు. దీని వల్ల వైద్య విద్యకు సామాన్య ప్రజలు దూరమవుతారని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు టపా గోవిందరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పలివెల సుధాకర్, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి అర్జున్, ఎంపీటీసీ పట్నాల నాగబాబు, తాతపూడి ఉష రాజేష్, పితాని నారాయణరావు, శివ, కొండేటి కాళీకృష్ణ, బేతా రవితేజ, పరమటి తరున్, కోశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్ టీచర్ కావేరినీ

# ట్విట్టర్ వేదికగా ప్రశంసించిన నారా లోకేష్

## చిన్నారుల ఆలోచనకి తగ్గట్లు బోధనా...



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పెద్ద గొల్లపుంత లోని శారద మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు అమలదాసు కావేరినీ అభినందిస్తూ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తన ట్విట్టర్ ఖాతాలో అభినందించారు. ఎస్‌జిటి సింగల్ టీచర్‌గా పని చేస్తున్న కావేరికి అభినందనలు తెలుపుతూ మంత్రి లోకేష్ ట్వీట్ చేశారు. జీరో గా ఉన్న విద్యార్థుల సంఖ్యను 11 కు చేర్చిన కావేరిని అభినందించారు. రీల్స్ తయారుచేసి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడం ప్రశంసనీయమని కొనియాడారు. చిన్నారుల వయసు ఆలోచనకి తగ్గట్లు వినూత్నమైన బోధనా పద్ధతులతో పాఠాలు చెబుతున్న తీరు చాలా బాగుందని మెచ్చుకున్నారు. ఆటపాటలతో చదువు నేర్పిస్తూ నైతిక విలువలు సాంస్కృతిక సాంప్రదాయాలు దేశభక్తిని బోధించడం చాలా సంతోషమని పేర్కొన్నారు. రీల్స్ తయారుచేసి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడం ప్రశంసనీయమని కొనియాడారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా కిచెన్ గార్డెన్ అభివృద్ధి చేసిన ఆమె కృషి చాలామందికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. లోకేష్ ట్వీట్‌తో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. నెటిజన్ లు రీల్స్ లో ఉన్న ఆ పాఠశాల పేరును వెతుకులాట మొదలెట్టారు.

# అద్భుత కెరియర్‌కు.. ఐదు టెక్నిక్‌లు

విద్యార్థులూ, ఉద్యోగార్థులూ, ఇప్పటికే కొలువుల్లో ఉన్నవారూ.. అందరికీ సమయ నిర్వహణ అనేది అత్యంత కీలకం. మార్కెట్‌లో విలువను పెంచుకోవాలంటే కష్టపడి పనిచేస్తేనే సరిపోదు. తెలివిగా బాధ్యతలు నిర్వర్తించడం నేర్చుకోవాలి. మీ విద్య, ఉద్యోగ లక్ష్యాలను వేగంగా సాధించేందుకు, ఒత్తిడిని తగ్గించుకునేందుకు.. ప్రపంచ వ్యాప్తంగా నిపుణులు ఆచరిస్తోన్న ఐదు అధునాతన ఉత్పాదకత టెక్నిక్‌లు ఎంతో ఉపయోగపడతాయి.



### 1. పొమడారో టెక్నిక్

విద్యార్థులు, ఉద్యోగులు సాధారణంగా ఎక్కువ సేపు కూర్చుని చదవడానికి, పనిచేయడానికి ప్రయత్నిస్తారు. కానీ కొద్దిసేపటికే దృష్టి మళ్లుతుంది. పొమడారో టెక్నిక్ ఈ సమస్యకు పరిష్కారం చూపుతుంది. మీ పనిని 25 నిమిషాల ఏకాగ్రత గల సెషన్‌లుగా విభజించండి. ఆపై ఒక్కో సెషన్ తర్వాత 5 నిమిషాల విరామం తీసుకోండి. మీరు చేయాలనుకున్న పని మీద ఏకాగ్రత పెరుగుతుంది. విరామం తీసుకోవడం వల్ల విసుగు లేదా అలసట ఉండవు. మీ పని పూర్తవడానికి ఎన్ని 25 నిమిషాల సెషన్లు కావాలో అన్ని తీసుకోండి. ఒక్కో సెషన్ అయ్యాక కచ్చితంగా 5 నిమిషాల విరామం తప్పనిసరి. నాలుగు సెషన్ల తర్వాత ఎక్కువసేపు 15 నిమిషాలు లేదా అరగంట విరామం తీసుకోండి. ఈ 25 నిమిషాలను గమనించేందుకు ఒక స్టాప్‌వాచ్ లేదా అలారం వాడుకోవచ్చు. మనం నిర్ణయించిన టైమ్‌కి గంట మోగే పొమోడోరో పరికరాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

**కోడింగ్/ రిసెర్చ్:** ఒక క్లిష్టమైన సమస్యపై 25 నిమిషాలు ఏకాగ్రతతో పనిచేసి, 5 నిమిషాల విరామంతో మెదడుకు విశ్రాంతి ఇవ్వడం ద్వారా బర్న్ అవుట్ కాకుండా ఉంటారు.

**ఇంటర్వ్యూ తయారీ:** ఒక అంశాన్ని (ఉదా: డేటా స్ట్రక్చర్స్) 25 నిమిషాల స్లాట్‌లో పూర్తిచేసి చిన్న విరామం తీసుకోవాలి. దీనివల్ల ఎక్కువ సమాచారం మెదడులో నిక్షిప్తమవుతుంది. నాలుగు సెషన్ల తర్వాత తీసుకునే సుదీర్ఘ విరామం (15-30 నిమిషాలు) కొత్త శక్తిని ఇస్తుంది.

### 2. అల్ట్రాడియన్ రిథమ్స్

పొమడారో అనేది కృత్రిమ సమయపాలన. అల్ట్రాడియన్ రిథమ్స్ మన మెదడులోని సహజ శక్తి చక్రాలను అనుసరిస్తాయి. మెదడు సుమారు 90 నుంచి 120 నిమిషాలు చురుకుగా పనిచేసి, ఆ తర్వాత కొద్దిసేపు విశ్రాంతి కోరుకుంటుంది. విశ్రాంతి సమయంలో మనం ఏ పని చేయాలనుకున్నా ఏకాగ్రత లోపిస్తుంది.

### కెరియర్, విద్యలో ఉపయోగం

అత్యంత కష్టమైన, ముఖ్యమైన పనులను (పరీక్షలకు ప్రిపరేషన్, ముఖ్యమైన రిపోర్ట్ రాయడం) మీ గరిష్ఠ శక్తి సమయాల్లో (పీక్ ఎనర్జీ టైమ్) అంటే.. ఉదయం లేదా మధ్యాహ్నం 90 నిమిషాల ఏకాగ్రత ఉన్న బ్లాక్‌లలో కేటాయించండి. 90 నిమిషాల పని తర్వాత 20-30 నిమిషాల సుదీర్ఘ విరామం తీసుకోండి. ఈ విరామంలో భోజనం చేయడం, నడవడం లేదా ధ్యానం చేయడం మంచిది. ఈ పద్ధతిని అనుసరించడం వల్ల మీరు అనవసరంగా ఎక్కువ సేపు పనిచేయకుండా మీ అత్యంత చురుకైన సమయాన్ని (ప్రొడక్టివ్ అవర్స్) ఉపయోగించుకోవచ్చు.

### 3. ఫ్లో టైమ్ టెక్నిక్

పొమడారోలోని కఠినమైన టైమర్ నియమం కొంతమందికి నచ్చదు. అలాంటివారి కోసం ఫ్లోటైమ్ టెక్నిక్ సరైనది. పని ప్రారంభించే ముందు టైమర్‌ని ఆన్‌చేసి, మీరు ఎంతసేపు ఏకాగ్రతతో పనిచేయాలనుకుంటే అంతసేపు పనిచేయండి. ఫోకస్ కోల్పోయామని అనిపించినప్పుడు లేదా పని పూర్తయి నప్పుడు టైమర్‌ను ఆపండి. తర్వాత మీకు అవసరమైనంత విరామం తీసుకోండి. మీరు పనిచేసిన సమయాన్ని, తీసుకున్న విరామ సమయాన్ని ఒక నోట్‌బుక్‌లో రికార్డు చేయండి. ఉదా: రిపోర్ట్ రాయడానికి పట్టిన సమయం 47 నిమిషాలు, విరామం 8 నిమిషాలు. ఈ పద్ధతి ద్వారా మీరు ఏ సమయంలో అత్యంత ఎక్కువ ఏకాగ్రతతో ఉన్నారో తెలుస్తుంది. ఇది ఫ్లోస్టేట్ సాధించడానికి సహాయపడుతుంది. అంటే పనిలో పూర్తిగా లీనమైపోవడం.. అన్నీ మర్చిపోవడం. ఈ ఫ్లో స్టేట్ కెరియర్‌లో కొత్త ఆవిష్కరణలకు, నాణ్యమైన పనికి చాలా ముఖ్యం.

### 4. గెటింగ్ థింగ్స్ డన్ (జీటీడీ)

డేవిడ్ అలెన్ రూపొందించిన జీటీడీ అనేది మీ మనసులోని అన్ని పనులు, ఆలోచనలు, ప్రాజెక్టులు, చిరాకులు అన్నింటినీ ఒక వ్యవస్థీకృత పద్ధతిలోకి తీసుకురావడం. ఈ మధ్య నోషన్, గూగుల్ డాక్స్ మొదలైన సాఫ్ట్‌వేర్లలో ఈ పట్టిక ఉపయోగించుకోవడానికి అనువుగా అందుబాటులో ఉంది. ఈ పట్టికల ఖాళీ నమూనా మూసను ముద్రించి వాడుకోవచ్చు కూడా.

**పట్టుకోవడం:** చదువు, ఉద్యోగం, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అన్ని to doలను (అసైన్‌మెంట్‌లు, ఈమెయిల్‌లు, మీటింగ్‌ల ఆలోచనలు) ఒకచోట (నోట్‌బుక్ లేదా యాప్‌లో) రాయండి.

**స్పష్టం చేయడం:** ప్రతి అంశాన్నీ చూసి తదుపరి చర్య ఏమిటో నిర్ణయించుకోండి. ఉదాహరణకు రిపోర్ట్ అనేది తదుపరి చర్య కాదు. దాని తదుపరి చర్య రిపోర్ట్ అవుట్‌లైన్ డ్రాఫ్ట్ చేయడం.

**నిర్వహించడం:** ఈ తదుపరి చర్యలను అవి ఎప్పుడు చేయాలి (క్యాలెండర్), ఎక్కడ చేయాలి (కంటెస్ట్) ఎవరికి అప్పగించాలి (వెయిటింగ్ ఫర్) అనే వాటి ఆధారంగా జాబితాలుగా విభజించండి. ఈ వ్యవస్థను అనుసరించడం ద్వారా మీ మనసు ప్రశాంతంగా ఉండి, ఏ పనీ మర్చిపోకుండా, ఏ సమయంలో ఏమి చేయాలో స్పష్టంగా తెలుస్తుంది.

### 5. కాన్‌బాన్ మెథడ్

కాన్‌బాన్ అనేది మీ పని పురోగతిని దృశ్యరూపంలో చూపించే పద్ధతి. ఒక బోర్డు (%ుతీవశ్రీశ్రీశీ/ూాయిఖు% లాంటి డిజిటల్ టూల్) తీసుకుని, దాన్ని మూడు ప్రధాన కాలమ్‌లుగా విభజించండి.

1. To Do (చేయవలసినవి): ఇంకా మొదలుపెట్టని పనులన్నీ ఇక్కడ ఉంటాయి.

2. Doing (చేస్తున్నవి): ప్రస్తుతం మీరు ఏకాగ్రతతో చేస్తున్న పనులు. (గమనిక: ఒకసారి ఒకటి లేదా రెండు పనులకు మించి ఈ కాలమ్‌లో ఉండకూడదు).

3. Done (పూర్తిచేసినవి): విజయవంతంగా పూర్తిచేసిన పనులు. కొత్త ప్రాజెక్టులను ప్రారంభించినప్పుడు వాటిని To Do కాలమ్‌లో ఉంచి, పని మొదలుపెట్టినప్పుడు Doing లోకి, పూర్తయిన తర్వాత Done లోకి మారుస్తారు. మీ కెరియర్ లేదా విద్యలో ఒక పెద్ద ప్రాజెక్టు (ఉదా: చివరి సంవత్సరం ప్రాజెక్టు, ఆఫీస్ ప్రజెంటేషన్) తీసుకుంటే, కాన్‌బాన్ పద్ధతిని ఉపయోగించడం వల్ల పని ఏ దశలో ఉందో స్పష్టంగా తెలుస్తుంది. అలాగే పనిలో అడ్డంకులు ఎక్కడ ఉన్నాయో గుర్తించవచ్చు. ఈ ఐదు శక్తిమంతమైన టెక్నిక్‌లు కేవలం సమయాన్ని పాటించడానికి మాత్రమే కాదు.. నాణ్యమైన పనిని తక్కువ ఒత్తిడితో అందించడానికి సహాయపడతాయి. పొమడారో లేదా ఫ్లోటైమ్ ద్వారా మీ ఏకాగ్రతను పెంచుకోండి. జీటీడీ, కాన్‌బాన్ ద్వారా మీ ప్రాజెక్టులను నిర్వహించండి. అల్ట్రాడియన్ రిథమ్స్‌తో మీ సహజ శక్తిని ఉపయోగించుకోండి. ఈ సూత్రాలను అమలు చేసినవారు మిగిలిన వారి కంటే ముందంజలో ఉండి.. విద్య, కెరియర్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు. మీ భవిష్యత్తు విజయం అనేది.. మీరు తీసుకునే ఉత్పాదకత నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.



రహ్మానుద్దీన్

దేశ స్వాతంత్రం ఉద్యమంలో మీడియా పోషించిన

# పాత్ర మరువ లేనిది - జాతీయ పత్రికా దినోత్సవం

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వాతంత్ర పోరాటంలో భారతీయులను చైతన్యవంతులు చేసి, స్వాతంత్ర ఉద్యమంలో వారి 77పాత్రను ప్రముఖం చేసి, దేశ స్వాతంత్రం ఉద్యమంలో మీడియా పోషించిన పాత్ర మరువ లేనిది ప్రస్తుతం మీడియా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటుంది. ప్రెస్ తరచుగా వాయిస్ లేని వారి వాయిస్‌గా మారింది శక్తివంతమైన పాలకులు మరియు పాలించబడుతున్న వారి మధ్య అనుసంధానంగా పనిచేయాల్సిన వారు, మీడియా యాజమాన్యాలకు అనుగుణంగా పనిచేయాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. జాతీయ పత్రికా దినోత్సవంలిభారతీయ మీడియా ఎదుర్కొంటున్న సవాళ్లు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నవంబర్ 16న జాతీయ పత్రికా దినోత్సవాన్ని జరుపుకుంటారు. దేశంలో పత్రికా స్వేచ్ఛను కలిగి ఉండటం యొక్క ప్రాముఖ్యతను జాతీయ పత్రికా దినోత్సవం తెలియ జేస్తుంది.పత్రికా వ్యవస్థ సమాజంలోని దుష్ప్రవర్తనను కూడా బయటకు తెస్తుంది .. సమస్యలకు పరిష్కారాలను కనుగొనడంలో ప్రభుత్వానికి సహాయపడుతుంది. అందువల్ల, సాధారణ ప్రజానీకం ప్రత్యక్షంగా పాల్గొనగలిగే బలమైన ప్రజాస్వామిక వ్యవస్థ..నాల్గవ స్తంభంగా పిలువబడుతుంది. ఇటీవలి కాలంలో, భారతదేశంలోని మీడియా పరిశ్రమ దాని స్వంత పనితీరును దెబ్బతీసే అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. మీడియా సంస్థలు ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సవాళ్ళు, మీడియా సంస్థలు లేదా జర్నలిస్టులు ఏకపక్ష అభిప్రాయాలను ప్రచారం చేయడం, కథనాన్ని స్వతంత్రంగా వ్యక్తీకరించలేకపోవడం మీడియా ట్రయల్స్ పేరిట మీడియా సంస్థలు కోర్టు తీర్పుకు ముందు చర్చలు మరియు చర్చల ఆధారంగా ఒక వ్యక్తిని దోషిగా లేదా నిర్దోషిగా ప్రకటించేస్తున్నాయి. మీడియా ట్రయిల్ వీక్షకుల మనస్సులలో నమ్మకాలను ఏర్పరుస్తుంది, తద్వారా కేసు యొక్క మెరిటోక్రసీని ప్రభావితం చేయాలి. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాదకద్రవ్యాల కేసు మరియు జెస్సికా లాల్ హత్య కేసులలో మీడియా బాటకు సరైన ఉదాహరణ కనిపిస్తుంది. రిపోర్టేజీలో వైవిధ్యం లేకపోవడం భారతదేశంలో వేర్వేరు వార్తా ఛానెల్‌లు ఉన్నప్పటికీ, రోజువారీ వార్తాపత్రికలు ఉన్నాయి ఎక్కువ శాతం ఉత్తరాది ప్రాంతానికి జాతీయ పత్రికలు అనబడేవి ప్రాధాన్యతనిస్తున్నాయి ఈశాన్య, దక్షిణ భారతదేశం మరియు టైర్-3 నగరాలు వంటి అనేక మారుమూల ప్రాంతాలు జాతీయ మీడియాలో తక్కువ కవరేజీని పొందుతున్నాయి

### మీడియా యాజమాన్యం

భారతీయ మీడియా హౌస్‌లు దాదాపు రాజకీయంగా అనుసంధానించబడిన వ్యక్తులు లేదా వ్యాపారవేత్తల యాజమాన్యంలోకి వెళ్లి పోయాయి. ఒక రాజకీయ పార్టీ వైపు మొగ్గు చూపే పరిస్థితి నెలకొన్నాయి.

### జర్నలిస్టులపై దాడులు

మన దేశంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యల్లో బెదిరింపు కాల్స్ ఒకటి. ముఖ్యంగా న్యూస్ రిపోర్టర్ గౌరీ లంకేష్ మరణానంతరం, జర్నలిస్టులకు ప్రాణహాని వస్తుందనే భయం లేకుండా ఏ విషయంలోనైనా న్యాయమైన రిపోర్టింగ్ అందించడం చాలా కష్టంగా మారుతోంది. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్థంభంగా భావించే మీడియా దేశ ఎదుగుదల మరియు పాలనలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం మీడియా పరిశ్రమ ఎదుర్కొంటున్న అనేక సమస్యలు ఉన్నప్పటికీ, ప్రజలకు నిజమైన మరియు నమ్మదగిన వాస్తవాలను వ్యాప్తి చేయడం ద్వారా ప్రశంసనీయమైన పనిని చేస్తున్న కొన్ని మీడియా సంస్థలు ఉన్నాయి. ఈ జాతీయ పత్రికా దినోత్సవం నాడు, భయం మరియు పక్షపాతం లేకుండా వార్తలను అందిస్తున్న పత్రికలు, పాత్రికేయులను అభినందిద్దాం అని సీనియర్ జర్నలిస్ట్ మరియు రాజకీయ నాయకులు తెలియజేశారు.

కాపు వెల్ఫేర్ అసోసియేషన్ అన్న సమారాధనలో

# పాల్గొన్న బండారు శ్రీనివాస్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్‌లో కాపు వెల్ఫేర్ అసోసియేషన్ అన్న సమారాధనలో పాల్గొన్న అమలాపురం జనసేన పార్టీ సమన్వయకర్త కొత్తపేట నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, వీరి వెంట పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పలువురిని పరామర్శించిన వైసిపి మండల అధ్యక్షుడు గూటం



**కపిలేశ్వరపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** కపిలేశ్వరపురం మండలం పల్లపులంక గ్రామానికి చెందిన మోరంపూడి వరప్రసాద్ ఇటువల రోడ్డు ప్రమాదంలో మరణించారు అయన కుటుంబ సభ్యులను పరామర్శించిన మండల పార్టీ అధ్యక్షులు గూటం సత్యనారాయణ అనంతరం అదే గ్రామానికి చెందిన బూరిగు నాగేంద్ర రోడ్డు ప్రమాదానికి గురై అస్పత్రి నుంచి సురక్షితంగా ఇంటికి వచ్చిన తన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. తధానంతరం అద్దంకివారిలంక గ్రామానికి చెందిన అయితాబత్తుల ఆనందరావు సతీమణి నూకరత్నం అనారోగ్యంతో మృతి చెందారు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శాఖ శ్రీనివాస్, కొండేటి వెంకన్న, పార్టీ జిల్లా విద్యార్థి విభాగం జనరల్ సెక్రటరి పాలింగి శ్రీను, సిద్ధాంతుల దొరబాబు, నాతి నరసింహమూర్తి, మానేపల్లి పరదేశి, గూటం శ్రీను, నాతి పట్టాభి, వీరన్న, నాతి హరికృష్ణ, గూటం నాగేష్, సఖిలే శ్యామ్, వందే చంద్రయ్య, మల్లిపూడి లచ్చన్న, వందే సందీప్, ప్రగడ అర్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మాహుతి బాంబర్ కోసం ఏడాదిగా అన్వేషణ



లఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కేసులో మరో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ఈ టెర్రర్ మాడ్యూల్ గత ఏడాది నుంచి ఓ సూసైడ్ బాంబర్ కోసం అన్వేషిస్తోందట. ఢిల్లీ పేలుడు కేసులో కీలక నిందితుడు, ఆ సమయంలో కారు నడిపిన డా.ఉమర్ నబీ దీని కోసం ముమ్మర ప్రయత్నాలు చేసినట్లు ఓ అధికారి వెల్లడించారు. ఈ కేసులో అరెస్టయిన నిందితుల విచారణలో.. ఉమర్ ఓ కరడుగట్టిన ఉగ్రవాది అని, తమ కార్యకలాపాల కోసం ఓ ఆత్మాహుతి బాంబర్ అవసరమని అతడు పట్టుబట్టినట్లు తెలిసింది. ఉగ్ర నెట్‌వర్క్ కేసులో డా.ఆదిల్, డా.ముజమ్మిల్ గనాయీ తదితర నిందితులు ఇప్పటికే అరెస్టయ్యారు. వీరు ఇచ్చిన సమాచారం ఆధారంగా శ్రీనగర్ పోలీసులు.. దక్షిణ కశ్మీర్‌లోని ఖాజీగుండ్‌లో పొలిటికల్ సైన్స్ చదివిన జాసిర్ ఎలియాస్ 'డానిష్'ను అదుపులోకి తీసుకున్నారు. తాను గత ఏడాది అక్టోబర్‌లో కుల్గాంలో ఉగ్ర నెట్‌వర్క్ సభ్యులను కలిశానని, అక్కడి నుంచి తనను అల్ ఫలా విశ్వవిద్యాలయంలోని అద్దె వసతి గృహానికి తీసుకెళ్లారని జాసిర్ తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. "నన్ను 'జైషే మహమ్మద్' ఉగ్రసంస్థకు సహాయకుడిగా (ఓవర్ గ్రౌండ్ వర్కర్)గా ఉంచాలని టెర్రర్ మాడ్యూల్‌లోని ఇతర సభ్యులు కోరుకున్నారు. కానీ, ఉమర్ మాత్రం నన్ను ఆత్మాహుతి బాంబర్‌గా మారేలా ఒప్పించేందుకు చాలా నెలలు ప్రయత్నించాడు" అని జాసిర్ తెలిపాడు. అయితే.. ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోవడం, ఇతర కారణాలతో అతడు వెనక్కి తగ్గడంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆ ప్రణాళిక కార్యరూపం దాల్చలేదు. నిందితుల విచారణ ప్రకారం.. 2021లో డా.ముజమ్మిల్ గనాయీతో కలిసి తుర్కియే వెళ్లొచ్చిన తర్వాత ఉమర్‌లో మార్పు మొదలైంది. ఆ దేశంలో వారు జైషే మహమ్మద్ ప్రతినిధులను కలిసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పర్యటన తర్వాత ఉమర్, గనాయీ కలిసి బహిరంగ మార్కెట్ నుంచి పెద్దఎత్తున రసాయనాలను సేకరించడం ప్రారంభించారు. వీటిలో 360 కిలోల అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్, సల్ఫర్ ఉన్నాయి. వీటిలో ఎక్కువ భాగం అల్ ఫలా విశ్వవిద్యాలయ ప్రాంగణం సమీపంలో నిల్వ చేశారు. డిసెంబర్ 6న (బాబ్రీ మసీదు కూల్చివేత రోజు) భారీ పేలుళ్లకు ఉమర్ నబీ ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. అంతలోనే ఫరీదాబాద్ ఉగ్ర నెట్‌వర్క్ కుట్ర బయటపడింది. ఇది కాస్త ఉమర్‌లో భయాందోళనకు దారితీయడం.. చివరకు ఎర్రకోట సమీపంలో ముందుగానే పేలుడు చోటుచేసుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నెల 10న చోటుచేసుకున్న ఈ పేలుడు ఘటనలో 13 మంది మరణించారు.

# ప్రపంచ బ్యాంకు నిధులు ఎక్కడ?




**పాట్నా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం రూ.14,000 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులను సీఎం నితీశ్ కుమార్ ప్రభుత్వం వినియోగించిందని ప్రశాంత్ కిషోర్‌కు చెందిన జన్ సురాజ్ పార్టీ ఆరోపించింది. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన కింద 1.25 కోట్ల మహిళలకు రూ.10,000 చొప్పున నగదు బదిలీ చేయడానికి ఈ నిధులు దారి మళ్లించినట్లు విమర్శించింది. తద్వారా ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికలను ప్రభావితం చేసినట్లు ఆరోపించింది. కాగా, జన్ సూరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ సింగ్ శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ప్రపంచ బ్యాంకు కేటాయించిన నిధుల్లో రూ.14,000 కోట్లను బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రభుత్వం వాడేసిందని ఆరోపించారు. 'ఈ ఎన్నికల ఫలితం సమర్థవంతంగా కొనుగోలు ద్వారా లభించింది. జూన్ 21 నుంచి పోలింగ్ రోజు వరకు గెలుపు కోసం సుమారు రూ. 40,000 కోట్లు ఖర్చు చేశారు. ప్రజాధనంతో ప్రజల ఓట్లను కొనుగోలు చేశారు. ప్రపంచ బ్యాంకు నుంచి వచ్చిన నిధులను మహిళలకు నగదు బదిలీల కోసం ఉపయోగించినట్లు నాకు తెలిసింది' అని ఆయన అన్నారు. అయితే ఇంత పెద్ద మొత్తంలో డబ్బును తిరిగి పొందే సామర్థ్యం బీహార్ ఆర్థిక వ్యవస్థకు లేదని ఉదయ్ సింగ్ ఆరోపించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం కోసం ఖర్చు చేయడానికి ఇప్పుడు చాలా తక్కువ నిధులు మిగిలి ఉన్నాయని విమర్శించారు. మరోవైపు జన్ సురాజ్ పార్టీ ప్రతినిధి పవన్ వర్మ కూడా ఈ ఆరోపణను పునరుద్ఘాటించారు. రాష్ట్ర ఖజానా ఇప్పుడు ఖాళీ అయ్యిందని తెలిపారు. 'మా దగ్గర సమాచారం ఉంది. అది తప్పు కావచ్చు. అంతేకాకుండా రాష్ట్రంలోని మహిళలకు ఇచ్చిన రూ.10,000 మొత్తాన్ని వేరే ప్రాజెక్టు కోసం ప్రపంచ బ్యాంకు నుంచి వచ్చిన రూ. 21,000 కోట్ల నుంచి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి గంట ముందు రూ.14,000 కోట్లు అందులో నుంచి తీశారు. రాష్ట్రంలోని 1.25 కోట్ల మహిళలకు పంపిణీ చేశారు' అని ఆరోపించారు. కాగా, ప్రజా ధనాన్ని స్పష్టంగా దుర్వినియోగం చేయడం, ఎన్నికల ప్రక్రియను దెబ్బతీసే అనైతిక ప్రయత్నం ఈ చర్య అని జన్ సురాజ్ పార్టీ ఆరోపించింది. దీనిపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది.

# తెరుచుకున్న శబరిమల.. భక్తులకు సూచనలివే!



**పథనంతిట్ట:** శబరిమలలో కొలువైన హరిహరపుత్రుడు అయ్యప్ప స్వామి సన్నిధానం ఈరోజు (నవంబరు 16) సాయంత్రం 5 గంటలకు తెరుచుకుంది. మేల్‌శాంతిగా ఎంపికైన ప్రసాద్ నంబూద్రి శనివారం ఉదయం పంపా బేస్ వద్ద ఇరుముడి కట్టుకుని, ఆదివారం సాయంత్రానికి సన్నిధానం చేరుకున్నారు. పద్దెనిమిది మెట్లను అధిరోహించిన తర్వాత ఆయన శబరిమల సన్నిధానం ద్వారాలకు హారతి ఇచ్చి, ఆలయం తలుపులను తెరిచారు. ఆ వెంటనే.. 'స్వామియే.. శరణం అయ్యప్పా' అనే భక్తుల శరణుఘోషలతో ఆలయ ప్రాంగణం మార్మోగిపోయింది.

మండల పూజ సీజన్‌లో శబరిమలకు వచ్చే భక్తుల కోసం కేరళ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు మౌలిక సదుపాయాలను కల్పించింది. అదేవిధంగా కేరళ వైద్యఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. వైద్య కళాశాల ప్రొఫెసర్లు మొదలు.. పీజీ విద్యార్థులను రంగంలోకి దింపి.. శబరిమల మార్గంలో ఎక్కడికక్కడ వైద్య శిబిరాలు, తాత్కాలిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. పంపాబేస్‌లో 24 గంటలూ పనిచేసేలా వైద్య కేంద్రం పనిచేస్తుందని అధికారులు తెలిపారు. వైద్య శిబిరాలు ఎక్కడెక్కడున్నాయి? భక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి? అనే అంశాలపై దీర్ఘకాలిక వ్యాధులు, కొమార్బరిటీస్‌తో బాధపడే భక్తులు అత్యవసర స్థితిలో ఎవరిని సంప్రదించాలి? అనే అంశాలపై మళయాలంతోపాటు.. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో పైన పేర్కొన్న భాషల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

### ట్రెకింగ్ మార్గంలో..

పంపాబేస్ నుంచి శబరిమల సన్నిధానం వరకు పలు చోట్ల అత్యవసర వైద్య కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా సముద్రమట్టానికి ఎత్తులో వెళ్తున్నప్పుడు శ్వాస ఇబ్బందులు ఎదురయ్యే భక్తుల కోసం ఆక్సిజన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మార్గంలో కొన్ని వైద్య కళాశాలలు బేస్ ఆస్పత్రులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పథనంతిట్ట జనరల్ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ కార్డియాలజీ ట్రీట్ మెంట్, క్యాథ్ ల్యాబ్ ట్రీట్ మెంట్ అందుబాటులో ఉన్నట్లు వివరించారు. పంపాబేస్ వద్ద అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. పంపాకు సమీపంలో ఉన్న అన్ని ఆస్పత్రులలో డీఫిబ్రిలేటర్లు, వెంటిలేటర్లు, కార్డియాక్ మానిటర్లు ఉంటాయని తెలిపారు. నీలక్కల్ బేస్ వద్ద పూర్తిస్థాయి ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. శబరిమల చరిత్రలోనే తొలిసారి పంపాబేస్, సన్నిధానం వద్ద ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించారు. అటు అయ్యప్పస్వామి వంశస్తుల రాజ్యంగా పేర్కొనే పందలం వద్ద కూడా తాత్కాలిక డిస్పెన్సరీలు ఏర్పాటయ్యాయి. శబరిమలకు వచ్చే మార్గాల్లో అడూర్, వడసేరిక్కర, పథనంతిట్టల్లోనూ 24 గంటలు పనిచేసే ఆస్పత్రులు అందుబాటులో ఉన్నాయి.

### భక్తులకు ప్రభుత్వ సూచనలు

ప్రస్తుతం వివిధ వ్యాధులకు చికిత్స పొందుతున్న వారు తమ వైద్య రికార్డులను వెంట తెచ్చుకోవాలి

శబరి యాత్రకు కొద్దిరోజుల ముందు నుంచి నడక, తేలికపాటి వ్యాయామాలు చేయాలి

పంపాబేస్ నుంచి కొండను ఎక్కేప్పుడు వేగం పనికిరాదు. నిదానంగా కొండను అధిరోహించాలి. అవసరమైతే.. తరచూ విశ్రాంతి తీసుకోవాలి

కొండను అధిరోహించేప్పుడు అలసట, ఛాతీ నొప్పి రావడం, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా అనిపిస్తే.. తక్షణం వైద్య సాయం కోసం 04735 203232 నంబరుకు కాల్ చేయాలి

కాచి, చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. భోజనానికి ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి

వివిధ వ్యాధులతో బాధపడేవారు బహిరంగ ప్రదేశాల్లో లభించే చిరుతిళ్లను తినకూడదు

నీలిమల, శరణ్‌గుత్తి ప్రాంతాల్లో పాములను పట్టుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అయినప్పటికీ విషకీటకాలు కరిస్తే.. వెంటనే 04735 203232 నంబరుకు కాల్ చేయాలి. తాత్కాలిక వైద్య శిబిరాల్లో పాముకాటుకు విరుగుడు ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి

## నవంబర్ 19న బిహార్‌లో కొత్త ప్రభుత్వం



బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకుంటుంది. నవంబర్ 19న లేదా నవంబర్ 20 కొత్త రాష్ట్రంలో ప్రభుత్వం కొలువుదీరనుంది. పట్నాలోని గాంధీ మైదానంలో ఇందుకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయి. అయితే.. ప్రధాని నరేంద్ర మోదీ షెడ్యూల్‌ను బట్టి ఈ రెండు తేదీల్లోనే ప్రమాణస్వీకారం కార్యక్రమం ఉండనుందని సమాచారం. బిహార్ అసెంబ్లీకి జరిగిన 18వ ఎన్నికల్లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ 202 సీట్లు గెలుపొంది అధికారాన్ని నిలబెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల జాబితాను గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌కు ఎన్నికల సంఘం సమర్పించనుంది. అనంతరం కొత్త ప్రభుత్వ ఏర్పాటు ప్రకటన రానుంది. ఎన్నికల్లో విజయదుంధుబి మోగించిన నితీశ్ కుమార్ నవంబర్ 17న సోమవారం క్యాబినెట్‌తో సమావేశం కానున్నారు. ఆ తర్వాత రాజ్‌భవన్‌కు వెళ్లి తన రాజీనామా లేఖను గవర్నర్‌కు ఇవ్వనున్నారు. గెలుపొందిన ఎన్డీఏ అభ్యర్థులు సమావేశమై తమ కూటమి నాయకుడిని ఎన్నుకుంటారు. అందరూ అమోదించిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. గత పదమూడు పర్యాయాలు బిహార్‌ను ఏలుతున్న నితీశ్ మరోసారి సీఎం కుర్చీలో కూర్చోవడం లాంఛనమే కానుంది.

**డబుల్ సెంచరీ**

యావత్ దేశం ఆసక్తికనబరిచిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ప్రభంజనం సృష్టించింది. అధికారంలోకి రావాలనుకున్న మహాఘట్‌బంధన్ కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రెండు విడతల్లో 243 స్థానాలకు జరిగిన ఎలక్షన్‌లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డేఏ 202 స్థానాల్లో గెలుపొందింది.. మరో 12 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. మహాఘట్‌బంధన్ బలపరిచిన సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ విజయం సాధించారు. కానీ, ఆయనకు అధికారం మరోసారి కలగానే మిగిలింది. ఎన్నికల వ్యూహకర్త నుంచి రాజకీయనేతగా రాణించాలనుకున్న ప్రశాంత్ కిశోర్‌ను ఓటర్లు తిరస్కరించారు. ఇక చిరాగ్ పాశ్వాన్ లోక్ జనశక్తి పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

## ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమిలేయర్ ఉండాలి




**అమరావతి** : భారత రాజ్యాంగం ఏర్పడి 75 ఏళ్లు విజయవంతంగా పూర్తయ్యాయని, ఈ కాలంలో అనేక సవరణలు, రిజర్వేషన్లను రాజ్యాంగం అవకాశం కల్పించిందిందని భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ అన్నారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లోనూ చట్టం చేశారని, ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమిలేయర్ ఉండాలనేది తన అభిప్రాయమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సీకే కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన పాల్గొని ' ఇండియా అండ్ ది లివింగ్ ఇండియన్ ఇన్స్టిట్యూషన్ ఎట్ 75 ఇయర్స్' అనే అంశంపై ప్రసంగించారు జస్టిస్ గవాయ్ మాట్లాడారు. రాజ్యాంగం గొప్పదనం గురించి మాట్లాడే అవకాశం తనకు రావడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. మహిళలపై అసమానత రూపుమాపేందుకు జ్యోతి రావ్ ఫులే ఎంతో కృషి చేశారని, పని ప్రదేశాల్లో మహిళలపై వివక్ష ఉండకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. మహిళలకు సమానత్వం ఉండాలనేది సుప్రీంకోర్టు విధానం. న్యాయ రంగంలో మహిళలు రాణిస్తుండడం అభినందనీయమని అన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ అద్భుతమైన రాజ్యాంగాన్ని మనకిచ్చారని అన్నారు. ఓ ఛాయ్ వాలా మోదీ దేశానికి ప్రధాని కాగలిగారని తెలిపారు. రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో నిపుణులను అందించే సత్తా భారత్‌కు వస్తుందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగిందని వెల్లడించారు. వ్యవస్థలోని లోపాను సరిదిద్ది న్యాయవ్యవస్థ కీలక బాధ్యత వహిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు .

## కూలిన రాతి గని.. శిథిలాల కింద 15 మంది కార్మికులు

**సోనభద్ర:** ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. సోన్ భద్రలో గని కూలిపోయింది. శిథిలాల కింద 15 మంది కార్మికులు చిక్కుకున్నారు. ఒక మృతదేహాన్ని రెస్క్యూ సిబ్బంది వెలికీ తీశారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సోనభద్రలోని ఒబ్రా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిల్లీ మార్కుండి మైనింగ్ ప్రాంతంలో శనివారం రాత్రి ఆ ఘటన జరిగింది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ పాటు రెండు ప్రైవేట్ కంపెనీల రక్షణ బృందాలు, ఒబ్రా థర్మల్ పవర్ ప్రాజెక్ట్ బృందం రక్షణ చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ బద్రినాథ్ సింగ్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆయన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అదనపు పరికరాలు, యంత్రాలతో సహాయక చర్యలు చేపడుతున్నామని ఆయన చెప్పారు. ప్రమాద సమయంలో తొమ్మిది కంప్రెసర్లు పనిచేస్తుండగా, ప్రతి కంప్రెసర్ వద్ద ఒక్కొక్కరు విధులు నిర్వహిస్తున్నట్టు సమాచారం. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

## క్షమాపణలు చెప్పకపోతే చట్టపరమైన చర్యలు తప్పవ్..

టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ చేసిన ఆరోపణలను పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ తోసిపుచ్చారు. రాజ్ భవన్‌లో ఆయుధాలు ఇస్తున్నారని చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. ఆరోపణలు నిరాధారమని.. క్షమాపణలు చెప్పకపోతే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. సొంత రాష్ట్ర పోలీసులను నమ్మడం లేదా? దీని వెనుక అంతర్గత రాజకీయాలు ఉన్నాయా? అంటూ ఆయన ప్రశ్నించారు. రాజ్‌భవన్‌లో ఆయుధాలు కోసం వెతకడం అంటే అంధుడు చీకటి గదిలో నల్లపిల్లి కోసం వెతుకుతున్నట్లుగా ఉంటుందంటూ ఎద్దేవా చేశారు. రాజ్‌భవన్ ప్రజల కోసం తెరిచే ఉందని.. ఉదయం 5గంటల నుంచి సామాన్య ప్రజలు, పౌర సమాజం సభ్యులు, మీడియా రాజ్‌భవన్‌కు వచ్చి ఆయుధాలు ఉన్నాయో లేవో చూసుకోవచ్చన్నారు.



# చలికి స్కిన్ డ్రైగా మారి అందంగా కనిపించట్లేదా

చలికాలం వచ్చిందంటే బ్యూటీ ప్రాబ్లమ్స్ క్యూ కడతాయి. అందులో డ్రై స్కిన్ ప్రాబ్లమ్. దీనిని తగ్గించుకునేందుకు ఎన్నో రకాల మాయిశ్చరైజర్స్ వాడుతుంటారు. అయితే, వాటితో పాటు మనం కొన్ని జాగ్రత్తలు ముఖ్యంగా కొన్ని ఫుడ్ చేంజెస్ కూడా చేయాలి. మన వింటర్ డైట్‌లో కొన్నింటిని యాడ్ చేస్తే చర్మ ఆరోగ్యాన్ని మెరుగ్గా చేస్తుంది. అలాంటి ఓ గ్లో షాట్ గురించి తెలుసుకుందాం. పైగా ఈ షాట్‌ని మనం ఉసిరితో తయారుచేస్తాం. స్కిన్‌కేర్‌పై మాత్రమే దృష్టి పెడతాం. అలా కాకుండా మనం తీసుకునే ఆహారం కూడా ముఖ్యమే. దీని వల్ల చర్మానికి లోపలి నుంచి పోషణ అంది స్కిన్ ప్రాబ్లమ్స్ దూరమవుతాయి. అలాంటి ఓ గ్లో షాట్ గురించి షేర్ చేసుకుంటున్నా ఫేమస్ న్యూట్రిషనిస్ట్ శ్వేతాషా. దీనిని మనం రెగ్యులర్‌గా తీసుకుంటే మీ స్కిన్ ఆటోమేటిగ్గా మెరుస్తుందని ఆమె చెబుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన వీడియోలో ఈ షాట్ గురించి క్లియర్‌గా తెలిపారు. మరి ఆ షాట్ ఏంటి. దీనికి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానమేంటో తెలుసుకోండి.

కావాల్సిన పదార్థాలు: 30 మి.లీ ఉసిరి రసం/ అర టీస్పూన్ తేనె/ కొద్దిగా కుంకుమపువ్వు/ అర టీస్పూన్ నెయ్యి (ఆప్షనల్)/ ఏం చేయాలి?

ఇప్పుడు చెప్పిన పదార్థాలన్నింటినీ బ్లెండర్‌లో వేసి మిక్సీ పట్టాలి. దీనిని అలానే తాగాలి. రెగ్యులర్‌గా తాగాలి. నిజానికీ దీనిని బ్రైడల్ షాట్ అని చెబుతారు. పెళ్ళికి కొన్ని నెలల ముందుగా ఈ షాట్ తీసుకుంటే ఎలాంటి ఫేషియల్స్, ట్రీట్‌మెంట్స్ లేకుండానే స్కిన్‌ని ఆటోమేటిగ్గా అందంగా మెరిపించొచ్చు. ఇందులో ఉసిరి రసం, తేనె, కుంకుమపువ్వు, నెయ్యి కలిపి తీసుకుంటాం. ఇవన్నీ కూడా మన స్కిన్ హెల్త్‌కి మేలు చేసేవే.

ఉసిరి: ఉసిరిలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఫ్రీ రాడికల్స్‌ని తగ్గిస్తాయి. దీని వల్ల సన్నని గీతలు, ముడతలు, వయసు కారణంగా వచ్చే మచ్చల్ని తగ్గిస్తాయి. అంతేకాకుండా, చర్మాన్ని దృఢంగా, యవ్వనంగా మారుస్తాయి. ఇందులోని విటమిన్ సి కొల్లాజెన్ సంశ్లేషణకి చాలా ముఖ్యం. దీనిని రెగ్యులర్‌గా తీసుకుంటే కొల్లాజెన్ లెవల్స్ పెరుగుతాయి. ఇది స్కిన్‌ని సాఫ్ట్‌గా చేస్తాయి. అంతేకాకుండా ఉసిరి రసాన్ని తీసుకుంటే నల్లని మచ్చలు, మొటిమల మచ్చలు, హైపర్ పిగ్మెంటేషన్ తగ్గుతుంది. దీని వల్ల రక్తం శుద్ధి అవుతుంది. స్కిన్ టోన్ మెరుగ్గా మారడానికి హెల్ప్ అవుతుంది. దీనిలోని సహజ శోథ నిరోధక, యాంటీ బ్యాక్టీరియల్ గుణాల కారణంగా మొటిమలకి కారణమయ్యే బ్యాక్టీరియాని తొలగించి మొటిమలని తగ్గిస్తాయి. ఈ రసమంలో సహజ తేమని నిలుపుకునే గుణాలు ఉన్నాయి. ఇవి చర్మాన్ని లోపలి నుండి హైడ్రేట్ చేస్తాయి. ఇది సున్నితమైన క్లెన్సర్‌గా పనిచేస్తుంది. చనిపోయిన చర్మ కణాలని తొలగించి మెరిసేలా చేస్తుంది. అంతేకాకుండా ఉసిరిలోని యాంటీ ఆక్సిడెంట్స్ యువి రేడియేషన్, పర్యావరణ కాలుష్య కారకాల నుండి హానికరమైన ప్రభావాల నుండి రక్షణని అందిస్తాయి. దీంతో ఆక్సీకరణ నష్టాన్ని తగ్గిస్తాయి. చర్మాన్ని మెరుగ్గా మారుస్తాయి.

తేనె: తేనెలో నేచురల్ హైడ్రేట్ గుణాలు ఉన్నాయి. ఇవి నేచురల్ మాయిశ్చరైజర్‌గా పనిచేస్తాయి. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు మొటిమల్ని తగ్గడానికి హెల్ప్ చేస్తాయి. అంతేకాకుండా, స్కిన్ ఇరిటేషన్‌ని తగ్గిస్తాయి. ఇది సహజ ఆల్ఫా హైడ్రాక్సీ యాసిడ్స్‌లు సున్నితంగా ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది. ఇది స్కిన్‌ని మృదువుగా చేస్తుంది. ఫ్రీ రాడికల్స్‌తో పోరాడే యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. కుంకుమపువ్వు: కుంకుమపువ్వు చర్మాన్ని మెరిపించేలా చేస్తుంది. దీని వల్ల హైపర్ పిగ్మెంటేషన్, మొటిమలు తగ్గుతాయి. కుంకుమపువ్వులోని యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు వృద్ధాప్య లక్షణాలని తగ్గిస్తాయి. దీంతో చర్మ ఆకృతి మెరుగ్గా మారుతుంది. చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది. ఎండ వల్ల చర్మం దెబ్బతినకుండా కాపాడుతుంది. దీంతో స్కిన్ డ్రైగా కాకుండా ఉంటుంది.

గమనిక :ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి సమయం తెలుగు బాధ్యత వహించదు.

## నువ్వుల నూనెతో ఆరోగ్యం, అందం ఒకే చోట!




నువ్వుల నూనె జుట్టు ఆరోగ్యానికి అద్భుతమైన ఔషధంగా పనిచేస్తుందని నిపుణులు సిఫారసు చేస్తున్నారు. ఈ నూనెలోని ఒమేగా-3, ఒమేగా-6 ఫ్యాటీ ఆమ్లాలు జుట్టు రాలడాన్ని నియంత్రించి, ఒత్తుగా, బలంగా పెరిగేలా సహాయపడతాయి.అంతేకాదు, ఈ నూనె తలకు రక్తప్రసరణను మెరుగుపరిచి, జుట్టు కుదుళ్లను బలోపేతం చేస్తుంది. దీనివల్ల జుట్టు సహజంగా ఆరోగ్యవంతంగా, మెరిసేలా కనిపిస్తుంది. నువ్వుల నూనెలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు జుట్టుకు పోషణనిచ్చి, పొడిబారడాన్ని తగ్గిస్తాయి. ఈ యాంటీ ఆక్సిడెంట్లు జుట్టును నల్లగా, ప్రకాశవంతంగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అదనంగా, విటమిన్ ఇ, బి కాంప్లెక్స్ వంటి పోషకాలు జుట్టు ఆకృతిని మెరుగుపరుస్తాయి. క్రమం తప్పకుండా ఈ నూనెను ఉపయోగిస్తే, జుట్టు మృదువుగా, దృఢంగా మారుతుంది. చుండ్రు, తలలో దురద వంటి సమస్యలకు నువ్వుల నూనె ఒక సహజసిద్ధమైన పరిష్కారం. దీనిలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు తలలో ఇన్ఫెక్షన్లను నివారిస్తాయి. ఈ నూనెను వెచ్చగా తలకు మసాజ్ చేస్తే, చుండ్రు తగ్గడమే కాకుండా తల ఒత్తిడి కూడా తగ్గుతుంది. ఫలితంగా, జుట్టు ఆరోగ్యంగా ఉండటమే కాకుండా మనసు కూడా ఉత్తేజంగా ఉంటుంది. నువ్వుల నూనెను వారానికి రెండు లేదా మూడు సార్లు తలకు పట్టించడం ద్వారా ఉత్తమ ఫలితాలు పొందవచ్చు. రాత్రిపూట నూనె రాసి, ఉదయాన్నే షాంపూతో కడిగితే జుట్టు సమస్యలు గణనీయంగా తగ్గుతాయి. ఈ నూనెను కొబ్బరి నూనె లేదా బాదం నూనెతో కలిపి ఉపయోగిస్తే మరింత ప్రయోజనం కలుగుతుంది. సహజసిద్ధమైన ఈ పద్ధతితో జుట్టు అందాన్ని, ఆరోగ్యాన్ని సులభంగా సాధించవచ్చు.

## చలికాలంలో పిల్లలకు చెవి నొప్పి ఎందుకు వస్తుంది?



చలికాలం ప్రారంభమైంది. చలికాలం అనేక ఆరోగ్య సమస్యల్ని తీసుకువస్తుంది. వయసుతో సంబంధం లేకుండా శీతాకాలంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక రకమైన అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. అయితే వృద్ధులు, పిల్లలు చలికాలంలో అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా చలికాలంలో పిల్లల్ని రక్షించడం చాలా ముఖ్యం. వాళ్ల రోగనిరోధక శక్తి తక్కువ ఉంటుంది. దీంతో.. వాళ్లు వివిధ రకాల ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా పిల్లలకు జలుబు వస్తుంది. జలుబు వచ్చినప్పుడు.. పిల్లలకు చెవి నొప్పి వస్తుంది. దీంతో, తల్లిదండ్రులు భయపడి రకరకాల ఇంటి చిట్కాలు ట్రై చేస్తారు. కొందరు నొప్పిని తగ్గించడానికి తమ పిల్లల చెవుల్లో నూనె, నెయ్యి వంటి పదార్థాల్ని వేస్తారు. అయితే, ఇలా చేయడం పిల్లలకు హానికరం. చలికాలంలో పిల్లలకు చెవి నొప్పి ఎందుకు వస్తుంది, ఈ నొప్పిని తగ్గించడానికి ఏం చేయాలో డాక్టర్ సయ్యద్ హుస్సేన్ చెప్పారు. ప్రతి చెవినొప్పి ఇన్ఫెక్షన్ వల్ల రాదని డాక్టర్ సయ్యద్ వివరిస్తున్నారు. ముఖ్యంగా జలుబు సమయంలో ఒత్తిలో మార్పు పిల్లల చెవిలో తేలికపాటి నొప్పిని కలిగిస్తుందని ఆయన చెప్పారు. చెవి లోపల యుస్టాచియన్ ట్యూబ్ అనే సన్నని గొట్టం ఉంటుంది. ఇది చెవి, ముక్కు వెనుక భాగాన్ని కలుపుతుంది. పిల్లలకు జలుబు వచ్చినప్పుడు ఈ గొట్టం ఉబ్బుతుంది. దీంతో అది సరిగ్గా ఓపెన్ అవ్వదు. అంతేకాకుండా క్లోజ్ అవ్వదు. ఇది చెవి లోపల, బయట ఒత్తిడిలో వ్యత్యాసాన్ని సృష్టిస్తుంది. ఈ ఒత్తిడి చెవిపోటును విస్తరించి నొప్పిని కలిగిస్తుంది. వైద్యులు చెప్పేదాని ప్రకారం 60-70% మంది పిల్లలు జలుబు సమయంలో ఈ నొప్పిని అనుభవిస్తారు. కానీ ఇది ఎల్లప్పుడూ చీము, ఉత్సర్గ లేదా ఇన్ఫెక్షన్‌తో సంబంధం కలిగి ఉండదని డాక్టర్ సయ్యద్ హుస్సేన్ చెబుతున్నారు. ఇది కేవలం ఒత్తిడికి సంబంధించిన ఓటల్జియా లేదా ఒత్తిడి వల్ల కలిగే చెవి నొప్పి అని తెలిపారు. జలుబు తగ్గినప్పుడు నొప్పి దానంతట అదే తగ్గిపోతుంది. పిల్లలకు చెవి నొప్పి ఉంటే వైద్యుడిని సంప్రదించిన తర్వాత పారాసెటమాల్ వంటి సాధారణ నొప్పి నివారిణిని ఇవ్వొచ్చు.అంతేకాకుండా పిల్లలు ఆవిరి పీల్చేలా చేయండి. ఇది ముక్కును తెరిచి ఒత్తిడిని సమతుల్యం చేయడానికి సాయపడుతుంది.ముక్కు, చెవి గొట్టాలపై తక్కువ ఒత్తిడి ఉండేలా పిల్లల్ని నిటారుగా నిద్రపోయేలా చేయండి. చెవి చుట్టూ తేలికపాటి వెచ్చని కంప్రెస్ చేయడం వల్ల నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. పిల్లలకు చెవి నొప్పి ఉంటే తల్లిదండ్రులు టెన్షన్ పెడతారు. ఈ భయంలో ఇంటి చిట్కాల్ని ఫాలో అవుతుంటారు. ముఖ్యంగా నూనె, నెయ్యి వంటివి వేస్తుంటారు. లేదంటే.. మార్కెట్లో ఈయర్ డ్రాప్స్ కొని.. వేస్తుంటారు. అయితే, వైద్యుణ్ని సంప్రదించకుండా ఈయర్ డ్రాప్స్ వేయడం మంచిది కాదు. తప్పుడు చుక్కల్ని ఉపయోగించడం హానికరం. పిల్లలకు చెవి నొప్పి ఎక్కువగా ఉంటే.. వెంటనే వైద్యుణ్ని సంప్రదించడం మంచిది.

## ప్రెగ్నెన్సీ మొదటి 3 నెలల్లో ఎక్సర్‌సైజెస్ అస్సలు చేయొద్దు



ప్రెగ్నెన్సీ అయింది మొదలు డెలివరీ వరకూ ఆడవారు ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిది. ముఖ్యంగా మొదటి 3 నెలలు చాలా జాగ్రత్తగా ఉండాల్సిందే. ఈ టైమ్‌లో బరువులు ఎత్తడం, జర్నీలు చేయడం, వేడి వస్తువులు తినడం వంటివి చేయొద్దు. దీంతో పాటు కొన్ని వర్కౌట్స్‌ని కూడా అవాయిడ్ చేయాల్సిందే. స్టార్టింగ్ స్టేజ్‌లోనే మిస్ క్యారేజెస్‌కి ఎక్కువగా అవకాశం ఉంటుంది. కాబట్టి, అలాంటి వాటిని మనం అవాయిడ్ చేస్తే చాలా వరకూ మనం అబార్షన్ రిస్క్‌ని తప్పించుకోవచ్చు. దీని గురించి యోగా టీచర్ రాధిక చెబుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన వీడియోలో ప్రెగ్నెన్సీ ఫస్ట్ ట్రైమెస్టర్‌లో కొన్ని ఎక్సర్‌సైజెస్‌ని అసలే చేయకూడదని, మరికొన్నింటిని యాడ్ చేయాలని చెబుతున్నారు. ప్రెగ్నెన్సీ టైమ్‌లో కష్టమైన వర్కౌట్స్ అవాయిడ్ చేయాలి. నిజానికీ ఇంటెన్సిటీ వర్కౌట్స్ చాలా కష్టంగా ఉంటాయి. వీటిని చేయడం వల్ల బాడీలో టెంపరేచర్ పెరుగుతుంది. హెవీ జంప్స్, లిఫ్టింగ్ వంటి పనులు తల్లీ, కడుపులోని బిడ్డకి ప్రమాదమే. కాబట్టి, ఇలాంటివి అసలే చేయకూడదు. వీటిని కచ్చితంగా అవాయిడ్ చేయాల్సిందే. లేదంటే సమస్యల్ని కోరి తెచ్చుకున్నవారవుతారు. కొంతమంది నార్మల్ టైమ్‌లో హిప్ ఓపెన్ చేసి కిందకి వంగి వర్కౌట్స్ చేస్తారు. ప్రెగ్నెన్సీ కోసం డీప్ హిప్ ఓపెనింగ్ వర్కౌట్స్‌లో గార్లాండ్ పోజ్ మలసానా, బటర్ ఫ్లై పోజ్, హిప్ ఫ్లెక్సర్ స్ట్రెచెస్ ఉన్నాయి. వీటిని చేయకపోవడమే మంచిది. వీటి వల్ల సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, వీటిని అవాయిడ్ చేయడమే మంచిది. ఇలా కిందకి కూర్చోవడం, సడెన్‌గా పైకి లేవడం వంటివి చేయొద్దు. దీంతో పాటు కొంతమంది వంగి బట్టలు నీటిలో తీయడం చేస్తారు. అలా చేయొద్దు. సరల్ విపరీత కరణిదీనిని గోడకి ఆనుకుని కాళ్ళని పైకి ఎత్తే పోజ్ అని చెప్పొచ్చు. ప్రెగ్నెన్సీ టైమ్‌లో ఇది మంచిది. దీని వల్ల ఎన్నో బెనిఫిట్స్ ఉంటాయి. మంచి సపోర్ట్, జాగ్రత్తలతో చేయొచ్చు. ఇది ప్రెగ్నెన్సీలో వచ్చే సమస్యల్ని తగ్గించొచ్చు. కానీ, ముఖ్యంగా నెలలు గడిచే కొద్దీ ఈ వర్కౌట్ చేసే ముందు డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది. ఎందుకంటే, మీ బేబి పొజిషన్‌ని బట్టి ఇలాంటి వర్కౌట్స్ చేయొచ్చో లేదా చెబుతారు. ప్రెగ్నెన్సీలో డీప్ బ్రీథింగ్ తీసుకోవడం మంచిది. ఒత్తిడి, ఆందోళనను నిర్వహించడానికి ప్రయోజనకరంగా ఉంటుంది. శ్వాస ఆడకపోవడం వంటి అసౌకర్యాలను తగ్గించడానికి హెల్ప్ చేస్తుంది. కీలకమైన పద్ధతులలో లోతైన ఉదరశ్వాస, ఇది ఆక్సిజన్ తీసుకోవడం పెంచుతుంది. ప్రసవ సమయంలో ప్రశాంతంగా, దృష్టి కేంద్రీకరించడానికి ఉపయోగించే వివిధ లయబద్ధమైన శ్వాస విధానాలు ఉన్నాయి. శ్వాస ఆడకపోవడం అకస్మాత్తుగా లేదా తీవ్రంగా ఉంటే రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేయడం, వైద్యుడిని సంప్రదించడం ముఖ్యం. మెడిటేషన్ చేయడం కూడా చాలా మంచిది. దీని వల్ల తల్లీ, బిడ్డలిద్దరికీ చాలా మంచివి. వీటి వల్ల ఒత్తిడి, ఆందోళనని తగ్గించడంలో నిద్ర నాణ్యతని మెరుగుపరచడంలో, ప్రశాంతతని పెంపొందించడంలో సాయపడతాయి. మంత జపం, డీప్ బ్రీథ్, మైండ్‌ఫుల్‌నెస్, విజువలైజేషన్ వంటి పద్ధతులు సాధారణంగా ఉపయోగించబడతాయి. కానీ, మీకు సౌకర్యవంతమైన అభ్యాసాన్ని కనుగొనడం ఉత్తమం.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com

## బిజినెస్

# కొండదిగుతున్న బంగారం..
# ఒకేరోజు తగ్గిన రూ 5 వేలు ధర

### రూ.76,248 కోట్లకు టీఎమ్‌పీవీఎల్ లాభం




టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ ఏకీకృత ఖాతాల ప్రకారం సెప్టెంబరు త్రైమాసికంలో రూ.76,248 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. బ్రిటిష్ అనుబంధ సంస్థ జేఎల్‌ఆర్‌పై సైబర్ దాడి కారణంగా కార్యకలాపాలు ఆగడం ప్రధాన కారణం. 2024-25 ఇదే మూడు నెలల్లో లాభం రూ.3,521 కోట్లుగా ఉంది. ఈసారి జేఎల్‌ఆర్ కార్యకలాపాల నిలిపివేత వల్ల రూ.82,600 కోట్ల లాభం వచ్చిందని ఎక్స్ఛేంజీలకిచ్చిన సమాచారంలో కంపెనీ తెలిపింది. వాణిజ్య వాహనాల వ్యాపార విభజన, బదిలీ వల్ల వచ్చిన లాభం కూడా ఇందులో ఉంది. కార్యకలాపాల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం రూ.83,656 కోట్ల నుంచి రూ.72,349 కోట్లకు తగ్గింది. తగ్గిన జేఎల్‌ఆర్ ఆదాయం : జేఎల్‌ఆర్ ఆదాయం 24.3% తగ్గి 4.9 బిలియన్ పౌండ్ల (దాదాపు రూ.57,200 కోట్ల)కు చేరుకుంది. సైబర్ దాడితో జేఎల్‌ఆర్ ఆర్థిక అంశాలపై ప్రభావం పడింది. ఎబిట్ మార్జిన్ -8.6 శాతంగా నమోదైంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో టాటా ప్యాసింజరు వాహన వ్యాపార ఆదాయం 15.6% వృద్ధితో రూ.13,500 కోట్లకు చేరుకుంది. ప్యాసింజరు వాహనాలు(పీవీ), విద్యుత్ వాహనాల(ఈవీ) అమ్మకాలు 10.8% పెరిగి 1,44,500 యూనిట్లకు చేరాయి. సైబర్ దాడుల వల్ల జేఎల్‌ఆర్ వినియోగదార్ల సమాచారం లీక్ అయ్యే అవకాశంపై ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చినట్లు టాటా మోటార్స్ గ్రూప్ సీఎఫ్‌ఓ పీబీ బాలాజీ తెలిపారు. ఈ ఏడాది ఆగస్టులో సైబర్ దాడులు జరగడంతో జేఎల్‌ఆర్ ప్లాంట్లలో తయారీ నిలిపేసిన సంగతి తెలిసిందే.

### జీఎస్టీ ఎఫెక్ట్.. నిరాశపరిచిన ఎక్సైడ్ ఇండస్ట్రీస్




బ్యాటరీ తయారీ సంస్థ ఎక్సైడ్ ఇండస్ట్రీస్ సెప్టెంబర్ త్రైమాసికంలో పనితీరు పరంగా ఇన్వెస్టర్లను మెప్పించలేకపోయింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 26 శాతం తగ్గి రూ.174 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.233 కోట్లుగా ఉంది. ఆదాయం సైతం ఈ కాలంలో 2 శాతం తగ్గి రూ.4,364 కోట్లుగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ కాలంలో లాభం రూ.448 కోట్లుగా ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో లాభం రూ.454 కోట్లతో పోల్చి చూస్తే ఒక శాతం తగ్గింది. జీఎస్టీ రేట్ల మార్పు ప్రభావం సెప్టెంబర్ త్రైమాసికం పనితీరుపై ప్రభావం చూపించినట్టు కంపెనీ తెలిపింది. బ్యాటరీలపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడాన్ని గుర్తు చేసింది. రేట్లు తగ్గిన తర్వాత కొత్త స్టాక్‌ను తెప్పించుకుందామని భాగస్వాములు భావించడంతో డిమాండ్ స్తబ్దుగా ఉన్నట్టు వివరించింది. లిథియం అయాన్ బ్యాటరీ ప్లాంట్ నిర్మాణం ఆశించిన విధంగా పురోగతిలో ఉన్నట్టు కంపెనీ ఎండీ, సీఈవో అవిక్‌రాయ్ తెలిపారు.

**రూ.1.21 లక్షలకు పడిపోయిన తులం విలువ**

**న్యూఢిల్లీ :** బంగారం కొండదిగుతున్నది. రికార్డుల మీద రికార్డుల బద్దలు కొట్టిన పుత్తడి గడిచిన పక్షం రోజుల్లో భారీగా పతనమైంది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతోపాటు అమెరికా షట్‌డౌన్ ముగియడం, ఇప్పట్లో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు లేవని ఫెడరల్ రిజర్వు సంకేతాలివ్వడంతో బంగారం ధరలు భారీగా పడిపోయాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల బంగారం శనివారం ఒకేరోజు రూ.5000 తగ్గి రూ.1,21,895కి దిగొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర శుక్రవారం ఒకేరోజు 127 డాలర్లు పడిపోవడం కూడా గోల్డ్ ధర తగ్గడానికి ప్రధాన కారణమని బులియన్ వర్తకులు పేర్కొన్నారు.

**రూ.8 వేలు దిగొచ్చిన కిలో వెండి**

బంగారంతోపాటు వెండి ధరలు దిగొచ్చాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి ఏకంగా రూ.8,700 తగ్గి రూ.1,53,720కి తగ్గింది. కోమెక్స్ మార్కెట్లో ఔన్స్ వెండి 5.56 శాతం తగ్గి 50.21 డాలర్లకు పడిపోవడం కూడా మరో కారణం.

**భవిష్యత్తులో డిమాండ్ అంతంతే**

ప్రస్తుతం తగ్గుముఖం పట్టిన బంగారం భవిష్యత్తులో డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండనున్నదని విశ్లేషకులు అంటున్నారు. స్వల్పకాలంపాటు బంగారం ధరలు దిద్దుబాటుకు గురికావచ్చుని అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. దేశీయంగా పండుగ సీజన్ కూడా ముగియడం, ఇప్పట్లో పెళ్లిళ్లు కూడా లేకపోవడంతో డిమాండ్ గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉన్నదని వారు హెచ్చరిస్తున్నారు.




పసిడి ధరలు తగ్గడానికి కారణాలు..

ఇప్పట్లో వడ్డీరేట్లు తగ్గించే అవకాశాలు లేవని ఫెడరల్ రిజర్వు ప్రకటించడం

అమెరికా షట్‌డౌన్ ముగియడం..

ఇతర కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలపడటం

# జియో కొత్త రీచార్జ్.. 200 రోజుల చౌక ప్లాన్

టెలికాం రంగంలో అతిపెద్ద యూజర్ బేస్, రీఛార్జ్ ప్లాన్ల విస్తృత పోర్ట్‌ఫోలియోను కలిగి ఉన్న రిలయన్స్ జియో.. తన కస్టమర్ల కోసం తక్కువ-ధర, హై-ఎండ్ విభాగాలలో విస్తృత శ్రేణి ప్లాన్‌లను అందిస్తోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ రోజులు సిమ్ కార్డును యాక్టివ్‌గా ఉంచుకోవాలనుకునే కస్టమర్ల కోసం దీర్ఘకాల వ్యాలిడిటీతో చౌక రీచార్జ్‌ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. మిలియన్ల మంది మొబైల్ వినియోగదారుల అవసరాలను గుర్తించి, జియో ఇప్పుడు దీర్ఘకాలిక వ్యాలిడిటీ రీఛార్జ్ ప్లాన్ల జాబితాలో చేర్చిన ప్లాన్ ధర రూ.2025. ఖరీదైన 365 రోజుల రీఛార్జ్ ప్లాన్ కొనడానికి ఇష్టపడని కస్టమర్లకు ఈ ప్లాన్ ఉత్తమ ఎంపిక. జియో ఈ ప్లాన్‌ను ఉత్తమ 5జీ ప్లాన్లలో ఒకటిగా లిస్ట్ చేసింది.

**ప్లాన్ ప్రయోజనాలు**

జియో తన రూ.2025 ప్రీపెయిడ్ రీఛార్జ్ ప్లాన్ తో వినియోగదారులకు 200 రోజుల సుదీర్ఘ వాలిడిటీని అందిస్తుంది. అన్ని మొబైల్ నెట్ వర్క్ లకు 200 రోజుల పాటు అపరిమిత కాలింగ్ ను ఆనందించవచ్చు. ఇక డేటా ప్రయోజనాల విషయానికి వస్తే.. 200 రోజుల పాటు మొత్తం 500 జిబి డేటాను అందిస్తుంది. రోజుకు 2.5 జీబీ వరకు హై స్పీడ్ డేటాను వినియోగించుకోవచ్చు. ఇంకా ఈ ప్లాన్ లో రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు ఉన్నాయి. ఈ ప్లాన్ తో అపరిమిత 5జీ డేటాను ఆనందివచ్చు. జియో యూజర్లు ఈ




ప్లాన్ తో కొన్ని అదనపు ప్రయోజనాలను కూడా పొందుతారు. ఈ ప్లాన్ లో మూడు నెలల పాటు జియో హాట్ స్టార్ కు ఉచిత సబ్ స్క్రిప్షన్ కూడా ఉంది. మీరు టీవీ ఛానెల్స్ చూడాలనుకుంటే జియో టీవీకి కూడా ఉచిత యాక్సెస్ పొందుతారు. డేటా స్టోరేజ్ కోసం 50 జీబీ జియో ఏఐ క్లౌడ్ స్టోరేజ్ కూడా ఈ ప్లాన్ లో ఉంది.

# చెలరేగిన భారత బౌలర్లు..
# 132 పరుగులకే సౌతాఫ్రికా ఆలౌట్

రాజ్‌కోట్ వేదికగా సౌతాఫ్రికా-ఎతో జరుగుతున్న మ్యాచ్‌లో భారత్-ఎ బౌలర్లు నిప్పులు చెరిగారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా-ఎ జట్టు.. భారత బౌలర్ల ధాటికి 30.3 ఓవర్లలో కేవలం 132 పరుగులకే కుప్పకూలింది. యువ ఆల్‌రౌండర్ నిశాంత్ సింధు అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శన కనబరిచాడు. సింధు తన స్పిన్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పు తిప్పలు పెట్టాడు. ఈ హర్యానా ఆటగాడు 7 ఓవర్లు బౌలింగ్ చేసి కేవలం 16 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అతడితో పాటు హర్షిత్ రాణా మూడు, ప్రసిద్ధ్ కృష్ణ రెండు వికెట్లు సాధించారు. సౌతాఫ్రికా బ్యాటర్లలో మూన్‌స్వామి(33) టాప్ స్కోరర్‌గా నిలవగా.. పాటిగిటర్(23), ప్రిటోరియస్(21) రాణించారు. మొత్తం ఐదుగురు బ్యాటర్లు సింగిల్ డిజిట్ స్కోర్‌కే పరిమితమయ్యారు. కాగా తొలి మ్యాచ్‌లో సౌతాఫ్రికా-ఎ జట్టును 4 వికెట్ల తేడాతో భారత్ చిత్తు చేసింది. ప్రస్తుతం మూడు మ్యాచ్‌ల సిరీస్ మెన్ ఇన్ బ్లూ 1-0 ఆధిక్యంలో ఉంది.

**తుది జట్లు భారత్**

రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ, ఆయుష్ బదోని, తిలక్ వర్మ(కెప్టెన్), ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి,నిశాంత్ సింధు,హర్షిత్ రాణా, విప్రజ్ నిగమ్,అర్ష్‌దీప్ సింగ్,ప్రసిద్ కృష్ణ

**సౌతాఫ్రికాజి**




రివాల్డో మూన్సామి(వికెట్ కీపర్), లువాన్-డ్రే ప్రిటోరియస్, జోర్డాన్ హెర్మాన్, మార్క్వెస్ అకెర్మాన్(కెప్టెన్), సినెథెంబ క్వెషిలే, డయాన్ ఫారెస్టర్, ప్రెనెలన్ సుబ్రాయెన్, లూథో సిపమ్లా, డెలానో పోట్గీటర్, న్కాబయోమ్జి పీటర్, ఒట్నీల్ బార్ట్‌మన్

## శాంసన్ నిజాయతీపరుడు..
## రాజస్థాన్‌ను ఎందుకు వీడాడంటే..?



ఐపీఎల్‌లో బిగ్గెస్ట్ ట్రేడ్‌డీల్‌లో సంజూ శాంసన్‌ను చెన్నై సూపర్ కింగ్స్ దక్కించుకుంది. ఏడేళ్లుగా రాజస్థాన్ రాయల్స్ తో కొనసాగిన సంజూ ఇప్పుడు చెన్నై జెర్సీతో మైదానంలోకి దిగనున్నాడు. సంజూ రాజస్థాన్‌కు గుడ్ బై చెప్పడానికి కారణాలు లేకపోలేదు. కొన్ని సీజన్లుగా జట్టు ప్రదర్శన ఆశించినతంగా లేకపోవడంతో నిరాశచెందిన శాంసన్.. కొత్త ఫ్రాంచైజీకి ఆడేందుకు నిర్ణయించుకున్నాడు. తమ జట్టుకు పద్నాలుగేళ్లు ఆడిన శాంసన్‌ను వదిలేయడంపై రాజస్థాన్ యజమాని మనోజ్ బడలే ఏం చెప్పాడంటే..? 'ఈ ఏడాది.. అంతకంటే ముందు నుంచి కూడా శాంసన్ తాను జట్టు మారాలని అనుకుంటున్నట్టు చెప్పాడు. అతడలా మాతో చెప్పగానే అందరం షాకయ్యాం. టీమ్ మేనేజ్‌మెంట్ సమావేశమై చర్చించాం. సంజూ చాలా నిజాయతీపరుడు. కానీ, అతడు వ్యక్తిగతంగా డల్‌గా కనిపించాడు. రాజస్థాన్ ఫ్రాంచైజీ అంటే అతడికి చాలా ఇష్టం, గౌరవం. గత పద్దెనిమిది సీజనల్లో ఒకస్కారి కూడా విజేతగా నిలవకపోవడం కూడా సంజూలో మార్పు తెచ్చింది. పద్నాలుగేళ్లు అతడు రాజస్థాన్‌కు విశేష సేవలందించాడు. ఐపీఎల్‌లో అతడు కొత్త జర్నీ చేయాలనుకుంటున్నాడు. ఇన్నాళ్లు రాజస్థాన్ అభిమానులు అతడి ఆటలను, సిక్సర్లను ఎంతో ఎంజాయ్ చేశారు' అని తెలిపాడు.

**2021లో కెప్టెన్సీ**


తొలిసారి 2013లో రాజస్థాన్‌కు ఆడిన శాంసన్ 2015 తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్‌కు వెళ్లాడు. అక్కడ మూడు సీజన్లు ఆడిన అతడు మళ్లీ 2018లో రాజస్థాన్ గూటికి చేరాడు. 2021లో కెప్టెన్సీ చేపట్టిన సంజూ మరసటి ఏడాదే జట్టును ఫైనల్ చేర్చాడు. కానీ, టైటిల్ పోరులో గుజరాత్ టైటాన్స్ విజేతగా నిలిచింది. పద్దెనిమిదో సీజన్‌లో గాయంతో కొన్ని మ్యాచ్‌లకు దూరమైన అతడు.. తిరిగి వచ్చేసరికి ప్లే ఆఫ్స్ రేసులో రాజస్థాన్ లేదు. పైగా రియాన్ పరాగ్ సారథిగా రాణించడం, యశస్వీకి జతగా వైభవ్ సూర్యవంశీ రూపంలో డేంజరస్ ఓపెనర్ దొరకడంతో సంజూ జట్టు మారడమే శరణ్యం అనుకున్నాడు. ఐపీఎల్ 18వ సీజన్ ముగియగానే అతడు సీఎస్కేకు అనుకూలంగా పోస్టులు పెట్టాడు. దాంతో.. వచ్చే ఏడాది సంజూ చెన్నైకి ఆడడం ఖాయమనుకున్నారంతా. అనుకున్నట్టే ట్రేడ్ డీల్ ద్వారా చెన్నై అతడిని కొనేసింది.

## స్పోర్ట్స్

### ఈడెన్స్‌లో అనూహ్య ఓటమి.. డబ్ల్యూటీసీలో టీమిండియాకు షాక్..!




ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ప్రతి విజయం ఫైనల్ అవకాశాల్ని మెరుగుపరుస్తుంది. అలానే ప్రతి ఓటమి ర్యాంక్‌ను తగ్గిస్తూ పోతోంది. ఇప్పుడు భారత జట్టు రెండో పరిస్థితిని ఎదుర్కొంటోంది. డబ్ల్యూటీసీ 2025-27 సీజన్‌లో ఇంగ్లండ్ గడ్డసూ సిరీస్ సమం చేసి.. వెస్టిండీస్‌ను వైట్‌వాష్ చేయడంతో మూడో ర్యాంక్‌లో నిలిచిన టీమిండియాకు పెద్ద షాక్. ఈడెన్ గార్డెన్స్‌లో అనూహ్య ఓటమితో భారత ర్యాంక్ పడిపోయింది. ఈడెన్ గార్డెన్స్‌లో టీమిండియాదే గెలుపు అనుకున్న ప్రతిఒక్కరూ కంగుతిన్నారు. స్వల్ప ఛేదనలో తడబడిన భారత ఆటగాళ్లు సమిష్టి వైఫల్యంతో జట్టును ముంచారు. స్పిన్ ట్రాక్‌ను కోరిమరి తయారుచేయించుకున్నప్పటికీ అదే పిచ్ మీద మనోళ్లు చేతులెత్తేశారు. 124 పరుగుల ఛేదనలో అక్షర్ పటేల్(26) మినహా ఏ ఒక్కరూ కూడా క్రీజులో నిలబడకపోవడంతో ఆలౌటై ఘోర పరాభవం చవిచూసింది. పదమూడేళ్ల తర్వాత ఈడెన్స్‌లో విక్టరీ కొట్టిన దక్షిణాఫ్రికా డబ్ల్యూటీసీ పట్టికలో రెండో స్థానానికి దూసుకెళ్లగా.. టీమిండియా నాలుగో స్థానంలో నిలిచింది. మూడు మ్యాచుల్లో మూడు నెగ్గిన ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉంది. గత మూడు మ్యాచుల్లో రెండు విజయాలు, ఒక ఓటమితో సఫారీ టీమ్ రెండో ర్యాంక్ కైవసం చేసుకుంది. ఒక విజయం, రెండు డ్రాలతో శ్రీలంక మూడో స్థానంలో కొనసాగుతోంది.




# శివ రీ రిలీజ్.. రెండు రోజుల్లోనే ఆల్‌టైమ్ వసూళ్లు!

నాగార్జున- ఆర్జీవీ కాంబోలో వచ్చిన కల్ట్ మూవీ శివ. తెలుగు సినీ ఇండస్ట్రీ గతిని మార్చేసిన ఈ చిత్రమిది. 1989లో థియేటర్లలో రిలీజైన ఈ మూవీతోనే రాం గోపాల్ వర్మ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇచ్చారు. ఈ కల్ట్ మూవీని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. అన్నపూర్ణ స్టూడియోస్ స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సినిమాను రీ రిలీజ్ చేశారు. ఈ మూవీని తాజాగా 4కె వర్షన్‌లో రీ రిలీజ్ చేశారు మేకర్స్. ఈనెల 14న వచ్చిన ఈ చిత్రం కోసం నాగ్ ఫ్యాన్స్ ఒక్కసారిగా థియేటర్లకు క్యూ కట్టారు. దీంతో తొలిరోజే ఈ చిత్రం ఏకంగా రూ.2.5 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. సరికొత్త 4కె వర్షన్‌లో రిలీజైన ఈ మూవీ రెండు రోజుల్లోనే రూ.3.95 కోట్ల కలెక్షన్స్ రాబట్టింది. ఈ విషయాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సోషల్ మీడియా ద్వారా పంచుకుంది. అప్పట్లోనే రూ.4 కోట్లు రాబట్టిన శివ.. రీ రిలీజ్‌లోనూ సత్తా చాటడం చూస్తుంటే ఈ సినిమా క్రేజ్ ఏంటో అర్థమవుతోంది. మరి ఈ వీకెండ్ అయ్యేసరికి 'శివ' ఇంకెన్ని కోట్లు కలెక్షన్ సాధిస్తుందో వేచి చూడాల్సిందే.




# నందమూరి అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్.. 3డీ ఫార్మాట్‌లో 'అఖండ 2'

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'అఖండ 2' ఈ మూవీ గురించి చిత్ర బృందం సినీ అభిమానులకు ఒక ఆసక్తికరమైన అప్‌డేట్‌ను అందించింది. తాజాగా నిర్వహించిన 'అఖండ 2' బిగ్ రివీల్ ప్రెస్‌మీట్‌లో చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ ఈ సీక్వెల్‌ను సాధారణ 2డీ వెర్షన్‌తో పాటు 3డీ ఫార్మాట్‌లో కూడా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమలోనే గొప్ప అనుభూతిని పంచే సినిమాల్లో 'అఖండ 2' ఒకటిగా నిలవనుంది. 3డీ ఫార్మాట్‌లో ఈ సినిమాను చూడటం ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని ఇస్తుంది అని టీమ్ ధీమా వ్యక్తం చేసింది. బోయపాటి మార్క్ భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు 3డీలో మరింత అద్భుతంగా ఉంటాయని అభిమానులు ఆశిస్తున్నారు. బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న ఈ చిత్రం, గతంలో సంచలనం సృష్టించిన 'అఖండ'కు సీక్వెల్‌గా వస్తోంది. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

# మరోసారి థియేటర్స్‌లో 'ఆవారా'


ప్రస్తుతం సినీ ఇండస్ట్రీలో రీరిలీజ్ ట్రెండ్ జోరుగా సాగుతోంది. స్టార్ హీరోల సినిమాలతోపాటు చిన్న హీరోల మూవీస్ కూడా థియేటర్లలో రీరిలీజ్ అవుతూ ఎంతో పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంటున్నాయి. కొన్ని చిత్రాలు రిలీజ్ సమయంలో కంటే రీరిలీజ్‌లో మరింత ఎక్కువ వసూళ్లు సాధించి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. ఇలా రీరిలీజ్ సినిమాలు ఎంజాయ్ చేస్తున్నా సిని లవర్స్‌కు ఇప్పుడు మరో గుడ్ న్యూస్ అందింది. మ్యూజికల్ హిట్‌గా నిలిచిన 'ఆవారా' చిత్రం రీరిలీజ్ అయ్యేందుకు సిద్ధం అవుతోంది. కార్తీ, తమన్నా జంటగా నటించిన ఈ చిత్రానికి ఎన్. లింగుస్వామి దర్శకత్వం వహించారు. 2010లో విడుదలైన 'ఆవారా' మ్యూజికల్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచి, యూత్‌ను కట్టిపడేసిన సాంగ్స్‌తో ఇప్పటికీ గుర్తుండిపోతోంది. ఈ పాటలు ఇంకా చెవుల్లో మార్మోగుతూనే ఉంటాయి. బాక్సాఫీస్ వద్ద మ్యూజికల్ హిట్‌గా రికార్డులు సృష్టించిన 'ఆవారా' మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. 'ది ఎవర్ రిఫ్రెషింగ్ లవ్ స్టోరీ ఆవారా... నవంబర్ 22న తిరిగి థియేటర్లలో! మ్యూజికల్ హిట్‌ను మరోసారి ఎంజాయ్ చేయండి' అంటూ విడుదల చేసిన పోస్టర్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.





# నాకు పర్సనల్ ఫోన్ నంబర్ లేదు

తెలంగాణలోని వనపర్తి సంస్థానికి చెందిన అదితీ రావు హైదరీ ప్రస్తుతం హీరోయిన్‌గా తెలుగు, తమిళ, హిందీ సినిమాలు చేస్తోంది. హీరో సిద్దార్థ్‌ని పెళ్లి చేసుకుని ప్రస్తుతం ఫ్యామిలీ లైఫ్ ఎంజాయ్ చేస్తోంది. అయితే ఈమె పేరు చెప్పి ఓ వ్యక్తి.. పలువురు ఫొటోగ్రాఫర్స్‌ని మోసం చేస్తున్నాడు. ఇది అదితీ దృష్టికి వచ్చేసరికి స్వయంగా దీని గురించి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టి హెచ్చరించింది. 'వాట్సాప్‌లో నా పేరుతో ఎవరో ఓ వ్యక్తి.. ఫొటోషూట్స్ కోసం పలువురు ఫొటోగ్రాఫర్స్‌కి మెసేజులు చేస్తున్నాడు. కొందరు వ్యక్తులు ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకొచ్చారు. అయితే అది నేను కాదు. ఇలా నేను మెసేజ్ చేయను. చెప్పాలంటే నాకు వ్యక్తిగత ఫోన్ నంబర్ ఏం లేదు. నా టీమ్ ద్వారా నేను సంప్రదిస్తాను. కాబట్టి ఆ నంబర్ నుంచి మెసేజులు ఏమైనా వస్తే స్పందించొద్దు' అని అదితీ రావ్ హైదరీ తన ఇన్ స్టాలో పోస్ట్ పెట్టింది. సదరు మోసగాడి నంబర్ కూడా వెల్లడించింది. 2006 నుంచి అదితీ సినిమాలు చేస్తోంది. తెలుగు, తమిళ, మలయాళ, మరాఠీ, హిందీ భాషల్లో నటించింది. టాలీవుడ్‌లో 'సమ్మోహనం' ఈమెకు తొలి మూవీ. తర్వాత అంతరిక్షం, వీ, మహాసముద్రం చిత్రాల్లో నటించింది. 'సమ్మోహనం'తో హిట్ కొట్టినప్పటికీ మిగిలనవన్నీ ఫెయిల్ అయ్యాయి. 'మహాసముద్రం'లో నటిస్తున్న టైంలో హీరో సిద్ధార్థ్‌తో అదితీ ప్రేమలో పడింది. తర్వాత మూడేళ్ల పాటు ప్రేమించుకుని 2024లో వీళ్లిద్దరూ ఒక్కటయ్యారు.




# కొరగజ్జ మరో కాంతార కానుందా..? ఫస్ట్ లుక్‌తో సూపర్ హైప్

గ్రామీణ సంస్కృతి, ఆచారాల నేపథ్యంలో సాగే కథతో తెరకెక్కిన కాంతార బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయిలో హిట్‌గా నిలిచిందో తెలిసిందే. కన్నడ నాట నుంచి పలు భాషల్లో విడుదలై పాన్ ఇండియా బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఇప్పుడు మళ్లీ అలాంటి టచ్ ఇస్తూ శాండల్‌వుడ్ నుంచి మరో సినిమా రాబోతుంది. అదే 'కొరగజ్జ' కన్నడ, మలయాళం, హిందీ, తెలుగు, తమిళ్, తులు భాషల్లో రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు కబీర్ బేడీ కింగ్ ఆఫ్ ఉడయవరగా కనిపించబోతుండగా.. భవ్య, శృతి కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇటీవలే విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. కాంతార సినిమాను గుర్తు చేస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో లీడ్ క్యారెక్టర్ కొరగజ్జ థీమ్‌ను ప్రతిబింబించేలా సరికొత్త గెటప్‌లో కనిపిస్తూ.. కొరగజ్జ మరో కాంతార కాబోతుందని హింట్ ఇచ్చేస్తుంది. ఈ చిత్రానికి గోపీసుందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఈ మూవీలోని అన్ని పాటలను డైరెక్టర్ కమ్ రైటర్ సుధీర్ అత్తావర్ రాయడం విశేషం. కర్ణాటక తులునాడులో పూజింపబడే దైవం 'కొరగజ్జ' కథతో ఈ సినిమా రాబోతుంది. సుధీర్ అత్తవర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని త్రివిక్రమ్ సాఫల్య నిర్మిస్తున్నారు. రీసెంట్‌గా కర్ణాటకలోని మంగళూరులో ఆడియో లాంచ్ చేశారని తెలిసిందే. 'కాంతార' తరహాలో గ్రామీణ సంస్కృతి, ఆచారాలు కలబోసిన దైవగాథ ఇదని, ప్రేక్షకుల్లో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేలా ఉంటుందని డైరెక్టర్ సుధీర్ అత్తావర్ క్లారిటీ కూడా ఇచ్చాడు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com